ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ


epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

కడప

fb.com/vaartha Digital

Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

11-4-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 69 పేజీలు: 10+4 వెల: 6.50



**రూ. 3880 కోట్ల ప్రాజక్టులకు ప్రధాని శంకుస్థాపన**

**రెచ్చగొడితే మేం భయపడం చైనా విదేశాంగ ప్రతినిధి**

5లో

## ఐటి కంపెనీలకు నామమాత్రపు ధరకే

# భూ కేటాయింపులు



### రూ. 31,167 కోట్ల పెట్టుబడులు, 32,633 ఉద్యోగాలు

### ఉపాధి పొందినవారి వివరాలతో ప్రత్యేక పోర్టల్

**విజయవాడ, ఏప్రిల్ 10,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రానికి పెట్టుబడులు రావడం ఎంతముఖ్యమో... ఆ పెట్టుబడులు క్షేత్ర స్థాయిలో కార్య రూపం దాల్చడంకూడా అంతేముఖ్యం అని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. అనుకున్న సమయానికి ఆయా పరిశ్రమలు ఉత్పత్తి ప్రారంభించడం అవసరమని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఏదైనా ప్రాజెక్టుకు ఆమోదం తెలిపినప్పుడే...ఆ సంస్థ ఎప్పుడు ఉత్పత్తి ప్రారంభిస్తుందనే తేదీపై స్పష్టత తీసుకోవాలని చెప్పారు. ఆ తేదీకి అనుగుణంగా దశల వారీగా ప్రాజెక్టు పురోగతిని పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన 5వ ఎస్ఐపిబి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 17 సంస్థల పెట్టుబడులకు ఎస్ఐపిబి ఆమోదం తెలిపింది. ఐ అండ్ సీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఐటీ, ఎనర్జీ తదితర రంగాల్లో పెట్టుబడులు వస్తున్నాయి. తాజా ప్రతిపాదనలతో రూ.31,167 కోట్ల పెట్టుబడులు, 32,633 మందికి ఉద్యోగాలు రానున్నాయి. ఇప్పటివరకు ఎన్ని సంస్థలు ఉత్పత్తి ప్రారంభించాయి..ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయనేది వివరణాత్మకంగా తదుపరి ఎస్ఐపిబి సమావేశంలో రిపోర్ట్ ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఏ సంస్థ ఎవరెవరికి ఉద్యోగం ఇచ్చిందనే వివరాలతో పోర్టల్ కూడా రూపొందించాలని స్పష్టం చేశారు. సమావేశంలో పాల్గొన్న ఐటిఅండ్ హెఆర్డీ మినిస్టర్ లోకేష్... ఐటీ కంపెనీలకు నామమాత్రపు ధరలకే భూమి కేటాయింపులు జరిపేలా చూడాలని ముఖ్యమంత్రిని కోరారు. భూములు తక్కువ ధరకు ఇవ్వడం ద్వారా మరిన్ని ఐటీ కంపెనీలను ఆకట్టుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి అందుకు తగ్గట్టు ఐటీపాలసీని సవరించి తీసుకురావాల్సిందిగా సూచిం >>2



## తహవ్వుర్‌రాణా

# అరెస్టు

### తీహార్ జైలుకు తరలింపు

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** ముంబయి ఉగ్రదాడి సూత్రధారి తహవూర్ రాణాను ఎట్టకేలకు అమెరికా నుంచి భారత్‌కు తీసుకొచ్చారు. గురువారం మధ్యాహ్నం ఢిల్లీ విమానాశ్రయంలో దిగింది. ఆతడిని అక్కడినుంచి తీహార్‌జైలుకు తరలించే ఏర్పాట్లుచేస్తున్నారు. కమాండర్ల భద్రతా వలయంతో ఢిల్లీ ఎయిర్‌పోర్టు నిండిపోయింది. రాణా భారత్‌కు వచ్చాడని తెలియగానే ఎంతోమంది భారతీయులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. దేశ వాణిజ్య రాజధానిపై ఉగ్రదాడి జరగడానికి కారకుడైన తహవూర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. జైలులో అతడికి ప్రత్యేక ఏర్పాట్లేవీ చేయొద్దని కోరుతున్నారు. వీలైనంత త్వరగా రాణాను ఉరితీయాలని వాదిస్తున్నారు. రాణాను అమెరికా నుంచి భారత్‌కు తీసుకురావడం అనేది మోడీ సర్కారు ఘన విజయమని అభినందిస్తున్నారు. తహవూర్ రాణాను భారత్‌కు తీసుకొచ్చి జైల్లో వేశాక, ప్రత్యేక వసతులేవీ కల్పించకూడదన్నారు. బిర్యానీ, ప్రత్యేక సెల్ వంటివేవీ రాణాకు ఇవ్వకూడదని తౌఫిక్ పేర్కొన్నారు.

రాణా లాంటి నీచులకు ఉరే సరి అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రముఖ వార్తాసంస్థతో ఛోటూ చాయ్‌వాలా మాట్లాడుతూ ఉగ్రవాదులను ఎదుర్కోవడానికి దేశంలో కఠినమైన చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. "ముంబయి ఉగ్రదాడిలో ఎంతోమందిని చంపిన టెర్రరిస్ట్ అజ్మల్ కసబ్‌కు ఇచ్చినట్లుగా తహవూర్ రాణాకు జైలులో ప్రత్యేక సెల్ కానీ, బిర్యానీ కానీ ఇవ్వకూడదు. ఆ నీచుడికి అదనపు సౌకర్యాలేవీ కల్పించకూడదు. అందుకోసం రూ.కోట్లు ఖర్చు చేయకూడదు" >>2

## లే అవుట్లకు పట్టణాభివృద్ధి సంస్థల్లోనే

# అనుమతులు

**విజయవాడ ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** పది పట్టణాభివృద్ధి సంస్థల్లో భవన నిర్మాణాలకు లేఅవుట్లకు పట్టణ ప్రణాళిక విభాగం సంచాలకుని కార్యాలయం నుంచి ఇక అనుమతులు తీసుకోవాల్సిన పనిలేదు. పట్టణాభివృద్ధి సంస్థల్లోనే అనుమతులిచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏలూరు, కడప, ఒంగోలు, చిత్తూరు, పలమనేరు, బొబ్బిలి, శ్రీకాకుళం, పల్నాడు, బాపట్ల అమలాపురం పట్టణాభివృద్ధి సంస్థల్లో అధికారులు ఉద్యోగుల కొరత కారణంగా వాటి పరిధిలో వివిధ నిర్మాణాలకు పట్టణ ప్రణాళిక విభాగం సంచాలకుని కార్యాలయం నుంచి ఇప్పటివరకు అనుమతులు తీసుకునేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఐఎఎస్, గ్రూపు-1 అధికారులను పది పట్టణాభివృద్ధి సంస్థల్లో వైస్ ఛైర్మన్లుగా నియమించింది. పట్టణ ప్రణాళిక విభాగంలోనూ అధికారులు ఉద్యోగులను అందుబాటులో ఉంచారు. ఇకనుంచి పట్టణాభివృద్ధి సంస్థల్లోనే అన్ని రకాల అనుమతులు తీసుకోవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## 17 మంది డిఎస్పీలు బదలీలు

**విజయవాడ,ఏప్రిల్10, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో వెయిటింగ్‌లో ఉన్నవారితో సహా 17మంది డిఎస్పీలను బదిలీ చేస్తూ డిజిపి హరిష్‌కుమార్ గుప్తా గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసారు. వెయిటింగ్‌లో ఉన్న బి.జయరామ్‌ను రాజమండ్రి డీఎస్ఆర్పీగా నియమించారు. పి.మల్లిఖార్జున రావును వీ అండ్ ఈ డిఎస్పీగాను,ఎం.భక్తవత్సలంను తిరుపతి ఎస్‌డిపిఓగాను.వివి రమణ కుమార్‌ను ప్రకాశం జిల్లా విమెన్ పీఎస్ డీఎస్పీగాను, డి.సోమన్నను ఎసిబి డీఎస్పీగాను టి.శ్రీనివాసులను ఒంగోలు ఏపీఎస్పీ సెవెంత్ బెటాలియన్‌డీఎస్పీగాను. యు.బంగారాజుకు వీ అండ్ఈ డిఎస్పీగా కె.రవికుమార్‌కు సిఐడి డిఎస్పీగాను, >>2

## వైఎస్ భారతిపై అనుచిత వ్యాఖ్యలు టిడిపి కార్యకర్త అరెస్టు



**విజయవాడ ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ సిఎం జగన్ సతీమణి వైఎస్ భారతిపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన టిడిపి కార్యకర్త చేబ్రోలు కిరణ్‌పై టిడిపి అధిష్ఠానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మహిళలపై ఇలాంటి వ్యాఖ్యలను ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పింది. పార్టీ నుంచి కిరణ్‌ను సస్పెండ్ చేసింది. అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని నేతలను టిడిపి అధిష్ఠానం ఆదేశించింది. దీంతో పార్టీ నేతలు ఫిర్యాదు చేయడంతో గుంటూరు పోలీసులు చేబ్రోలు కిరణ్‌పై కేసు నమోదు చేశారు.

**చేబ్రోలు కిరణ్ అరెస్ట్...**

మాజీ సిఎం జగన్ సతీమణి వైఎస్ భారతిపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన >>2

# రోల్ మోడల్‌గా మంగళగిరి ఆసుపత్రి

## 13న శంకుస్థాపన: మంత్రి నారా లోకేష్

**మంగళగిరి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** మంగళగిరి ప్రజల 30 ఏళ్ల కల వంద పడకల ఆసుపత్రి నిర్మాణం. తనను 91వేల భారీ మెజార్టీతో గెలిపించి శాసనసభకు పంపడంతో మంగళగిరి ప్రజల మూడు దశాబ్దాల కలను నెరవేర్చేందుకు విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ సిద్ధమయ్యారు. అత్యాధునిక వసతులతో దేశానికే రోల్ మోడల్‌గా ఆసుపత్రి నిలిచేలా ఇప్పటికే ప్రణాళికలు రూపొందించారు. మంగళగిరి సమీపంలోని చినకాకాని వద్ద నిర్మించనున్న వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి ఈ నెల 13వ తేదీన విద్య, ఐటీ మంత్రి లోకేష్ శంకుస్థాపన చేయనున్నారు.

**దేశంలోనే అత్యుత్తమంగా మంగళగిరి వంద పడకల ఆసుపత్రి నిర్మాణం..**

ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రిని కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా, దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని మంత్రి నారా లోకేష్ ఇప్పటికే అధికారులకు దిశానిర్దేశం చేశారు. భవన నమూనాలు, ఆసుపత్రిలో అత్యాధునిక సదుపాయాల కల్పన విషయంలో పలుమార్లు అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. వైద్యులు, సిబ్బంది ప్రశాంత వాతావరణంలో పనిచేసేలా చూడాలన్నారు. ఏడాదిలోగా ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తిచేయాలని గడువు విధించారు.

**1,15,000 చదరపు అడుగుల్లో ఆసుపత్రి భవన నిర్మాణం..**

చినకాకాని వద్ద వంద పడకల ఆసుపత్రికి కేటాయించిన 7.35 ఎకరాల్లో 1,15,000 చదరపు అడుగుల్లో అత్యంత విశాలంగా ఆసుపత్రి భవనాన్ని నిర్మించనున్నారు. వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధికి రూ.52.20 కోట్లు వెచ్చించనున్నారు. ప్రస్తుతం జీ ప్లస్ వన్ విధానంలో ఆసుపత్రిని నిర్మిస్తుండగా భవిష్యత్‌లో విస్తరించుకునే అవకాశం ఉంది. ఆసుపత్రిలో మెడికల్, సర్జికల్, ఆర్థో, గైనిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్ విభాగాలను ఏర్పాటుచేయనున్నారు. వీటితో పాటు 3 ఆపరేషన్ థియేటర్లు, డయాలసిస్ సెంటర్, మంత్రి నారా లోకేష్ గారి సూచనల మేరకు తలసేమియా వార్డు, డీ అడిక్షన్ ఓపీ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.

**యువగళం హామీని నిలబెట్టుకున్న మంత్రి లోకేష్..**

యువగళం పాదయాత్రలో భాగంగా మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తానని నారా లోకేష్ హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గతేడాది అక్టోబర్ 23వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ విషయాన్ని కేబినెట్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి నారా లోకేష్ ప్రతిపాదనను మంత్రివర్గం ఆమోదించడంతో మంగళగిరి ప్రజల చిరకాల వాంఛ నెరవేరనుంది. తనకు ఎంత ఎక్కువ మెజార్టీ ఇస్తే.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు , ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తో అంతగా కొట్లాడి మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తీసుకొస్తానని ఎన్నికల సమయంలో నారా లోకేష్ పేర్కొన్నారు. అన్నట్లుగా రాష్ట్రంలోనే మూడో భారీ మెజార్టీ సాధించడంతో మంగళగిరి ప్రజలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటున్నారు.

**మంగళగిరి ప్రజల దశాబ్దాల కల...**

1986లో అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ అన్న ఎన్టీఆర్ మంగళగిరిలో ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభించారు. అనేక సంవత్సరాలుగా మంగళగిరి ఆసుపత్రిని వంద పడకల స్థాయికి పెంచాలంటూ ప్రజలు ప్రత్యేక కమిటీలుగా ఏర్పడి డిమాండ్ చేస్తున్నారు. వివిధ సందర్భాల్లో ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని ఎంతోమంది పాలకులకు వినతి పత్రాలు సమర్పించారు. అయినా ఫలితం లేదు. మంత్రి నారా లోకేష్ రాకతో ఆసుపత్రి కల సాకారం కానుంది.



**అభివృద్ధి, సంక్షేమానికి చిరునామాగా మంగళగిరి..**

దేశంలోనే మంగళగిరి నియోజకవర్గాన్ని నెం.1గా తీర్చిదిద్దేందుకు మంత్రి నారా లోకేష్ అహర్నిశలు కృషిచేస్తున్నారు. దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివాసంఉంటున్న నిరుపేద కుటుంబాలకు మొదటి విడతలో మూడువేల మందికి శాశ్వత ఇంటి పట్టాలు అందిస్తున్నారు. భూగర్భ డ్రైనేజీ, భూగర్భ వాటర్ పైప్ లైన్, భూగర్భ గ్యాస్, భూగర్భ కరెంట్ అందించేందుకు త్వరలోనే పనులు ప్రారంభించను న్నారు. వీటితో పాటు చెరువులు, పార్కులు అభివృద్ధి చేయనున్నారు. కళ్యాణ మండపాలు, కమ్యూనిటీ భవనాలు నిర్మించనున్నారు. ఎన్నిక లకు ముందే మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా 26 అభివృద్ధి, సంక్షేమ పథకాలతో లోకేష్ ప్రజలమనస్సు గెలుచుకున్నారు.

## భారీగా పెరిగిన ఎక్సైజ్ ఆదాయం

### బెల్టు షాపులు నిర్వహిస్తే లైసెన్సులే రద్దు చేస్తాం : మంత్రి కొల్లు రవీంద్ర

**అనంతపురం, ఏప్రిల్ 10, ప్రభాతవార్త బ్యూరో :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నూతన మద్య విధానం ద్వారా ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ నాణ్యమైన మద్యాన్ని అందిస్తున్నామని రాష్ట్ర ఎక్సైజ్, గనులు, భూగర్భ శాఖ మాత్యులు కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మద్యం షాపుల వారు ఎక్కడైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే మొదటిసారి ఫైనేసి రెండోసారి ఆయా దుకాణం లైసెన్సును రద్దు చేస్తా మాన్నారు. సిఎం చంద్రబాబుతో మాట్లాడి రాష్ట్రంలో ఎక్సైజ్ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టును భర్తీ చేస్తామన్నారు. మద్యం కుంభకోణంపై దర్యాప్తుకు సిట్ వేసామని, ఆ నివేదిక ఆధారంగా మద్యం కుంభకోణంలో బాధ లేని వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. గురువారం అనంతపురం రూరల్ మండలంలోని సోముల దొడ్డి గ్రామంలో నూతనంగా 11.10 కోట్ల రూపాయలతో నిర్మించిన ఐఎంఎఫ్ఎల్ డిపో గోడౌన్‌ను మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు, అనంతపురం, మడకశిర, సింగనమల ఎమ్మెల్యేలు పరిటాల సునీత దగ్గుబాటి వెంకటేశ్వర >>2

# 49% పెరిగిన ఆస్తిపన్ను వసూళ్లు



### పురపాక మంత్రి పొంగూరు నారాయణ

**విజయువాడ,ఏప్రిల్10,ప్రభాతవార్తప్రతినిధి:** మున్సిపాలిటీలు పారిశుధ్య నిర్వహణలో ప్రజల అవసరాలు తీర్చడంలో అధికారులు, సిబ్బంది అంకిత భావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో గురువారం మున్సిపల్ కమిషనర్ల రాష్ట్ర స్థాయి వర్క్ షాపును నిర్వహించారు.. ఆ వర్క్ షాపుకు ముఖ్య అతిధిగా హాజరైన మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ ప్రజల అవసరాలు తీర్చే విధంగా మున్సిపాలిటీలు స్వయం సమృద్ధి సాధించి వారికి కావలసిన నిధులను వారే ఖర్చుపెట్టే విధంగా అన్ని మున్సిపాలిటీల్లో ట్యాక్స్ రాబడి పెంచేలా పనిచేయాలన్నారు. మున్సిపల్ శాఖపై ప్రజల్లో సంతృప్తి శాతం పెరిగేలా మున్సిపల్ కమిషనర్లు పనితీరు ఉండాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు శాలిడ్ వేస్ట్, లిక్విడ్ వేస్ట్‌లతో పాటు త్రాగు నీరు, స్ట్రీట్ లైట్‌లు, రోడ్లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉందన్నారు. పేదలను ఇబ్బంది పెట్టకుండా పన్నుల వసూళ్లు పెరిగేలా కృషి చేయాలన్నారు గతేడాది కంటే ఈసంవత్సరం పన్నుల వసూళ్లు రూ. 500 కోట్లు ఎక్కువగా వసూలు చేసినందుకు మున్సిపల్ సిబ్బందికి మంత్రి అభినందనలు తెలియజేశారు. మున్సిపాలిటీల్లో రోజువారీ కార్యకలాపాలు నిర్వహణకు పన్నుల వసూలు చాలా కీలకం అన్నారు. పన్నుల ఆదాయంతో అనవసరమైన భవనాలు నిర్మించకుండా ఆ నిధులను ప్రజలకు కనీస వసతుల కల్పనకు మున్సిపాలిటీలు ఖర్చు చేయాలన్నారు. మున్సిపాలిటీల ఆదాయం ఆయా మున్సిపాలిటీలకు ఇచ్చేలా నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రాష్ట్ర ప్రజల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. గుంటూరులో కుక్క కరిచి బాలుడు మృతి చెందడం చాలా బాధాకరం అన్నారు. 200 రోజుల లోపు కుక్కలకు స్టెరిలైజేషన్ పూర్తి చేసేలా దృష్టి పెట్టాలన్నారు. మున్సిపాల్టీల్లో ఎస్టాబ్లిష్ మెంట్ మరియు మౌలిక వసతుల కల్పనలో ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. నెల్లూరు మున్సిపాలిటీలో గత 2014- 19 సంవత్సరాల్లో పన్నుల వసూళ్లలో మేము కొత్త విధానాన్ని అమలు చేసామన్నారు. దానివల్ల రూ. 1,067 కోట్లు నెల్లూరు మున్సిపాలిటీలో రెవెన్యూ ఖర్చు పోగా రూ.40 కోట్ల రూపాయలు మిగుల ఆదాయం అప్పట్లోనే తీసుకు >>2

# పెట్టుబడులకు పూర్తి భరోసా మాదే



ప్రముఖ ఆతిథ్యరంగ సంస్థల ప్రతినిధులతో మంత్రి దుర్గేష్

### పర్యాటక మంత్రి దుర్గేష్

**విజయవాడ,ఏప్రిల్10,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పర్యాటక విధానం 2024-29తో దేశంలో ఎక్కడా లేని విధంగా ఆతిథ్య రంగంలో అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని ఇన్వెస్టర్లతో పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. తొలి రోజు 30 కంపెనీలతో భేటీ అయిన మంత్రి కందుల దుర్గేష్, పర్యాటక శాఖ సెక్రటరీ అజయ్ జైన్, టూరిజం ఎండీ ఆమ్రపాలి కాట బృందం రెండో రోజు పర్యటనలో భాగంగా గురువారం ముంబయిలోని ది వెస్టిన్ ముంబయి పోవై లేక్‌లో ఏప్రిల్ 8-10 వరకు జరిగిన దక్షిణాసియా 20వ హోటల్ ఇన్వెస్ట్‌మెంట్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న 15 జాతీయ, అంతర్జాతీయ ప్రఖ్యాత హోటల్స్ గ్రూప్స్, ట్రావెల్స్ కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ప్రధానంగా ఆస్కాట్, అకార్ హోటల్స్, వెల్‌నెస్ రిసార్ట్స్‌లో పేర్గాంచిన బెల్జియం కంపెనీ >>2



గురువారం నర్సింగ్ విద్యాసంస్థల ప్రతినిధులతో సమీక్షిస్తున్న ఆరోగ్య మంత్రి సత్యకుమార్

## కామన్ ఎంట్రన్స్‌తోనే

# నర్సింగ్ విద్య

### ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,మే 10, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో నర్సింగ్ విద్యా సంస్థల ఏర్పాటు, నిర్వహణ,విద్యా నాణ్యత ప్రక్షాళనపై దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం నర్సింగ్ విద్యా వ్యవస్థను గాడిన పెట్టేందుకు పలు నిర్ణయాల్ని తీసుకుందని ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. నర్సింగ్ కాలేజీల అసోసియేషన్ ప్రతినిధులు ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో గురువారం మూడు గంటలకు పైగా పలు అంశాలపై డాక్టర్ ఎన్టీయార్ వైద్య విశ్వ విద్యాలయంలో చర్చించారు. ఈ సందర్భంగా నర్సింగ్ విద్యా రంగాన్ని మెరుగుపర్చేందుకు పలు నిర్ణయాలు తీసుకున్నారు. నర్సింగ్ కాలేజీల ప్రతినిధులు ప్రస్తావించిన పలు సమస్యలకు ఈ సమావేశంలో పరిష్కారాలు కనుగొన్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి నర్సింగ్ కాలేజీల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొని పలు సమస్యలకు పరిష్కారాలను కోరారు. వివిధ కారణాల వల్ల ప్రతి ఏడాదీ నవంబరులో జరుగుతున్న ప్రవేశాలకు చరమగీతం పాడి జులై నాటికి ప్రవేశాల ప్రక్రియను పూర్తి చేయాలని సమావేశంలో నిర్ణయించారు. నర్సింగ్ కాలేజీలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న పలు సమస్యల్ని ఈ నిర్ణయం పరిష్కరిస్తుందంటూ అసోసియేషన్ స్వాగతించింది.

2025-26 విద్యా సంవత్సరంలో నర్సింగ్ కామన్ ప్రవేశ పరీక్ష ద్వారా ప్రవేశాలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ పరీక్షను ప్రతి ఏడాదీ జూన్ రెండో వారంలో నిర్వహించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం అధికారుల్ని ఆదేశించారు. ఈ మేరకు ప్రవేశాలకు సంబంధించిన ప్రక్రియను ఏప్రిల్‌లో మొదలుపెట్టి జులైనాటికిపూర్తిచేయాల్సి ఉంటుంది. రాష్ట్రంలో బియస్సీ (నర్సింగ్) కోర్సుల్ని అందించే కాలేజీల్లో ప్రతి ఏటా దాదాపు 13,000 ప్రవేశాలు జరుగుతాయి. ఇట్టి ప్రవేశాలకు కామన్ ప్రవేశ పరీక్ష నిర్వహించడం మొదటి సారిగా ఎపిలో జరుగనుంది. ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించే నీట్, రాష్ట్రాల స్థాయిలో జరిగే ఎంసెట్ వంటి పోటీ పరీక్షల ద్వారా నర్సింగ్ విద్యలో ప్రవేశాలు చేస్తున్నారు. పలు రాష్ట్రాల్లో ఇంటర్మీడియట్ మార్కుల ఆధారంగా >>2



స్లోవేకియాలోని బ్రటిస్లావా నగరంలో జరిగిన రామాయణ ఎగ్జిబిషన్‌ను తిలకించిన రాష్ట్రపతి ముర్ముకు హనుమాన్ జ్ఞాపికను బహూకరిస్తున్న దృశ్యం

# ఎంట్రన్స్‌తోనే నర్సింగ్ విద్య

>> ప్రవేశాలు జరుగుతున్నా అది నర్సింగ్ విద్య చదివే వారి ప్రయోజనాలకు అవరోధంగా మారుతుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు. బైపిసి గ్రూపుతో ఇంటర్‌లో ఉత్తీర్ణులయ్యే విద్యార్థులు ఆన్ లైన్‌లో నిర్వహించే కామన్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాల్సి ఉంటుంది. జీఎన్ ఎం నర్సింగ్ కోర్సుల్లో కూడా ప్రవేశ పరీక్ష ద్వారా అడ్మిషన్లు చేపట్టేందుకు చట్టబద్ధమైన బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌ను ఏర్పాటు చేయాలన్న సూచనను మంత్రి అంగీకరించి తగు చర్యల్ని చేపట్టాలని ఆదేశించారు. మూడేళ్ల వ్యవధితో కూడిన జీఎన్ ఎం నర్సింగ్ కోర్సులకు వార్షిక బోధనా రుసుం రూ.15,000, నాలుగేళ్ల పాటు సాగే బియస్సీ(నర్సింగ్) కోర్సులకు రూ.19,000 గా మాత్రమే నిర్ధారించడం వల్ల నాణ్యమైన నర్సింగ్ విద్యను అందించడంలో సమస్యలు ఎదురవుతున్నాయని అసోసియేషన్ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం బోధనా రుసుంను నిర్ధారించడానికి అనుసరిస్తున్న విధివిధానాల్ని క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవిక ప్రాతిపదికలో ఈ విషయాన్ని పునసమీక్షించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారుల్ని ఆదేశించారు. నర్సింగ్ కాలేజీల ఏర్పాటు, వాటి నిర్వహణకు సంబంధించి ఇప్పటి వరకు ఆయా ప్రభుత్వాలు 52 జీఓలను విడుదల చేశాయని, దీని ఫలితంగా పరస్పర వైరుధ్యాలతో కూడిన జీఓల వల్ల గందరగోళం నెలకొందని, వీటన్నిటినీ పరిశీలించి సులభతర నిబంధనలను చేసే ఒక సమగ్ర జీఓను రూపొందించాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ విషయాన్ని పరిశీలించిన మంత్రి మూడు నెలల్లో జులై మాసంలో సమగ్ర జీఓను రూపొందించేలా తక్షణ చర్యల్ని తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. నర్సింగ్ విద్యా సంస్థల ఏర్పాటు, వాటి నిర్వాహణాలకు పలు ఫిర్యాదులొచ్చిన నేపథ్యంలో ఆయా విద్యా సంస్థల పత్రాల పరిశీలనలో వెల్లడైన అంశాలపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా సంస్థల ఏర్పాటుకు ప్రభుత్వం జారీ చేసే నిరభ్యంతర సర్టిఫికెట్, కాలేజీల నిర్వహించే ట్రస్టు/ సొసైటీల ఏర్పాటుకు సంబంధించిన పత్రాలు, స్వంత భవనాల లభ్యత, నియమాల మేరకు పేరెంట్ ఆసుపత్రుల లభ్యత వంటి అంశాలకు సంబంధించిన పత్రాల్ని అధిక మోతాదులో ఆయా సంస్థలు సమర్పించని వైనాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ అసోసియేషన్ ప్రతినిధులకు వివరించారు. నర్సింగ్ విద్యా సంస్థల ఏర్పాటు, నాణ్యమైన విద్యను అందించడంపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీకి అవకాశంలేదని, ఈ విషయాల్లో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. నిర్ధారించిన ఫీజుల కంటే ఎక్కువగా వసూలు చేయడం, పలు రకాలైన ఒత్తిళ్ల ద్వారా విద్యార్థుల నుంచి డబ్బు వసూలు చేస్తున్నారని కాలేజీ యాజమాన్యాలపై ఫిర్యాదులొస్తున్నాయని, ఈ వైఖరిని మార్చుకోవాలని మంత్రి హెచ్చరించారు. విద్యా సంవత్సరాన్ని నవంబరుకు బదులుగా జులైలోనే ప్రారంభించడానికి అంగీకారం కుదిరినందున ఇటీవల జరిగిన పత్రాల పరిశీలనలో పలు అంశాలకు సంబంధించిన వెల్లడైన లోపాల్ని ఆయా సంస్థలు వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే సవరించుకోవాలని, లేకుంటే ప్రవేశాలకు అనుమతించేది లేదని మంత్రిసత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. 20 ఏళ్ల తర్వాత నర్సింగ్ కాలేజీల యాజమాన్యాలతో పలు విషయాలపై చర్చించేందుకు సమావేశాన్ని ఏర్పాటు చేసి, పలు సమస్యలు పరిష్కారాలు చూపించినందుకు నర్సింగ్ కాలేజీల అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి సత్యకుమార్ యాదవ్ కు ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఆశయాల మేరకు నాణ్యమైన నర్సింగ్ విద్యను అందించేందుకు తమ వంతు పూర్తి సహకారాన్ని అందిస్తామని వారు హామీ ఇచ్చారు.

## మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తిపై కేసు నమోదు

**శ్రీసత్యసాయి జిల్లా, ఏప్రిల్ 10(ప్రభాతవార్త ప్రతినిధి):** ఈ నెల 8వ తేదిన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా హెలీ ప్యాడ్ వద్ద హెలికాప్టర్‌కు సాంకేతిక లోపం తలెత్తేలా చేశారన్న విషయమై రామగిరి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రామగిరి మండలం, పాపిరెడ్డిపల్లి గ్రామంలో మృతి చెందిన కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించడానికి విచ్చేసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో అక్కడ జరిగిన అల్లర్లకు బాధ్యుడిగా పేర్కొంటూ రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డితో పాటు ఆయన అనుచరులపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సిఐ తెలియజేశారు. బిఎన్ఎస్ సెక్షన్ 186,188,341,332ల క్రింద కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ప్రధానంగా హెలికాప్టర్ నిలబడే ప్రదేశంలో చుట్టూ ఏర్పరిచిన బారికేడ్లను ధ్వంసం చేసి విధులలో ఉన్న పోలీసులపై దాడిచేయడంతో పాటు వారిని తోసేసి హెలికాప్టర్‌కు సాంకేతిక లోపం తలెత్తేలా వ్యవహరించారని పేర్కొంటూ తోపుదుర్తి ఆయన అనుచరులపై కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు. ఈ అల్లర్లలో ఎవరెవరి ప్రమేయం ఎంతవరకు ఉందో సిసి ఫుటేజ్ ల ఆధారంగా తెలుసుకొని వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిసింది. కాగా జిల్లా ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి ఇప్పటికే దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తున్నది.

# పెట్టుబడులకు పూర్తి భరోసా మాదే

>> కొర్నెండాంక్, గ్రీన్ పార్క్ హోటల్స్, ఫెర్న్ హోటల్స్, యూఎస్ఏ కి చెందిన వైల్డ్ ఫ్లవర్ హోటల్స్,బ్రిగేడ్ హోటల్స్, వెల్ నెస్ బ్రాండ్ అయిన ఎలెనా తదితర హోటల్స్ గ్రూప్స్ ప్రతినిధులతో ప్రత్యేకంగా చర్చించారు. ఈ నేపథ్యంలో సింగపూర్‌కు చెందిన అస్కాట్ గ్రూప్ తమ సిటాడైన్స్ హోటళ్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టైర్ 2,3 నగరాల్లో నెలకొల్పేందుకు ఆసక్తిని కనబరిచారు. అకార్ హోటల్స్ ప్రతినిధులు రాష్ట్రంలోని అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాల్లో ఐబిస్ బ్రాండెడ్ హోటళ్లను ఏర్పాటు చేయాలని భావించింది. బ్రిగేడ్ హోటల్స్ యాజమాన్యం విశాఖపట్నం, తిరుపతి, హార్స్‌లీ హిల్స్‌లో పెట్టుబడులు పెట్టేందుకు సానుకూలత వ్యక్తం చేసింది. మొత్తంగా రెండు రోజుల ముంబయి పర్యటనలో మంత్రి కందుల దుర్గేష్ బృందం దాదాపు 45 ప్రఖ్యాత సంస్థలతో సమావేశమైంది. ఈ సందర్భంగా పిపిపి విధానంలో పర్యాటకాభివృద్ధి చేయాలని సంకల్పించామని ఈ క్రమంలో రాష్ట్ర పర్యాటక, ఆతిథ్య రంగంలో పెట్టుబడులు పెట్టి పర్యాటక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఇన్వెస్టర్లను ఆహ్వానించారు. పెట్టుబడిదారులకు మెరుగైన రాయితీలు, ప్రోత్సాహకాలను కల్పించి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని భరోసానిచ్చారు. అదే విధంగా రాష్ట్రంలోని ప్రముఖ గమ్యస్థానాలు, పెట్టుబడుల కోసం ప్రాధాన్యత ఇవ్వాలనుకుంటున్న ప్రదేశాలు, అందుబాటులో ఉన్న కనెక్టివిటీ, ప్రోత్సాహకాలు, సింగిల్ విండో క్లియరెన్స్, రాష్ట్ర పర్యాటక ప్రత్యేకతలు తదితరాల అంశాలను స్పష్టంగా వివరించారు. ఇన్వెస్టర్లతో మంత్రి కందుల దుర్గేష్ ఇంకా ఏమన్నారంటే వైజాగ్, తిరుపతి, శ్రీశైలం పిచ్చుకలంక, అరకు, అమరావతి మరియు కొత్తగా చేపట్టబోయే పర్యటక ప్రాంతాల్లో హోటల్స్, రిసార్ట్స్ నెలకొల్పాలని కోరారు. ప్రస్తుతం చేపట్టిన పర్యటక ప్రాజెక్టులకు సంబంధించిన నిర్వహణపై దృష్టిపెట్టాల్సిన అవసరాన్ని వ్యక్తపరిచారు. ప్రఖ్యాత బ్రాండ్లతో ఇన్వెస్టర్లను అనుసంధానించాల్సిన అవసరాన్ని వెల్లడించారు. విశాఖపట్నం, తిరుపతిలో పర్యాటక ప్రాజెక్టులకు అవసరమైన భూమిని గుర్తించామన్నారు. గోల్ఫ్ రిసార్ట్‌ల కోసం బెంగుళూరు అనంతపురం జాతీయ రహదారిపై భూమి అందుబాటులో ఉందన్నారు. ఇన్వెస్టర్లు సైట్ సందర్శన చేసేందుకు గూగుల్‌లో సంబంధిత సమాచారం పొందుపరచడమేగాక, క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం ఉండేలా ఎస్టేట్ బృందాన్ని నియమించామని వెల్లడించారు.పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ సమక్షంలో విశాఖపట్నంలో 117 గదుల హోటల్ నిర్మాణం కోసం మైనర్ హోటల్స్ మరియు సన్‌రే రిసార్ట్‌ల మధ్య కీలక అవగాహన ఒప్పందం జరిగింది. ఇరు సంస్థలు సంతకాలు చేసుకున్నాయి. ఈ సంస్థలు రాష్ట్రంలో పర్యావరణ అనుకూల లగ్జరీ రిసార్ట్స్ ఏర్పాటు చేయనున్నాయి.తొలిరోజు మారియట్, ఐహెచ్ జీ, ఐహెచ్ సీఎల్, అకార్, చాలెట్, ఇమాజికా వరల్డ్ ఎంటర్ టైన్ మెంట్ లిమిటెడ్, హామా, బీఎన్ కే గ్రూప్, వెంటివ్ హాస్పిటాలిటీ, పార్క్ హోటల్స్, లెమన్ ట్రీ, వెస్టిన్, బ్లాక్‌స్టోన్, హిల్టన్,సుబా హోటల్స్, ది బీచ్ ఎహెచ్ఎస్, అంబుజా నోటియా, ఎస్ఆర్ టీ హోటల్స్, రాయల్ ఆర్కిడ్ వంటి తదితర జాతీయ, అంతర్జాతీయ ప్రఖ్యాత సంస్థలతో భేటీ అయిన బృందం రెండో రోజు మరింత ఉత్సాహంతో ఆతిథ్య రంగంలోని కీలక వాటాదారులు, పరిశ్రమల ప్రతినిధులు, హోటల్ పెట్టుబడిదారులు, డెవలపర్లు, ఆపరేటర్లు మరియు దక్షిణాసియా అంతటా ఉన్న ఇతర నిపుణులను కలిసి కీలక అంశాలపై చర్చించారు.

# భూ కేటాయింపులు

>> చారు. ఇప్పటివరకు రూ.4,71,379 కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన 5 ఎస్ఐపిబి సమావేశాల్లో 57 సంస్థలకు సంబంధించి రూ.4,71,379 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలపగా, మొత్తం 4,17,188 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి. గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో 5 ఎస్ఐపీబీ సమావేశాలు నిర్వహించగా, కూటమి ప్రభుత్వం వచ్చాక 5 ఎస్ఐపిబి సమావేశాలు ఇప్పటికే నిర్వహించడం విశేషమన్నారు.. 5వ ఎస్ఐపిబి ఆమోదం తెలిపిన పెట్టుబడుల వివరాలు గమనిస్తే, మా మహామాయ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థ విజయనగరం జిల్లా రూ.2,063 కోట్ల పెట్టుబడులుతో 1,000 ఉద్యోగాలను కల్పిస్తోంది.ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ ఎంపీ సెజ్, నాయుడుపేట రూ.4,200 కోట్ల పెట్టుబడులు, 1,500 ఉద్యోగాలు కల్పిస్తోంది.ఎల్జీ వెండర్స్ సంస్థ శ్రీసిటీ, తిరుపతి జిల్లా రూ. 839 కోట్ల పెట్టుబడులు, 692 మందికి ఉద్యోగాలు కల్పిస్తుంది. ప్రాటీరియల్ లిమిటెడ్‌సంస్థ శ్రీసిటీ, తిరుపతి జిల్లాలో రూ. 1,055 కోట్ల పెట్టుబడులు, 515 ఉద్యోగాలు కల్పిస్తోంది. స్నేహ ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.459 కోట్ల పెట్టుబడులు, 559 ఉద్యోగాలు కల్పిస్తోంది. ఎట్రా సిలికాన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ శ్రీ సత్యసాయి జిల్లాలో రూ.585 కోట్ల పెట్టుబడులు, 477 ఉద్యోగాలు కల్పిస్తోంది.డిక్సాన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌సంస్థ తిరుపతి జిల్లా, కడప జిల్లాలుల్లో అవిశా ఫుడ్స్ అడ్ ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పెట్టుబడులు పెడుతుంది.కృష్ణా జిల్లాలో రూ.500 కోట్ల పెట్టుబడులు, 500 ఉద్యోగాలు కల్పిస్తోంది.రామ్కో సిమెంట్స్ నంద్యాల జిల్లాలో రూ.478 కోట్ల పెట్టుబడులు, 550 ఉద్యోగాలు కల్పిస్తోంది. హెచ్ఎఫ్‌సీఎల్ ఎంఎండబ్ల్యుఎల్ సంస్థ సత్యసాయి జిల్లాలో రూ.1,198 కోట్లు, 870 ఉద్యోగాలు కల్పిస్తోంది, టాప్‌స్టోన్ మెటల్స్, అలాయ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ శ్రీకాకుళం జిల్లాలో రూ. 32 కోట్లు, 200 మందికి ఉద్యోగాలు కల్పిస్తోంది.టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ విశాఖపట్నంలో రూ.1,370 కోట్ల పెట్టుబడులు, 12,000 ఉద్యోగాలు కల్పిస్తోంది.ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ విశాఖపట్నంలో రూ.5,728 కోట్ల పెట్టుబడులు, 2,500 ఉద్యోగాలు కల్పిస్తోంది. జేఎస్‌డబ్ల్యు నియో ఎనర్జీ లిమిటెడ్ సంస్థ కర్నూలు జిల్లా, 88 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్ట్, రూ. 660 కోట్ల పెట్టుబడులు, 110 మందికి ఉద్యోగాలు కల్పిస్తోంది.రెన్యూ విక్రమ్ శక్తి ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అనంతపురం జిల్లాలో 540 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్ట్, రూ.3,000 కోట్ల పెట్టుబడులు, 1,860 ఉద్యోగాలు కల్పిస్తోంది. చింతా గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్‌సంస్థ తిరుపతి జిల్లాలో 700 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టు, రూ.2,450 కోట్ల పెట్టుబడులు, 2,400 ఉద్యోగాలు కల్పిస్తోంది. చింతా గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సత్యసాయి జిల్లా, 2,000 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టు, రూ.7,000 కోట్ల పెట్టుబడులు, 6,900 ఉద్యోగాలు కల్పిస్తోంది. తాజాగా రాష్ట్రంలో 17 సంస్థలు వివిధ జిల్లాల్లో పెట్టుబడులు పెడుతున్నాయి. వీటన్నింటని క్షేత్రస్థాయిలో కార్యచరణకు తీసుకుని రావాలని సిఎం చంద్రబాబు స్పష్టం చేసారు.మనం పెట్టుబడుదారులకు అవసరాన్ని బట్టి ఆదాయపు పన్ను రాయితీలు కల్పిస్తాం.భూసేకరణలో సహకారాన్ని అందిస్తామన్నారు.ఈ అంశం గుర్తించి రాష్ట్రీయ,జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో ఇన్వెస్టర్లుకు అవగాహన కల్పించాలన్నారు. అప్పుడే మన అంచనాలకు అనుగుణంగా రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయన్నారు. మంత్రులు నారా లోకేష్, అనగాని సత్యప్రసాద్. టిజి భరత్, బిసి జనార్ధన్‌రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, వాసంశెట్టి సుభాష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌గారు తదితరులు పాల్గొన్నారు.

# 49% పెరిగిన ఆస్తిపన్ను వసూళ్లు

>> రాగలి టగామన్నారు. దీన్ని క్యాపిటల్ ఇన్వెస్ట్ మెంట్‌గా ఖర్చుపెట్టే వెసులుబాటు నెల్లూరు మున్సిపాలిటీకి లభించిందన్నారు. 50 స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా, మున్సిపల్ శాఖ ద్వారా 50 యంత్రాల కొనుగోలు చేస్తామన్నారు. రాబోయే కాలంలో మెకనైజేషన్‌కి వెళ్లాల్సి ఉంటుందన్నారు. నేను విదేశాల్లో తిరిగినప్పుడు ముఖ్యంగా ఈ మధ్య బెంగళూరు వెళ్లినప్పుడుకూడా వాళ్లు సాలిడ్, లిక్విడ్ వేస్ట్, రోడ్స్, వాటర్, లైట్స్ ఏ విధంగా ఆపరేట్ చేస్తున్నారో పరిశీలిస్తానన్నారు. అక్కడ ఉన్న బెస్ట్ ప్రాక్టీసెస్‌ను మన దగ్గర అమలు చేస్తామన్నారు. 85 లక్షల టన్నుల వ్యర్థాలను అక్టోబర్ 2లోపు తొలగించాలని సిఎం చంద్రబాబునాయుడు ఆదేశించారన్నారు.. మున్సిపల్ కమిషనర్లు అందుకు తగ్గట్లు తమ కార్యాచరణ రూపొందించుకొని పనిచేయాలన్నారు.. అమృత్, ఏషియన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ బ్యాంకు పనులకు సంబంధించి టెండర్లను త్వరలోనే పిలుస్తామన్నారు.. వేసవి కాలంలో మహిళలు త్రాగు నీటి కోసం ఇబ్బంది పడకుండా తగిన సౌకర్యాన్ని కల్పించాలన్నారు. అన్న క్యాంటీన్లో నిర్వహణపై కూడా రెగ్యులర్‌గా పరిశీలించేలా స్పెషల్ ఫోకస్ పెట్టాలని మంత్రి నారాయణ అన్నారు పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్ మాట్లాడుతూ ఇది డిపార్ట్మెంట్ మీటింగ్ కాదని కార్యాచరణ ప్రకారం మనం సంవత్సరకాలంలో ఏం చేయబోతున్నామో నిర్ధేశించుకుని తెలుసుకోవాలన్నారు. నగరాలలో 1.5 కోట్ల జనాభా ఉందని ఇది రాబోయే కాలంలో 2.5 కోట్లకు పెరుగుతుందని దాని ప్రకారం మన వసతులను మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందన్నారు.. ప్రాపర్టీ టాక్స్ ఏడాదిలో 49 శాతానికి పెంచిన సిబ్బందికి అభినందనీయమన్నారు.. దీన్ని 80 శాతం వరకు పెంచేలా కృషి చేయాలన్నారు.. గతంలో సక్రమంగా నిధులను ఖర్చు చేయకపోవటం వల్ల ఫైనాన్స్ కమిషన్ నుంచి నిధులు విడుదల కాలేదన్నారు.. దేశంలో బెస్ట్ ప్రాక్టీసెస్ ఎక్కడ ఉన్నా వాటిని రాష్ట్రంలో అమలు చేసే విధంగా ముందుకు వెళ్లాలన్నారు. పురపాలక పట్టణాభివృద్ధి శాఖ డైరెక్టర్ డాక్టర్ పి. సంపత్ కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ శాఖలో సీఎఫ్ఎంఎస్ కంట్రోల్ లేకుండా మన పరిధిలోనే వచ్చే రాబడిన మనమే ఖర్చు చేసుకునేలా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రికి మన మున్సిపల్ వ్యవహారాల శాఖ మంత్రి తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు.

## డిఎస్పీలు బదలీలు

>> ఎం.మహేశ్వరరావును విజయనగరం పిటిసి డిఎస్పీగాను, బి.సుబ్బారావును గుంటూరు విమెన్ పిఎస్ డిఎస్పీగాను బి.వి సుబ్బారావుకు ఎసిబి డిఎస్పీగాను,. కెవి.సత్య నారాయణకు రాజమండ్రి విమెన్ పిఎస్ డిఎస్పీగాను బి.నాగేశ్వరరావును, నార్త్ కోస్టల్ సెక్యూర్టీ డిఎస్పీగాను నియమించారు. ఇంటిలి జెన్స్ డిఎస్పీ జీఆర్ఆర్ మోహన్‌ను సిఐడి డిఎస్పీగాను,నార్త్ కోస్టల్ సెక్యూర్టీ డిఎస్పీ టి.గోవిందరావును డిఎస్పీ వి అండ్ ఈ కు అప్పాకు చెందిన యు.నరసింగప్పను పెను కొండ డీఎస్పీగాను బదిలీచేసారు.అక్కడి డిఎస్పీ వై.వెంకటేశ్వర్లునుపోలీసు హెడ్‌కు రిపోర్ట్ చేయాలని డిజిపి ఉత్తర్వుల్లో ఆదేశించారు.

## అనుచిత వ్యాఖ్యలు

>> టిడిపి కార్యకర్త చేబ్రోలు కిరణ్‌ను మంగళగిరి గ్రామీణ పోలీసులు అరెస్ట్ చేశారు. సెల్ టవర్ లొకేషన్ ఆధారంగా విజయవాడ ఇబ్రహీంపట్నం వద్ద అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికే టిడిపి అధిష్ఠానం కిరణ్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. మహిళలపై ఇలాంటి వ్యాఖ్యలను ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పింది. పార్టీ నుంచి కిరణ్‌ను సస్పెండ్ చేసింది. టిడిపి నేతలే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతడిని పోలీసులు అరెస్ట్ చేసి మంగళగిరి తరలిస్తున్నారు.

## పోలీసుల అదుపులో మాజీ ఎంపీ గోర్లంట్ల

**విజయవాడ,ఏప్రిల్10, ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను గుంటూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చేబ్రోలు కిరణ్‌ను తీసుకెళ్తున్న వాహనాన్ని ఆయన అడ్డగించారు. అంతేకాక అతని అంతు చూస్తామని బెదిరించారు. కిరణ్‌ను మంగళగిరి నుంచి గుంటూరుకు తరలిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. గుంటూరు వరకూ పోలీసు వాహనాన్ని మాధవ్ వెంబడించారు. ఈ క్రమంలో విధులను అడ్డుకుంటున్నారని మాజీ ఎంపీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఆయన పోలీసుల విచారణలో ఉన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 11-04-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్లపక్షం,
శుక్ల చతుర్దశి రా.3.32
ఉత్తరఫల్గుణి మ.3.11
వర్జ్యం రా.12.37-రా.2.25
దు.ఉ.8.25-9.15, 2) మ.12.34-మ.1.24
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం :** కుటుంబ సమస్యలు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు. పుణ్యక్షేత్రాల సందర్శనం.

**వృషభం :** బంధువుల నుండి ముఖ్యమైన సమాచారం అందు కుంటారు. ఆస్తి వివాదాలు తీరి లబ్ధిపొందుతారు.

**మిథునం:** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన శుభవార్తలు వింటారు.

**కర్కాటకం :** ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు. ఖర్చులు పెరుగుతాయి వాహనసౌఖ్యం.

**సింహం:** వృత్తి, వ్యాపారాలు ఆశా జనకంగా ఉంటాయి. చిన్ననాటి మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**కన్య :** గృహ నిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. ఋణ వత్తిడులు తొలుగుతాయి. నూతన వస్తు, వస్త్రాలు కొనుగోలు.

**తుల :** పూర్వపు మిత్రులనుండి ఆహ్వానాలు అందుతాయి. ప్రయాణాలు లాభిస్తాయి. స్వల్ప ధనలాభాలు.

**వృశ్చికం:** ఉద్యోగాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఋణ బాధలు ఎదురైన అధిగమిస్తారు.

**ధనుస్సు:** ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం. కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. వస్తువులు కొనుగోలు.

**మకరం:** పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. భూతగాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**కుంభం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వున్న అవసరాలకు డబ్బు అందుతుంది. తగాదాలు కొంత వరకు తీరుతాయి.

**మీనం :** ఇంటర్వ్యూలు, పోటీపరీక్షలలో పాల్గొంటారు. ఖర్చులు పెరుగుతాయి. ఇంటా బయటా ప్రోత్సాహం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్




గురువారం తమిళనాడులోని వెల్లింగ్‌టన్‌లో అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న రక్షణమంత్రి రాజ్‌నాథ్

# భారీగా పెరిగిన ఎక్సైజ్ ఆదాయం

>> ప్రసాద్ ఎమ్మెస్ రాజు బండారు శ్రావణి శ్రీ, ,జి.ఏ.డి (పొలిటికల్) రెవెన్యూ (ఎక్సైజ్) శాఖల ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా, ఎపిఎస్‌బిసి లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, డిస్టలరీస్, బ్రేవరీస్ కమిషనర్ నిశాంత్ కుమార్, రాష్ట్ర ఎన్ఫోర్స్మెంట్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ ,జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, సబ్ కమిటీని వేసుకొని ఆరు రాష్ట్రాలను పరిశీలించి నూతన మద్యం పాలసీని తీసుకొచ్చామన్నారు. తద్వారా ఒకవైపు ప్రజల ఆరోగ్యానికి పెద్దపేట వేస్తూ, నాణ్యమైన మద్యాన్ని సరఫరా చేస్తున్నామన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 29 డిపోలు ఉన్నాయని, నేడు 11.10 కోట్ల రూపాయలతో నిర్మించిన ఐఎంఎఫ్ఎల్ డిపో 30వ గోడౌన్‌ను సాంకేతికతను జోడించి అత్యంత ఆధునికంగా నిర్మించడం జరిగిందన్నారు.రాష్ట్రంలో అత్యంత పారదర్శకంగా 3500 మద్యం దుకాణాల కేటాయింపు చేపట్టామని, మద్యం దుకాణాల కేటాయింపు కోసం 90 వేల దరఖాస్తులు అందాయని,దరఖాస్తుల ఫీజు ద్వారా సుమారు1800 కోట్ల రూపాయల ఆదాయం వచ్చిందన్నారు. గోదాము నుంచి వెళ్లే ప్రతి స్టాకు వాహనాన్ని ట్రాక్ చేస్తున్నామన్నారు.వాహనం గోదాం నుంచి దుకాణం వద్దకు వెళ్లే వరకు పర్యవేక్షణ పెట్టే వ్యవస్థ తెచ్చామన్నారు. రాష్ట్రంలో30 నుండి 40 శాతం అమ్మకాలు పెరిగాయన్నారు.మద్యం దుకాణాల్లో డిజిటల్ చెల్లింపులను అమలు చేస్తున్నామన్నారు.మద్యం దుకాణాలు నిర్వహిస్తున్న వారు ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే మొదటిసారి అయితే అయిదు లక్షలు రూపాయలు కాంపౌండ్న వసూలు చేయడం జరుగుతున్నదని, రెండవసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే ఆషాపుల లైసెన్సులను రద్దు చేయడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వంలోజరిగిన మద్యం కొనుగోళ్ల అక్రమాలన్నీ వెలికి తీస్తున్నామని, మద్యం అక్రమాలను నిగ్గుతేల్చడానికి సిట్ ను ఏర్పాటు చేశామని, మద్యం స్కాం లో బాధ్యులైన వారు ఎవరూ తప్పించుకోలేరని వారందరిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి ఒక్కప్రజా ప్రతినిధిపై అక్రమ కేసులు పెట్టడం, దాడులు చేయడం జరిగిందన్నారు. మొన్న రాప్తాడు నియోజకవర్గానికి వచ్చి కుటుంబ కలహాలతో జరిగిన హత్యను రాజకీయం చేయడానికి డబ్బులు ఇచ్చి జనాలను పోగుచేసి పోలీసులపై అనుచిత వ్యాఖ్యలను చేస్తున్నారని దీనిని ప్రజలందరూ గమనించాలన్నారు.

# తహావ్వుర్ రాణా అరెస్టు

>> అని భారత ప్రభుత్వాన్ని తౌఫిక్ కోరాడు. రాణాకు మరణశిక్ష విధిస్తే సంబరాలు చేసుకుంటా. 'ఉగ్రవాది తహవూర్ రాణాను భారత్‌కు తీసుకొస్తున్నారు అనేది పెద్ద శుభవార్త. అతడ్ని 15 రోజులు లేదా రెండు, మూడు నెలల్లోగా బహిరంగంగా ఉరితీయాలి. రాణాకు మరణశిక్ష విధిస్తే నేను సంబరాలు చేసుకుంటాను. అతడిని రక్షించేందుకు ఇతరులు ప్రయత్నించేలోగా ఉరితీసేయాలి. అలాంటి ఉగ్రవాదులను అంతం చేసేందుకు కఠిన చట్టాలు కావాలి. రాణాను భారతదేశానికి అప్పగించినందుకు అమెరికా ప్రభుత్వానికి, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కృతజ్ఞతలు" అని మహ్మద్ తౌఫిక్ పేర్కొన్నారు. "ముంబై ఉగ్రదాడుల్లో చనిపోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తగిన సహాయం చేసింది. అయితే డబ్బులతో ఎవరి ప్రాణాలనూ తిరిగి తీసుకురాలేమని మనం గుర్తించాలి" అని ఆయన కామెంట్ చేశారు. తహవూర్ రాణాను న్యూఢిల్లీలోని తీహార్ జైలులో అత్యంత భద్రత కలిగిన వార్డులో ఉంచుతారని అంటున్నారు. ఈ నేపథ్యంలో తౌఫిక్ సహా కోట్లాది మంది భారతీయుల వాదన ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

# మార్క్ శంకర్ ఇంటికి వచ్చేశాడు

## కేంద్ర మాజీ మంత్రి చిరంజీవి



**విజయవాడ,ఏప్రిల్10,ప్రభాతవార్తప్రతినిధి:** సింగపూర్ స్కూల్‌లోని తరగతి గదిలో జరిగిన అగ్ని ప్రమా దంలో గాయపడిన డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ క్రమంగా కొలుకొంటు న్నారు.అతను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి అక్కడి నివాసగృహానికి చేరుకున్నారు.మార్క్ ఆరోగ్యంపై పవన్ అన్నయ్య మాజీ కేంద్రమంత్రి చిరంజీవి గురువారం తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. మాట్లాడుతూ.. మాబిడ్డ మార్క్ శంకర్ ఇంటికొచ్చేశాడన్నారు. అయితే బాబు ఇంకా కోలుకావాల్సి ఉందని పేర్కొన్నారు. మా కులదైవం అంజనేయస్వామి దయతో.. కృపతో త్వరలోనే కోలుకొని పూర్తి ఆరోగ్యవంతుడు అవుతాడని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మళ్లీ మాములుగా ఎప్పటిలాగే బాబు ఉంటాడన్నారు. శుక్రవారం..అంటే ఏప్రిల్ 11వ తేదీ హనుమన్ జయంతి అని ఈ సందర్భంగా చిరంజీవి గుర్తు చేశారు. ఆ స్వామి ఓ పెద్ద ప్రమాదం నుంచి, ఓ విషాదం నుంచి ఆ పసి బిడ్డని కాపాడి మాకు అండగా నిలిచాడని అన్నారు. వివిధ ప్రాంతాల్లోని పలు ఊళ్లలో.. ఆ బిడ్డ కోసం ప్రార్థనలు చేస్తున్నారని.. ఆశీస్సులు అందజేస్తున్నారని చెప్పారు. ఇలా తమ కుటుంబానికి అండగా నిలబడి.. వారందరికి నా తరఫున, తమ్ముడు పవన్ కల్యాణ్ తరఫున, మా కుటుంబం యావన్మంది తరఫున మీ అందరికీ ధన్యవాదాలు తెలియచేస్తున్నామని మెగాస్టార్ చిరంజీవి తెలిపారు.

# ఆర్సీబీపై ఢిల్లీకేపిటల్స్ విజయం

## ఆరువికెట్ల నష్టంతో రాయల్ ఛాలెంజర్స్ ఓటమి



**బెంగళూరు, ఏప్రిల్ 10:** చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ పరువు తీసుకుంది. సొంతగడ్డపైనే ఢిల్లీ కేపిటల్స్ విజయాన్ని కట్టడిచేయలేకపోయింది. ఐపిఎల్ 18వ సీజన్‌లో 24వ మ్యాచ్‌గా జరిగిన ఆర్సీబీ, ఢిల్లీకేపిటల్స్ జట్ల మధ్య హోరాహోరీ జరిగినా ఢిల్లీని ఆర్సీబీ బౌలర్లు నిలువరించలేకపోయారు. తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ ఏడు వికెట్ల నష్టానికి 163 పరుగులుచేసి ప్రత్యర్థికి 164 పరుగులు లక్ష్యం విధించింది. తర్వాత బ్యాటింగ్ చేపట్టిన ఢిల్లీ కేపిటల్స్ నాలుగు వికెట్ల నష్టానికి 169 పరుగులుచేసింది. 13 బంతులు మిగిలి ఉండగానే ఆరు వికెట్ల తేడాతో గెలిచి ఢిల్లీసేనసత్తాచూపించింది. పవర్‌ప్లేలో కీలక వికెట్లు పడినా అదరన బెదరని కెఎల్‌రాహుల్ 93 పరుగులుచేసి విజృంభించాడు. 38 కీలకభాగస్వామ్యాలు నెలకొల్పిజట్టును గెలుపు బాటపట్టించాడు. దాంతో ఢిల్లీ ఆడుతూ పాడుతూ ఆరువికెట్ల తేడాతో గెలిచింది. టేబుల్‌టాపర్స్‌పోరులో ఢిల్లీ కేపిటల్స్ ఇపుడు పైచేయి సాధించింది. ఆర్సీబీ ఓటమితో రెండోస్థానానికి రాలేకపోయింది. తొలుత ఢిల్లీకేపిటల్స్‌లో 3 ఓవర్లకే ఓపెనర్లు ఇద్దరూ పెవిలియన్‌చేరారు. యశ్‌దయాల్‌బౌలింగ్‌లో ఫాఫ్ డుప్లెసిస్ రెండు,రజత్‌పటిదార్‌క క్యాచౌట్ అయ్యాడు. కాసేపటికే మెఖ్‌గుర్క్ ఏడు పరుగులకే భువనేశ్వర్ వెనక్కిపంపించాడు. జితేశ్‌శర్మ ఒడుపుగా బంతిని అందుకునానడు. పది పరుగులవద్దనే ఢిల్లీ రెండు కీలక వికెట్లు కోల్పోయింది. ఇంపాక్ట్ ప్లేయర్ అభిషేక్ పొరెల్, అక్షర్‌పటేల్‌లు దూకుడుగా ఆడేక్రమంలో వికెట్లు నష్టపోయారు. 54కే నాలుగు వికెట్లుపడిన ఢిల్లీని కెఎల్‌రాహుల్ 93 పరగులుచేసి నాటౌట్‌గా నిలిచి ఆదుకున్నాడు. యశ్‌దయాల్ వేసిన 14 ఓవర్‌లో సింగిల్‌తో అర్థసెంచరీచేసాడు. 37 బంతుల్లో 3 ఫోర్లు, మూడు సిక్స్‌లతో అర్థసెంచరీకొట్టి జట్టును ఓటమి నుంచి బయటపడేసాడు. యువ కెరటం ట్రిస్టన్ స్టబ్స్‌తోకలిసి కీలక భాగస్వామ్యం తెచ్చాడు. హేజిల్‌వుడ్ వేసిన 15వ ఓవర్‌లో మూడుఫోర్లు, ఒకసిక్స్‌బాది 22 పరుగులుచేసాడు. మరోవైపు ట్రిస్టన్‌స్టబ్స్ 38 పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచాడు. సుయాశ్‌బౌలింగ్‌లో నాలుగు, ఆరు కొట్టిన స్టబ్స్ భువీ వేసిన 17వ ఓవర్‌లో రెండుఫోర్లు రాబట్టాడు. ఆ తర్వాత దయాల్‌బౌలింగ్‌లో 6,4,6 బాదిన రాహుల్ ఢిల్లీకి ఆరువికెట్లతో విజయం తెచ్చాడు.

# ఓర్వకల్లు, కొప్పర్తి నోడ్‌లలోని పనులను ఏపి ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అప్పగిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం

**విజయవాడ,ఏప్రిల్10,ప్రభాతవార్తప్రతినిధి:** పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధిలో భాగంగా ఓర్వకల్లు, కొప్పర్తి నోడ్ లలోని పనులను ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కు అప్పగిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ బెంగుళూరు పారిశ్రామిక కారిడార్ లోని ఓర్వకల్ నోడ్ తో పాటు విశాఖ చెన్నై కారిడాం లోని కొప్పర్తిలో చేపట్టే పనులను ఏపీఐఐసీడీసీ అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. పారిశ్రామిక నోడ్ ల డిజైన్ల నిర్మాణం, టెస్టింగ్, నిర్వహణలను ఏపీఐఐసీ ఆధీనంలోని ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కు అప్పగించారు. ఈపీసీ ప్రాతిపదికన రూ.1,264 కోట్లతో కొప్పర్తిలో, రూ.1771 కోట్లతో ఓర్వకల్లు పారిశ్రామిక నోడ్ లలో పనులు చేపట్టేందుకు పాలనానుమతి ఇచ్చారు. ఈ రెండు ప్రాజెక్టులలోనూ ఏపీఐసీడీసీకి టెండర్ ప్రీమియంలో 5 శాతాన్ని మినహాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ఇంప్లిమెంటేన్ ట్రస్ట్ బోర్డులో నిర్ణయం మేరకు ఈ పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్లగ్ అండ్ ప్లే, వాక్ టు వర్క్ విధానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ రెండు గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టులు నిర్మించాలని నిర్ణయించారు. ఈ మేరకు పెట్టుబడులు మౌలిక సదుపాయాల కల్పనాశాఖ కార్యదర్శి ఎన్. యువరాజ్ ఉత్తర్వులు జారీ చేసారు.

# మహిళా సాధికారతకుచేస్తున్న నిరంతర కృషి ప్రశంసనీయం

## - రాష్ట్ర జౌళి, చేనేత శాఖ కమిషనర్ రేఖా రాణి

**విజయవాడ,ఏప్రిల్10,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళా సాధికారతకు , వ్యాపార అభివృద్ధికి , కోవె చేస్తున్న నిరంతర కృషి ప్రశంసనీయం- రాష్ట్ర జౌళి, చేనేత శాఖ కమిషనర్ రేఖా రాణి తెలిపారు,.స్వర్ణాంధ్ర 2047 కు అనుగుణంగా ప్రతీ ఇంటి నుండి ఒక పారిశ్రామికవేత్త చేనేత మహిళా కార్మికులకు ఆరోగ్య పరిక్షల కొరకు హెల్త్ కార్డు మంజూరు దిశగా కోవె ఆలోచనలు సాగుతున్నాయి.విజయవాడ ఆంధ్ర ప్రదేశ్ చాప్టర్‌లోని ఒక హోటల్ గురువారం కొత్త కార్యవర్గంతో ప్రమాణస్వీకారం కార్యక్రమాన్ని కోవే జాతీయ కార్యదర్శి అపర్ణ . జాతీయ సహాయ కార్యదర్శి రాధికా ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర జౌళి, చేనేత శాఖ కమిషనర్ రేఖా రాణి మాట్లాడుతూ మహిళా సాధికారతకు , వ్యాపార అభివృద్ధికి , కోవె చేస్తున్న నిరంతర కృషి ప్రశంసనీయమన్నారు. ప్రత్యేకంగా తిశి చాప్టర్ యొక్క దూరదృష్టి గల నాయకత్వాన్ని ప్రశంసిస్తూ ఇది మహిళ సాధికారత సమాఖ్య అనడం కంటే అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని కృషి చేస్తున్న మహిళల యొక్క నమ్మకాన్ని సాధించే సంస్థ అని కొనియాడారు. కోవె సంస్థ మహిళా వ్యాపారవేత్తల అభివృద్ధికి అందిస్తున్న తోడ్పాటులో ప్రభుత్వ సహకారం ఖచ్చితంగా ఉంటుందన్నారు. మహిళా చేనేత కార్మికుల ఆరోగ్య పరిక్షల కొరకు హెల్త్ కార్డ్స్ వంటి సదుపాయాలను కల్పించాలని దానికి ప్రభుత్వ సహకారం కూడా ఉంటుందని ఆమె అన్నారు. స్వచ్ఛాంధ్ర లో భాగంగ చేనేత మరియు టైలర్ దగ్గర మిగిలిన క్లాత్ ముక్కలను ఉపయోగించి సంచుల తయారీ దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని, ప్రభుత్వం దీనికి సంబంధించిన వస్తు సామాగ్రిలను, యంత్రాలను కొనుగోలులో రాయితీ అందచేస్తుందని తెలిపారు. ఇదే కాకుండా ప్రభుత్వం



కోవే నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమంలో ప్రసంగిస్తున్న రేఖారాణి

మహిళా వ్యాపారవేత్తలకు అందచేస్తున్న పలు సదుపాయాలను రాయితీలను కోవె వారి సభ్యులకు తెలియపరిచి వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. చేనేతకు రాబోయే రోజుల్లో మరింత ప్రాముఖ్యం పెరగనుందని, మహిళా సాధికారతే లక్ష్యంగా కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ సంస్థ(కోవె)జాతీయ కార్యదర్శి అపర్ణ వెల్లడించారు కోవె సంస్థ ద్వారా భవిష్యత్తు లో చేనేత క్లస్టర్ల స్థాపన కు సహకరిస్తామని తెలిపారు.

ప్రస్తుతం"చేనేత రథం" అనే ఉపాది హామీ పథకం ద్వార నేరుగా నేతన్నల నుండి ఉత్పత్తులను వాహనాలలో నగరం లోని వీదులలో, అపార్ట్మెంట్ ల వద్ద విక్రయాలను జరిపే కార్యక్రమం చేపట్టామన్నారు.

దీనికి ప్రభుత్వ సహకారం తో పాటు పెట్టుబడి తక్కువ, లాభాలు ఎక్కువ ఉండటం వలను అటు నేతన్నలు ఇటు విక్రయదారులు కూడా ఈ పథకం పట్ల ఆసక్తి చూపుతున్నారని, కోవె సంస్థ ద్వారా ఈ పథకాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలని, ఆసక్తి ఉన్న వారు జౌళి మరియు చేనేత శాఖ వారిని సంప్రదించాలని కోరారు. వీటితో పాటు సాధికారత అంటూ మహిళలు తమ ఆరోగ్యాన్ని పూర్తిగా అశ్రద్ధ చేస్తున్నారని, ప్రతీ మహిళా తనకోసం కొంత సమయం కేటాయించుకోవాలని అప్పుడే ఒక మహిళా వారి కుటుంబానికి ఆదర్శంగా నిలబడగలదని అన్నారు. చివరగా పలు మహిళా వ్యాపార వేత్తలతో కమీషనర్ రేఖా రాణి ముఖాముఖి మాట్లాడారు. అనంతరం ఏపీ కోవె చాప్టర్ నూతన అధ్యక్షురాలు గా యార్లగడ్డ గీతా శ్రీకాంత్ , కార్యదర్శులుగా , విజయలక్ష్మి, జయలక్ష్మి , కోశాధికారిగా యాళ్ల పద్మలత ప్రమాణ స్వీకారం చేశారు . ఎగ్జిక్యూటివ్ కమీటీ గా శోభ రాణి , స్వాతి చంద్ర ,కోడాలి కవిత ,శ్రావణి జెట్టి , లక్ష్మి సుజన , అడ్వైసరి కమిటీ గా మోహిని దేవి , మాలతి , రాజమణి , శ్రీదేవి భాద్యతలు స్వీకరించారు.

కోవె ఆంధ్ర ప్రదేశ్ చాప్టర్ నూతన అధ్యక్షురాలు యార్లగడ్డ గీతా శ్రీకాంత్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో అన్ని జిల్లాలలో మహిళా వ్యాపారవేత్తలను అభివృద్ధి పరిచే దిశగా కోవె బృంద సభ్యులందరు కృషి చేస్తున్నారని తెలిపారు.

# జూన్ నెల నుంచి రేషన్ షాపుల్లో బియ్యంతో పాటుగా రాగుల పంపిణీ

**విజయవాడ,ఏప్రిల్10,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో వచ్చే జూన్ నెల నుంచి రేషన్ షాపుల్లో బియ్యంతో పాటుగా రాగులను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. బియ్యానికి బదులుగా రాగులను ఉచితంగా అందించనుంది. ప్రతి నెలా 20 కేజీల బియ్యం తీసుకునే కుటుంబం 2 కేజీల రాగులు కావాలంటే ఆ మేరకు బియ్యాన్ని మినహాయిస్తారు. ఇందుకు ఏటా 25వేల మెట్రిక్ టన్నుల రాగులు అవసరమవుతాయని అంచనా. ఆ మేరకు రాగుల సేకరణకు టెండర్ జారీ చేసింది. రాగులతో పాటు ఇతర చిరు ధాన్యాలను రేషన్ దుకాణాల ద్వారా అందించే దిశలోను ప్రభుత్వం చర్యలు చేపట్టింది,ఇప్పటికే చిరు ధాన్యాలను ప్రోత్సహించే దిశలో ప్రభుత్వం చర్యలను తీసుకుంటుంది. ఈ క్రమంలో రాగులను ప్రజలకు ఉచితంగా ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది.

# నేటి నుంచి తెలుగు రాష్ట్రాల మీదుగా చర్లపల్లి-శ్రీకాకుళం మధ్య ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 10,ప్రభాతవార్త** ప్రస్తుత వేసవి సీజన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ తెలుగు రాష్ట్రాల మీదుగా చర్లపల్లి-శ్రీకాకుళం-చర్లపల్లి మధ్య నేటి(ఈ నెల 11)నుంచి ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. చర్లపల్లి నుంచి శ్రీకాకుళం వెళ్లే నెంబర్ 07025 వెళ్లే నెంబర్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈనెల 11 నుంచి జూన్ 27వరకు ప్రతి శుక్రవారం రాత్రి 9.15గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి శనివారం మధ్యాహ్నం 12.15గంటలకు శ్రీకాకుళం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో శ్రీకాకుళం నుంచి చర్లపల్లి వెళ్లే నెంబర్ 07026 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 12నుంచి జూన్ 28వరకు ప్రతి శనివారం మధ్యాహ్నం 2.15గంటలకు శ్రీకాకుళం నుంచి బయలుదేరి ఆదివారం ఉదయం 6గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. తిరుపతి నుంచి మచిలీపట్నం వెళ్లే నెంబర్ 07121ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13నుంచి మే 25వరకు ప్రతి ఆదివారం మచిలీపట్నం నుంచి తిరుపతి వెళ్లే నెంబర్ 07122ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 14నుంచి మే 26వరకు ప్రతి సోమవారాల్లో బయలుదేరుతాయి. తిరుపతి నుంచి సాయినగర్ షిర్డీ వెళ్లే నెంబర్ 07637ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13నుంచి జూన్ 29వరకు సాయినగర్ షిర్డీ నుంచి తిరుపతి వెళ్లే నెంబర్ 07638ప్రతి సోమవారాల్లో బయలుదేరుతాయి.

# ఫెన్సింగ్ క్రీడాకారిణి మంతెన ధృతి సమీక్షకు శాప్ చైర్మన్ అభినందన

**విజయవాడ,ఏప్రిల్10,ప్రభాతవార్తప్రతినిధి:** అంతర్జాతీయస్థాయి ఫెన్సింగ్ క్రీడల్లో సైతం అత్యుత్తమంగా రాణించి రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా పెంచాలని భీమవరానికి చెందిన ఫెన్సింగ్ క్రీడాకారిణి మంతెన ధృతి సమీక్షకు శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు సూచించారు. విజయవాడలోని శాప్ కార్యాలయంలో రవినాయుడిని గురువారం ఆమె



మర్యాదపూర్వకంగా కలిశారు. ఒరిస్సా రాష్ట్రం కటక్‌లోని జేఎన్ ఇండోర్ స్టేడియంలో మార్చి 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ జరిగిన 26వ జాతీయ సబ్ జూనియర్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఫాయిల్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించినట్లు క్రీడాకారిణి వివరించారు. ఈ సందర్భంగా క్రీడాకారిణిని శాప్ చైర్మన్ అభినందిస్తూ ప్రభుత్వం పరంగా శాప్ నుంచి పూర్తి సహాయసహకారాలు అందిస్తామని, భవిష్యత్తులో అంతర్జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ఏపీ సత్తా చాటాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఫెన్సింగ్ కోచ్ జీఎస్‌వీ కృష్ణమోహన్, భీమవరం ఫెన్సింగ్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎం.శివప్రసాద్

**విజయవాడ,ఏప్రిల్ 10,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఐఎఫ్ఎస్ అధికారి ఎం.శివప్రసాద్ నియమితులయ్యారు. ఆ స్థానంలో పనిచేస్తున్న రాజాబాబు ఏపీపీఎస్సీ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. దీంతో గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్ శివప్రసాద్‌కు హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఎస్ విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

# టిటిడికి వంద టిఐ సైకిళ్లు విరాళం




**తిరుమల,ఏప్రిల్ 10ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడికి తమిళనాడు చెన్నైకి చెందిన మురుగప్ప గ్రూప్ టిఐ సైకిళ్ళను 100వాటిని విరాళంగా అందించారు. గురువారం

సాయంత్రం ఆలయం ముందు వంద సైకిళ్ళకు సంస్థ ప్రతినిధులు పూజలు నిర్వహించి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథంకు, పేష్కార్ రామకృష్ణకు అందజేశారు.

# రెండు రోజులు తుంబురుతీర్థ ముక్కోటి

## - ఉదయం 10గంటల వరకే అనుమతి

**తిరుమల,ఏప్రిల్ 10ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలంకొండల్లోని పవిత్రతీర్థాలలో తుంబురుతీర్థముక్కోటికి ఎంతో విశిష్టత ఉంది. శుక్ర,శనివారాలు రెండురోజులు తుంబురుతీర్థంకు వెళ్ళేందుకు భక్తులకు ఉదయం 5గంటల నుండి 10గంటల వరకు మాత్రమే అనుమతినిస్తున్నట్లు టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. తీర్థానికి విశేషంగా వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. భద్రతపరంగా, రవాణా,అన్నప్రసాదాలు, తాగునీరు, ప్రథమచికిత్స, అంబులెన్స్‌లు, మందులు ,పారామెడికల్ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. తీర్థానికి ఎక్కువ దూరం నడవాల్సి ఉండటంతో 60ఏళ్ళు పైబడిన వృద్ధులు, గుండె, శ్వాసకోశసమస్యలు, స్థూలకాయం ఉన్నవారిని అనుమతించబోమన్నారు. పోలీసు,అటవీశాఖ, టిటిడి



విజిలెన్స్, ఆరోగ్యశాఖలు సమన్వయంతో పానవినాశనం నుండి తుంబురుతీర్థం వరకుఅక్కడక్కడా భద్రతా సిబ్బందిని ఉంచి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. తుంబురుతీర్థముక్కోటి ఏర్పాట్లుపై గురువారం మధ్యాహ్నం టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుమల అదనపుఎస్పీ ఐ.రామకృష్ణ, డిఎస్పీ కె.విజయశేఖర్, విఎస్‌ఒ సురేంద్ర పాల్గొన్నారు.



# ఒంటిమిట్ట కోదండ రామాలయానికి సీతారాముల కళ్యాణ శోభ

## మోహిని అలంకారంలో శ్రీరామచంద్రుడు

## ముస్తాబైన సీతారాముల కల్యాణ వేదిక

## నేడే ఒంటిమిట్టలో సీతారాముల కళ్యాణం

## పట్టు వస్త్రాలు సమర్పించనున్న సిఎం

**రాజంపేట అర్బన్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త** ఆంధ్ర అయోధ్యగా ప్రసిద్ధిగాంచిన ఉమ్మడి కడప జిల్లా ఒంటిమిట్ట లోని కోదండ రామాలయంలో రాష్ట్ర పండుగగా నేడు సీతారాముల కళ్యాణాన్ని అట్టహాసంగా నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం, రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాటు చేసింది. సీతారాముల కళ్యానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. లక్ష మంది పైబడి భక్తులు వస్తారని అంచనా వేస్తున్న ఈ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి బందోబస్తుగా ఇప్పటికే 2000 పైబడి పోలీసులు ఒంటిమిట్టకు చేరుకున్నారు. సీతారాముల కళ్యాణం వీక్షించేందుకు గ్యాలరీలో కూర్చునే భక్తుల కోసం 70,000 తిరుమల లడ్డూలు సిద్ధమయ్యాయి.కళ్యాణ వేదిక అంగరంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. నేడు జరిగే కళ్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో శ్యామలరావు తెలిపారు. బందోబస్తు ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేసినట్టు కడప జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. కళ్యాణోత్సవానికి విచ్చేస్తున్న భక్తులకు సేవలు ఇచ్చేందుకు వందల మంది శ్రీవారి సేవకులు తరలి వచ్చారు. సీతారాముల కల్యాణానికి వినియోగించే కోటి గోటి తలంబ్రాలను దాతలు గురువారం రామాలయానికి తీసుకువచ్చి టిటిడి అధికారులకు అప్పగించారు. శ్రీ సీతారాముల కల్యాణానికి తూర్పుగోదావరి జిల్లా కోరుకొండకు చెందిన శ్రీకృష్ణ చైతన్య సంఘం అధ్యక్షుడు శ్రీ కళ్యాణ అప్పారావు ఆధ్వర్యంలో గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలను సమర్పించారు. మొత్తం 120 కిలోల బరువైన ఈ తలంబ్రాలను ఆలయం వద్ద సూపరింటెండెంట్ హనుమంతయ్య, అర్చకులు శ్రావణ్ కుమార్ సమక్షంలో అందించారు.

ఈ తలంబ్రాల కోసం మూడు నెలల పాటు వరిని ప్రత్యేకంగా పండించి ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ ఢిల్లీ రాష్ట్రాలకు చెందిన భక్తులు ఎంతో భక్తిభావంతో మూడు నెలల పాటు గోటితో ఒలిచి సిద్ధం చేశారు. ఈ సంఘం ఆధ్వర్యంలో 14 ఏళ్లుగా భద్రాద్రి రామునికి, మూడు ఏళ్లుగా అయోధ్యకి, 8 ఏళ్లుగా ఒంటిమిట్ట రామునికి కల్యాణోత్సవం సందర్భంగా అందజేస్తున్నామని కళ్యాణ అప్పారావు తెలిపారు.బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు గురువారం ఉదయం శ్రీరామచంద్రుడు మోహిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి గరుడసేవలో సీతారామ చంద్రులు తరించారు.

# చింతూరు ఐటిడిఎలో చారిత్రక ఘట్టం

# ఒకేరోజు 32 ముంపు గ్రామాల ప్రజాభిప్రాయ సేకరణ

## తరలివచ్చిన ప్రజా ప్రతినిధులు - పెసా కమిటి సభ్యులు

**చింతూరుక్రూనవరం ఎప్రిల్ 10 ప్రభాతవార్త** చింతూరు ఐటిడిఎలో బుధవారం అధికారులు పొలవరం సర్వేలో చారిత్ర ఘట్టానికి తెరలేపారు.పొలవరం ముంపు గ్రామాల జాబితాలో ఫేజ్ 1బిలో ఉన్న 32 గ్రామాల నిర్వాశితులు,ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు,గ్రామపెద్దలు,రాజకీయపక్షాలు,గ్రామ కమిటి సభ్యులతో అధికారులు వేర్వేరుగా చర్చలు జరిపారు.ఈ కార్యక్రమానికి చింతూరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అపూర్వభరత్ శ్రీకారం చుట్టారు.ఉదయం9గం॥లకు ప్రారంభమైన ఈ కార్యక్రమము సాయంత్రం వరకు కొనసాగింది.పొలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల ముంపునకు గురవుతున్న గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్న అధికారులు మొదటి దశలో ఫేజ్1(ఎ)లో ఉన్న గ్రామాల్లో ఇప్పటికే గ్రామసభలు పూర్తి స్థాయిలో నిర్వహించి ఆర్ అండ్ ఆర్ చెల్లించే కార్యక్రమాన్ని ఒక కొల్కితీసుకోని రావటంతో పాటు జూన్ 6నాటికి ఆయా గ్రామాల్లోని నిర్వాశితులకు ఆర్ అండ్ ఆర్ చెల్లించి గ్రామాలను తరలించటానికి సన్నాహాలు చేస్తున్న విషయం విధితమే.ఉన్నతాధికారులు ప్రభుత్వ ఆదేశాల మేరకు మరో అడుగు ముందుకు వేసి పొలవరం పరిహార కార్యక్రమాన్ని పరుగులు పెట్టిస్తున్నారు.అందులో భాగంగా బుధవారం



ఐటిడిఎలో నిర్వహించి సమావేశ దృశ్యం

చింతూరు ఐటిడిఎ సమావేశ మందిరంలో చింతూరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అపూర్వ భరత్ ,8మంది స్పెషల్ డిప్యూటి కలెక్టర్‌లు,నాలుగు మండలాల తాశీల్దార్‌లు ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గోన్నారు.ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రజా ప్రతినిధులు,పెసా కమిటి,గ్రామకమిటి సభ్యులతో అధికారులు చర్చించి ఆయాముంపు గ్రామ ప్రజలకు ఆర్ అండ్ ఆర్ కాలని ఎక్కడ కోరుకుంటున్నారు,భూమికి భూమి అంశం,కాలనీలకు వెళ్ళిన తరువాత జీవనోపాధి ,వ్యవసాయ రాయితీలు,స్వయం ఉపాధి,18సం॥నిండిన యువతి యువకులకు నైపుణ్యశిక్షణ వంటి అంశాల గురించి గ్రామాల వారిగా చర్చించిన అధికారులు,ప్రతి నిధులు ఒక అభిప్రాయానికి వచ్చారు.అలా ఫేజ్ 1బిలో ఉన్న 32 గ్రామాల నిర్వాశితులతో అధికారులు ప్రత్యేక చర్చలు జరిపి ప్రజాభిప్రాయాన్ని ఒక కొలిక్కి తీసుకొచ్చారు.మిగిలి గ్రామాలకు కూడా ఈనెల 20 తరువాత గ్రామసభలు నిర్వహిస్తామని,అభ్యంతరాలను పూర్తి స్థాయిలో పరిశీలిస్తున్నామని,ప్రతి నిర్వాశితుడి ఫిజికల్ ప్రూఫ్స్ ఖచ్చితంగా అందజేయాలని సూచించారు.ఆర్ అండ్ ఆర్‌కు సంభంధించి ముంపు ప్రాంతాల్లో పనిచేస్తున్న అధికారులు ,సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ఆర్ అండ్ ఆర్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని అధికారులకు పివో సూచించారు.

# ఎపి మోడల్ స్కూల్స్‌లో 6 వ తరగతి ప్రవేశ పరీక్ష తేదీ మార్పు

**విజయవాడ ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోనే 164 ఆదర్శ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశ పరీక్ష తేదీలో మార్పు చేసారు.మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ పరీక్ష ఏప్రిల్ 20 న జరగాల్సి ఉండగా ఈస్టర్ పర్వదినం నేపథ్యంలో ఏప్రిల్ 21కి రీషెడ్యూల్ చేసినట్లు పాఠశాల విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ మార్పును గమనించాలని విజ్ఞప్తి చేశారు.

దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఏ మండలంలో ఆదర్శ పాఠశాలలు ఉన్నాయో అక్కడే ఏప్రిల్ 21న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే పరీక్షకు హాజరు కావాలని సూచించారు. హాల్‌టికెట్లు అందుబాటులోకి వచ్చాక విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ .సిఎస్ఇ.ఎపి.జిఓవి.ఇన్ లేదా డబ్ల్యూ డబ్ల్యూడబ్ల్యూ.

ఎపిఎంఎస్. ఎపిసిఎఫ్ఎస్ఎస్. ఇన్ వెబ్‌సైట్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఫిబ్రవరి 24 నుంచి మార్చి 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే.

మరోవైపు, ఇంటర్‌లో ప్రవేశాలకు ఇప్పటికే మొదలైన దరఖాస్తుల ప్రక్రియ మే 22 వరకు కొనసాగనుంది.

# అగ్రిగోల్డ్ ఆస్తుల వేలానికి రాష్ట్ర జిల్లా స్థాయి కమిటీలు

**విజయవాడ ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** అగ్రిగోల్డ్ ఆస్తుల వేలం ప్రక్రియను ప్రభుత్వం మొదలుపెట్టింది. దీని కోసం రాష్ట్ర జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేసింది. రాష్ట్ర స్థాయి కమిటీ కన్వీనర్‌గా సీఐడీ విభాగాధిపతి వ్యవహరించనున్నారు. విశ్రాంత ఐపీఎస్ అధికారి సీహెచ్ ద్వారకా తిరుమలరావు, ఆర్థిక నిపుణుడు కుటుంబరావుతోపాటు ఐటీ, పురపాలక, పట్టణాభివృద్ధి, సమాచార, పౌరసంబంధాల శాఖల కార్యదర్శులు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ, అగ్రిగోల్డ్ ప్రతినిధి ఒకరు సభ్యులుగా ఉంటారు.

# మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రణాళిక రూపొందించాలి

## పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తేజ్ భరత్

**విజయవాడ ఏప్రిల్ 10 ప్రభాతవార్త ప్రతినిధి:** పట్టణాల్లో మహిళలు పారిశ్రామిక రంగాల్లో రాణించేందుకు అన్ని విధాలుగా కృషిచేయాలని చిన్న, మధ్య తరహా పరిశ్రమల సమాఖ్య ప్రతినిధులను పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తేజ్ భారత్ కోరారు. 30వేల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు సహకరించాలన్నారు.ఇంటికో మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు తాడేపల్లిలో నిర్వహించిన సదస్సులో భరత్ మాట్లాడారు. పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు, పారిశ్రామిక వాతావరణం సృష్టించే దిశగా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే అనేకమంది మహిళలు వివిధ ఉత్పత్తుఉ తయారు చేస్తున్నారని వారందరికీ మార్కెటింగ్‌పై శిక్షణ ఇవ్వాలని నిర్ణయించామని అన్నారు. గత 9 నెలల్లో పట్టణ స్వయం సహాయక సంఘాలకు రూ.16 వేల కోట్ల రుణాలు అందించామని వివరించారు. సదస్సులో ఎస్ఎంఈ అధ్యక్షుడు వినోద్‌కుమార్ పూతే, డైరెక్టర్ సుష్మ మోర్దారియా, మెప్మా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### తిరుపతికి రేపు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**తిరుపతి,ఏప్రిల్ 10ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరకు వెంకయ్యనాయుడు రెండురోజుల పర్యటనకు శనివారం ఉదయం తిరుపతికి విచ్చేస్తున్నారు. 12,13 శని,ఆదివారాలు రెండు రోజులు తిరుపతిలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 12వతేదీ శనివారం ఉదయం 7.45గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. ఉదయం 10గంటలకు తిరుపతి మహతి ఆడిటోరియంలో జరిగే ఒకే దేశం ఒకే ఎన్నిక సదస్సులో పాల్గొంటారు. సాయంత్రం 5గంటలకు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో హాస్టల్ బిల్డింగ్ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. 13వతేదీ ఉదయం 8.20గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని హైదరాబాద్ బయలుదేరి వెళతారు.


**GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION**
TN No.: 01/2025-26/SE (WS)/EE-III(WS-M)/DB-III, Dt: 08.04.2025
No. of Works : 1, Value of Work : Rs.57.02 Lakhs
Downloading Starting Date : 10-04-2025
Tender Closing Date : 25-04-2025
Further details at http://www.tender.apeprocurement.gov.in
O/o EE (WS) Cell No.: 9912255228.
For Commissioner

**ANANTAPURAMU MUNICIPAL CORPORATION**
**e-PROCUREMENT - Tender Notice**

| | | |
|---|---|---|
| 1. | Tender Notice No | 01 to 19/15th FC/General Funds/2025-26/TO |
| 2. | Scope of work | Laying of CC Road and Drains, Replacing of Panel Board, and Supply of 375 KW/500 HP Square Guage Induction Motor, Supply of Wheel Loader and Bins in various places in Anantapuramu Municipal Corporation. |
| 3. | No. of Works | 19 Nos |
| 4. | Estimate Cost | Rs. 0.82 to 78.00 Lakhs |

Note : The details of tender may be seen on e - procurement market Place available @ https://tender.apeprocurement.gov.in.
sd/- Commissioner, Municipal Corporation, Anantapuramu

**ANDHRA PRADESH STATE CIVIL SUPPLIES CORPORATION LIMITED**
Head Office: 10-152/1, Sri Sai Towers, Bandar Road, Kanuru, Vijayawada - 520007
Mktg/M6/0888/ICDS/FP.Oil Tender/Jul 25 to Sep 25 Dt : 10.04.2025
**TENDER NOTICE**
BIDS ARE INVITED FROM THE ELIGIBLE BIDDERS FOR SUPPLY OF 1362 KLS OF FORTIFIED EDIBLE P.OIL WITH VITAMIN A & D IN ONE (1) LITRE & HALF (1/2) LITRE WITH SECONDARY PACKING SHALL BE 12/16 LITER POUCHES IN 1 CARTON TO ALL MLS POINTS OF THE THREE ZONES COMPRISING OF 26 DISTRICTS IN ANDHRA PRADESH FOR DISTRIBUTION UNDER ICDS/THR SCHEME FOR THE MONTHS OF July 2025 to Sep 2025 THROUGH NCDEX e-Markets Limited (NeML) PLATFORM
Andhra Pradesh State Civil Supplies Corporation Ltd invites Short Tenders for supply of 1362 KLs of Fortified Edible P.Oil with Vitamin A & D in One (1) Litre & Half (1/2) Litre with Secondary Packing shall be 12/16 Liter Pouches in 1 Carton to all MLS Points of the three zones comprising of 26 Districts in Andhra Pradesh.
All the interested bidders may visit www.apscscl.in & www.neml.in to view and download tender documents at free of cost.
Interested bidders need to register in portal as vendor i.e., in NCDEX e Markets Limited
Contact: Tel: 9962059599 or 9032429420 or 9885549722 and Email: askus@neml.in.
Last date for registration and completion of formalities for the e-auction shall be up to 24.04.2025 up to 5.00 pm and the tentative date of online e- auction through NCDEX e-MARKETS LIMITED (NEML) platform would be 26.04.2025 at 11 am onwards.
Sd/- VC & MANAGING DIRECTOR

వార్త

అభిప్రాయాలను మార్చుకోలేని వ్యక్తి తన తప్పుల్ని సరిదిద్దుకోలేడు. నేటి కంటే రేపు ఎక్కువ వివేకం ప్రదర్శించాలనుకుంటే మనిషిలో మార్పు అవసరం.

-ఎడ్వర్డ్

# విద్యావ్యాపారాన్ని నియంత్రించలేమా?

ఊదుర్గొట్టంవాడు ఊదుతూ ఉంటే చల్లార్పుడు గొట్టం వాడు చల్లారుస్తున్నట్లుగా ఉంది ఫీజుల విషయంలో కొన్నిప్రైవేట్ సంస్థలు, పాలకులు వ్యవహరిస్తున్న తీరు. ప్రభుత్వం నిర్ణయించే ఫీజుల కంటే ఎక్కువ వసూలు చేయరాదని, అలా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పాలకులు పదేపదే హెచ్చరిస్తున్నారు. అయినా ఇవేమీ తమకు పట్టనట్లు తమను ఏమీ చేయలేవన్నట్లుగా కొన్ని యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. వాస్తవంగా ఈ విద్యాసంవత్సరం ఇంకా పూర్తికాలేదు. కొన్ని తరగతులకు పరీక్షలు కూడా జరుగుతున్నాయి. ఎంసెట్ లాంటి కీలక పరీక్షలు కూడా ఇంకా నిర్వహించలేదు. నూతన విద్యాసంవత్సరం ఆరంభంకావడానికి మరో రెండు నెలలవరకు సమయం ఉంది. కానీ కొన్ని యాజమాన్యాలు ఇప్పటి నుంచే కౌంటర్లు ఓపెన్ చేశాయి. గత యేడాదికన్నా ఫీజులు పెంచేశారు. ఈ దోపిడీ ఎల్‌కెజి నుంచే ఆరంభమవుతున్నది. ఎల్‌కెజికే లక్షలాది రూపాయలు వసూలు చేసే పాఠశాలలు పుట్టుకొచ్చాయి. పిల్లలనే కాదు వారి తల్లిదండ్రులను కూడా ఇంటర్వ్యూ చేసి వారి ఆర్థిక స్తోమతను అంచనా వేసుకొని సీట్లు ఇస్తున్నారు. అయితే ప్రభుత్వ నిబంధనలకు లోబడే తాము సీట్లు కేటాయిస్తున్నట్లు నామమాత్రపు రశీదులు ఇస్తున్నారు. ఈ ఫీజుల భారం భరించలేని కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన గళం విప్పుతున్నారు. మరికొందరు ఏకంగా ప్రభుత్వాధికారులకు ఫిర్యాదులు కూడా చేస్తున్నారు. ఈ తతంగమంతా ఏదో రహస్యంగా జరగడం లేదు. బాహాటంగానే జరుగుతున్నదీ ఈ వ్యాపారం. కానీ పాలకులు ఈ ఫీజుల దోపిడీని అదుపు చేయలేకపోతున్నారు. అయితే శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్నట్లు ఈ ఫీజులు రకరకాల పేర్లతో వసూలు చేసుకుంటున్నారు. ప్రభుత్వం రూపొందించిన చట్టంకానీ,నిబంధనలు కానీఅలాంటి వారిని ఏమీ చేయలేకపోతున్నాయి. ఇది ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చినది కాదు. ఏనాటి నుంచో కొనసాగుతున్నది. విద్యనే కాదు విద్యార్థులతోసహా విద్యాసంస్థలను అమ్ముకునే దురదృష్టపు రోజులు దాపురించాయి. పుస్తకాలమోత పెరిగిపోయింది. అందులో కూడా ఆదాయం చూసుకుంటున్న సంస్థలు లేకపోలేదు. మొత్తంమీద బాలబాలికలకు పుస్తకాల బరువు, తల్లిదండ్రులకు ఫీజుల భారం మోయలేనంతగా పెరిగిపోతున్నది. వాస్తవంగా ఒకనాడు ప్రభుత్వ పాఠశాలలే కానీ ప్రైవేట్ బడులులేవు. ఎక్కడో పట్టణ ప్రాంతాల్లో అక్కడక్కడ ప్రైవేట్ బడులు నడిచేవి.వాటిలో కూడా వ్యాపార ధోరణులు కన్పించేవికావు. లాభనష్టాలతో సంబంధం లేకుండా కేవలం సేవాదృక్పథంతో ఆ విద్యాసంస్థలు ప్రజలకు సేవలు అందించేవి. నిర్వాహకులు సామాజిక బాధ్యతగా బడులు నడిపేవారు. అందువల్ల వాటిని అరికట్టాల్సిన అవసరం ఆనాటి పాలకులకులేకుండాపోయింది. అందుకే చట్టాల అవసరం అంతగా తలెత్తలేదు.కానీ పరిస్థితులు మారిపోయాయి. ఎయిర్ కండిషన్ రూమ్‌లు, బస్సులు, డ్రస్సులు ప్రతిదాంట్లో వ్యాపార ధోరణితో కొన్నియాజమాన్యాలు వ్యవహరించడం అత్యంత దురదృష్టకరం. పోని ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుస్తున్నాయంటే అదీలేదు. అసలు తనిఖీలే కరవైపోయాయి. సైన్స్‌ల్యాబ్,ఆటస్థలం, గ్రంథాలయం వంటి ప్రాథమిక వసతులుకూడా ఉన్నా లేకపోయినా పట్టించుకోవడం లేదు. ఇలాంటివి అన్ని ఒకఎత్తైతే అసలు ఏ అనుమతులులేకుండా నడుస్తున్న పాఠశాలల సంఖ్యతక్కువేమీ కాదు.వాటిలో చదివే విద్యార్థుల భవిష్యతు అగమ్యగోచరంగా ఉంటుంది. మధ్యలో ఆ పాఠశాలలను మూసివేస్తే వారు ఇచ్చే బదలీ సర్టిఫికేట్ ఎందుకూ పనికిరాదు. ఇవేమీ రహస్యంగా మూడోకంటికి తెలియకుండా నడిచేవి కాదు. బాహాటంగా పెద్దపెద్ద బోర్డులు పెట్టి ప్రకటనలు ఇచ్చుకుంటూ ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులను ఒప్పించి, మెప్పించి తమపాఠశాలల్లో చేర్చుకుంటున్నారు. ఇలా అక్రమంగా, గుర్తింపులేకుండా నడుస్తున్న పాఠశాలల్లో చేర్చవద్దని ఏదో నామమాత్రం పత్రికా ప్రకటనలు ఇచ్చి తమ బాధ్యత తీరినట్లుగా అధికారులు చేతులు దులుపుకుంటున్నారు.ఇక ఉన్నతవిద్య పరిస్థితి కూడా ఇందుకుభిన్నంగా లేదు. ఇంటర్మీడియేట్ అనేది సామాన్యులకు అందుబాటులో లేకుండాపోతున్నది. కొన్ని ప్రైవేట్ కాలేజీలు ఇంటర్మీడియేట్ రెండేళ్లకు ఎనిమిది నుంచి పదిలక్షలరూపాయలు వసూలు చేస్తున్నారు. ఇంజినీరింగ్ విద్య పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.ప్రధానంగా అమెరికాలో ట్రంప్ అధ్యక్షుడైన తర్వాత పరిస్థితి మరింతగా దిగజారింది. ఇప్పటికే భారత్‌లో లక్షలాదిమంది ఇంజినీర్లు ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. ఎన్నో కాలేజీలు విద్యార్థులు లేక మూతపడుతున్నాయి. మరోకపక్క కొత్తవి కూడా పుట్టుకొస్తున్నాయి. ఇక మెడికల్ విద్య అనేది అందని ద్రాక్షపండుగా తయారైంది. లక్ష్మీప్రసన్నులకు మాత్రమే లభ్యమయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. మెడికల్ సీటు కోటి రూపాయలకుపైగా ధరపలుకుతున్నది. ఇక మెడికల్‌లో పోస్టుగ్రాడ్యుయేషన్ కొన్ని సబ్జెక్టులకు నాలుగు నుంచి ఐదుకోట్ల రూపాయలకుపైగా ఎగబాకింది. ఈవిద్యావ్యాపారం గూర్చిపాల కులకు తెలియందేమీలేదు. అంతా బహిరంగమే. చదివిన వారిని చదువుకుంటున్నవారిని ఎవరిని అడిగినా కథలు కథలుగా చెప్తారు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరవాలి. బాలబాలికలను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన విద్యావ్యవస్థను ఇంతటిదారుణ పరిస్థితుల్లోకి నెట్టడం దురదృష్టకరం. మారిన పరిస్థితులకు అనుగుణంగా పటిష్టమైన చట్టాలను రూపొందించాలి. విద్యను వ్యాపారంగా చేసే వారిపై ఉక్కుపాదం మోపాలి.

# యూనివర్సిటీల అభివృద్ధికి నిధుల కొరత

**ఒకవైపు అణువైన ఫీజులు అంటూనే మరొకవైపు నచ్చినరీతిలో ఫీజుల విధానాన్ని రూపొందించుకునేటువంటి స్వేచ్ఛను ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు ఇవ్వడంతో అడ్మిషన్లు పెరిగాయి.కొత్త కోర్సులు, కొత్త ప్రయోజనాలు కూడా దీనికి ఒక ప్రధాన కారణం. కొంతమంది విద్యార్థులు విదేశీ విద్యపై మక్కువ చూపడంతో కూడా స్వదేశంలో ఉన్నటువంటి విశ్వవిద్యాలయాల్లో అడ్మిషన్లు తగ్గడానికి ఇదికూడా ఒక కారణం. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశ్వవిద్యాలయాల అభివృద్ధికి అధిక మొత్తంలో నిధులను కేటాయించాలి. రెగ్యులర్ ఫ్యాకల్టీని నియమించాలి. వీటితోపాటు విశ్వవిద్యాలయాల్లో ఉన్నటువంటి ఖాళీలను భర్తీ చేయాలి.అధ్యాపకులకు సైతం కొత్త కోర్సులు, కొత్త టెక్నాలజీకి సంబంధించినటువంటి అవగాహనను కల్పించాలి. విద్యార్థులకు తగినంత ఫెలోషిప్‌అంద జేయడమే కాకుండా నూతన పరిశోధనలు,నూతన ఆవిష్కరణలు కూడా జరుగుతాయి. అప్పుడే విద్యావ్యవస్థ మెరుగుపడుతుంది.**



డాక్టర్ మోటె చిరంజీవి

దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేది యువత. అలాంటి యువత ఆర్థికంగా,సామాజికంగా, రాజకీయంగా ఉన్నత భావాలు కలిగినటువంటి వ్యక్తులుగా తీర్చిదిద్దేది విశ్వవిద్యాలయాలలోనే. ఒకప్పుడు విశ్వవిద్యాలయాలు అంటే భారతదేశంలోనలంద, తక్షశిల గుర్తుకొచ్చేవి. ప్రపంచంలోనే అంత పేరు ఉన్నటువంటి విశ్వవిద్యాలయాలు అవి. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదు. ప్రస్తుతం రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు అభివృద్ధికి నోచుకోలేకపోతున్నాయి. దానికి ప్రధాన కారణం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలే. సరస్వతీ మాత కొలువై ఉండేటువంటి యూనివర్సిటీలలో చదువుకోవడానికి సరైన వసతులు లేక విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారు. దానికి ప్రధానకారణం నిధుల కొరత.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశ్వవిద్యాలయాల అభివృద్ధికి సరియైన నిధులను కేటాయించడం లేదనేది వాస్తవం. ప్రస్తుతం ఉన్నటువంటి విశ్వవిద్యాలయాలు విద్యార్థుల వారి భావజాలలకు, సంఘర్షణలకు, రాజకీయాలకు కేంద్ర బిందువులుగా మారాయి. ఎక్కడ చూసినా ఖాళీ తరగతి గదులు. అనేక సమస్యలతో సతమతమవుతున్నటువంటి వసతి గృహాలు. పరికరాలు లేని పరిశోధన కేంద్రాలు దర్శనమిస్తాయి.నిత్యం అనేక అల్లర్లతో అట్టుడుకుపోతున్నటువంటి విశ్వవిద్యాలయాలు కనిపిస్తాయి. రాష్ట్రంలోని దాదాపుగా అన్ని విశ్వవిద్యాలయాలు అభివృద్ధికి అందనంత దూరంలో ఉన్నాయి. బోధనలోను, పరిశోధనలోను ప్రత్యేకతను కలిగినటువంటి విశ్వవిద్యాలయాలు తెలంగాణ రాష్ట్రంలో మాత్రం పూర్వ వైభవాన్ని, ప్రతిష్టను రోజురోజుకు కోల్పోతున్నాయి. కేంద్రం ప్రకటించినటువంటి నేషనల్ ఇన్స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ 2024ర్యాంకింగ్‌లో మన రాష్ట్రంనుండి ఏ ఒక్క విశ్వవిద్యాలయానికి కూడా మంచిర్యాంకు లేదు. మొదటి 100 ర్యాంకులలో తమిళనాడుకు చెందినవి 15 ఉండగా, కర్ణాటక నుండి 11,ఆంధ్రప్రదేశ్ నుండి 5, కేరళ నుండి 4 విశ్వవిద్యాలయాలు చోటు దక్కించుకున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఉస్మానియా విశ్వవిద్యాలయం చోటు దక్కించుకున్నప్పటికిని ర్యాంకుల విషయంలో గతంలో కంటే కూడా ర్యాంక్ పడిపోయింది. గతంలో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి 36వ ర్యాంకు ఉండగా ప్రస్తుతం 43కి పడిపోయింది. కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ 2024లో ప్రకటించిన ర్యాంకులలో మొదటి ర్యాంకులో ఉండగా, న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ రెండవ స్థానంలో ఉండగా, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ 17వ స్థానంలో ఉంది. ర్యాంక్‌ల విషయంలో ఈ విధంగా ఉంటే విశ్వవిద్యాలయాల అభివృద్ధి విషయంలో అరకొర నిధులతో నాణ్యమైనటువంటి విద్యా పరిశోధనలు సాధ్యం కావనేటువంటి విషయం ప్రస్ఫుటమైంది. ఈ సంవత్సరం బడ్జెట్ కేటాయింపుల్లో విశ్వవిద్యాలయాలకు మొండి చేయి చూపిస్తూ, వర్సిటీలపై పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనేటువంటి ఆరోపణలున్నాయి. ప్రస్తుతం ఏర్పాటు చేసిన స్కిల్ యూనివర్సిటీ మినహా, రాష్ట్రంలోని 11 విశ్వవిద్యాలయాలు కలిపి 2024-2025 బడ్జెట్లో కనీసం రూ.1000 కోట్లు కూడా కేటాయించకపోవడం వల్ల విశ్వవిద్యాలయాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని,అభివృద్ధికి నోచుకోలేకపోతున్నాయని విద్యావేత్తలు చెబుతున్నారు.వారు




కేటాయించినటువంటి బడ్జెట్ విశ్వవిద్యాలయాల్లోపనిచేసేటువంటి ప్రొఫెసర్లు, ఉద్యోగుల జీతభత్యాలకు కూడా సరిపోవడం లేదనేటువంటి విమర్శలు ఉన్నాయి. విశ్వ విద్యాలయాల్లో మౌలిక వసతులు,హాస్టల్ భవనాలు సరిపోనులేకపోవడం,ఉన్నవాటికి పదేపదే రిపేర్లు రావడం,వాటికి రిపేరు చేయించేందుకు, అభివృద్ధి పనులకు నిధులు లేకపోవడం వల్ల విశ్వవిద్యాలయాల్లో అభివృద్ధి ఆశించినంత జరగడం లేదు.నిధులు లేని కారణంగా కొత్త కోర్సులు,కొత్త ప్రయోగశాలలు, కొత్త పరిశోధనలు ఆగిపోయాయి.గతంలో బడ్జెట్‌ను గనుక చూస్తే 2017-2018లో రూ.420 కోట్లు, 2018-2019లో రూ.210 కోట్లు, 2019-2020లో రూ. 480.52 కోట్లు కేటాయించగా, 2020-2021 బడ్జెట్‌ను పరిశీలిస్తే రూ.536.36 కోట్లు కేటాయించగా నిర్వాహణకు ఇచ్చింది మాత్రం రూ.533.36 కోట్లు. 2023-2024లో రూ.835.94 కోట్లు ప్రతిపాదించి, రూ.784.64 కోట్లు కేటాయించగా, ఈఏడాది రూ.500 కోట్లు కేటాయించినప్పటికీ ఇందులో ఉస్మానియా, మహిళా విశ్వవిద్యాలయాలకు రూ.100 కోట్ల చొప్పున కేటాయించగా మిగిలిన రూ.300 కోట్ల ప్రతిపాదించారు. నిర్వహణ పద్దుకింద రూ.956.34 కోట్లను ప్రతిపాదించారు. ఇందులో ఉస్మానియాకు రూ. 492కోట్లు, కాకతీయ విశ్వవిద్యాలయానికి రూ.134.94, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి రూ.17.95కోట్లు, తెలంగాణ విశ్వవిద్యాలయానికి రూ. 42.09 కోట్లు,తెలుగు విశ్వవిద్యాలయానికి రూ.43.37 కోట్లు, మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయానికి రూ.30.77 కోట్లు,శాతవాహన విశ్వవిద్యాలయానికి రూ.14.31 కోట్లు,పాలమూరు విశ్వవిద్యాలయానికి రూ.11.74కోట్లు, జేఎన్టీయూకు రూ.52.69 కోట్లు, జేఎన్ఏ ఫైన్ ఆర్ట్స్‌కు రూ.28.75 కోట్లు కేటాయించారు. ప్రతి విశ్వవిద్యాలయం అభివృద్ధికి సుమారు రూ.300కోట్లనుంచి రూ.600 కోట్లు నిధులు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నప్పటికీ అధికారంలో ఉన్నటువంటి ప్రభుత్వాలు అరకొరగా మాత్రమే నిధులను కేటాయించడం వల్ల విశ్వవిద్యాలయాల ప్రతిష్ట మసకబారుతుంది. ఈ విధంగా అరకొర నిధులు పూర్తి స్థాయిలో విడుదల చేయకపోవడం వల్ల విశ్వవిద్యాలయాలు ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నాయి. తద్వారా ప్రతి సంవత్సరం జాతీయస్థాయిలో విశ్వవిద్యాలయాలకు ప్రకటించేటువంటి ర్యాంకుల్లో మన విశ్వవిద్యాలయాల ర్యాంకులు దిగజారిపోతున్నాయి. ఉదాహరణకు వందేళ్ల చరిత్ర కలిగి ఉన్నటువంటి ఉస్మానియా విశ్వవిద్యాలయం న్యాక్ గుర్తింపులో వెనుకబడింది.నిధుల కొరత ఒక సమస్య అయితే విశ్వవిద్యాలయాలలో వివిధ దశల్లో బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీలు సుమారు 5 వేలకు పైగానే ఉన్నాయి. రెగ్యులర్ ఫ్యాకల్టీ లేక కాంట్రాక్టు, పార్ట్ టైంఫ్యాకల్టీతో బోధనను కొనసాగిస్తున్నారు. గతంలో మాదిరిగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో అడ్మిషన్లు లేవు.ప్రస్తుతం ప్రైవేటు విశ్వవిద్యాలయాలు ఏర్పాటు కావడంతో అవికూడా తగ్గిపోయాయి. దీని ద్వారా కూడా విశ్వవిద్యాలయాలకు వచ్చేటువంటి ఆదాయానికి గండిపడింది. ఒకవైపు అణువైన ఫీజులు అంటూనే మరొకవైపు నచ్చినరీతిలో ఫీజుల విధానాన్ని రూపొందించుకునేటువంటి స్వేచ్ఛను ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు ఇవ్వడంతో అడ్మిషన్లు పెరిగాయి. కొత్త కోర్సులు, కొత్త ప్రయోజనాలు కూడా దీనికి ఒక ప్రధాన కారణం. కొంతమంది విద్యార్థులు విదేశీ విద్యపై మక్కువ చూపడంతో కూడా స్వదేశంలో ఉన్నటువంటి విశ్వవిద్యాలయాల్లో అడ్మిషన్లు తగ్గడానికి ఇదికూడా ఒక కారణం. ప్రస్తుతం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విశ్వవిద్యాలయాల అభివృద్ధికి అధిక మొత్తంలో నిధులను కేటాయించాలి.రెగ్యులర్ ఫ్యాకల్టీని నియమించాలి. వీటితోపాటు విశ్వవిద్యాలయాల్లో ఉన్నటువంటి ఖాళీలను భర్తీ చేయాలి.అధ్యాపకులకు సైతం కొత్త కోర్సులు, కొత్త టెక్నాలజీకి సంబంధించినటువంటి అవగాహనను కల్పించాలి. విద్యార్థులకు తగినంత ఫెలోషిప్‌అందజేయడమే కాకుండా నూతన పరిశోధనలు,నూతన ఆవిష్కరణలు కూడా జరుగుతాయి. అప్పుడే విద్యావ్యవస్థ మెరుగుపడుతుంది. ఈ విధంగా విద్యా ప్రమాణాలు పెంచినట్లయితే విద్యార్థులు వారు అనుకున్నటువంటి గమ్యాన్ని చేరగలుగుతారు. అప్పుడే ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఆదిశగా తగిన నిధులు సౌకర్యాలు పరిశోధన అవకాశాలు అందజేయడంతో పాటు,ప్రైవేటు విశ్వవిద్యాలయాలపైన నియంత్రణకు కఠినమైనటువంటి నిబంధనలు అమలు చేయాలి. అప్పుడే విశ్వవిద్యాలయాలు మెరుగుపడతాయి. ●

"
పేదరికం కారణంగా ఇంతవరకూ ఏ దేశం సమిసిపోలేదు. అవినీతి కారణంగానే దేశాలు నేలమట్టమయ్యాయి.



నాని పాల్కీవాలా

"
కష్టతరమైన పనిని చేసే వ్యక్తి, అప్పగించబడిన పనిని చాలా బాగా చేసే వ్యక్తి ఎన్నటికీ తన ఆత్మగౌరవాన్ని కోల్పోడు.



జార్జి బెర్నార్డ్ షా

# పెంపుడు జంతువుల సంరక్షణకు పెద్దపీట వేయాలి

ఎస్. కిష్టయ్య

ప్రతి ఏప్రిల్ 11న జరుపుకునే జాతీయ పెంపుడు జంతువుల దినోత్సవం మానవ సమాజానికి మూగ జీవుల పట్ల ఉన్న మానవతా విలువలను గుర్తు చేసే రోజు. పెంపుడు జంతువులు మన జీవితాల్లో కేవలం వినోదానికి పరిమితమైన ప్రాణులు కాదు. అవి మన జీవిత భాగస్వాములు. కానీ ఈ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్న సమాజంలో, ఇంకా అనేక జంతువులు నిర్లక్ష్యానికి, హింసకు గురవుతుండటం నిజంగా విచారకరం. ఈ దినోత్సవం 2006లో అమెరికాలోని జంతు హక్కుల ఉద్యమకారిణి కోలీన్ పైజ్ ద్వారా ప్రారంభించబడింది. ఇప్పుడది భారత దేశంలో కూడా చైతన్యాన్ని కలిగిస్తూ ఉంది. లక్ష్యం ఒక్కటే పెంపుడు జంతువుల పట్ల ప్రేమను వేడుక చేసుకోవడమే కాక, వాటి సంక్షేమాన్ని, హక్కులను గుర్తించి, సంరక్షణకు పెద్ద పీట వేయడం. పెంపుడు జంతువులు మనకు ఒత్తిడిని తగ్గించే సహచరులు, మనసుకు ఓదార్పు ఇచ్చే స్నేహితులు. అవి మాట్లాడలేవు గానీ మన హృదయానికి అత్యంత దగ్గరగా ఉంటాయి. ఇవి మనకు నిజమైన, స్వార్థ రహిత ప్రేమను అందిస్తాయి. అలాంటి జీవుల పట్ల మన ప్రేమను వ్యక్తపరచేందుకు, వాటికి మంచి జీవితాన్ని ఇవ్వాల్సిన బాధ్యతను గుర్తుచేసేందుకు ఈ రోజు ఒక గొప్ప అవకాశంగా మారుతోంది. నగరాల్లో పెంపుడు జంతువుల పెంపకం ఒక ఫ్యాషన్‌గా మారుతోంది. కానీ పలు సందర్భాల్లో, బాధ్యతలేమి వల్ల, జంతువులను వీధుల్లో వదిలేయడం, గాలికొదిలేయడం వంటిఘటనలు పెరుగుతున్నాయి. వీధుల్లో తిరిగే అనేక మూగ జీవులు ఆకలితో, వ్యాధు



లతో బాధపడుతూ, ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇది మన సమాజానికి కంటిపాపగా నిలవాల్సిన సత్యం. పెంపుడు జంతువుల దినోత్సవం అంటే వాటికి ట్రీట్ ఇవ్వడం, ఫోటోలు తీసి షేర్‌చేయడం మాత్రమేకాదు. వాటి ఆరోగ్యం, భద్రత, మానసిక శాంతిని కాపాడడం కూడా మన బాధ్యత. ప్రతి యజమాని ఈ విషయాలను అర్థం చేసుకొని, జంతువుల పట్ల బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. పిల్లల్లో చిన్ననాటి నుంచే జంతువుల పట్ల దయాదాక్షిణ్యాలు కల్పించేందుకు పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలి. కుటుంబాల స్థాయిలో జంతు సంరక్షణ పట్ల అవగాహన పెంపొందించాలి. ప్రభుత్వాలు ఈ దినాన్ని పురస్కరించుకొని అనాథ జంతువుల ఆశ్రయకేంద్రాలకు నిధులు, పశు వైద్యం కోసం అవసరమైన సదుపాయాలు కల్పించాలి. పెంపుడు జంతువుల కొనుగోలుకన్నా, ఆశ్రయ కేంద్రాల్లోఉన్న జంతువులను దత్తత తీసుకోవడంద్వారా ఒక జీవితం కాపాడవచ్చు.కాలానుగుణంగా జంతువులకు వైద్య పరీక్షలు, టీకాలు, చికిత్సలు అందించాలి. పెంపుడు జంతువుల బాధ్యతలపై వర్క్‌షాపులు, అవగాహన కార్యక్రమాలు జరపాలి. జంతు హింసకు పాల్పడిన వారికి శిక్షలు తప్పనిసరిగా ఉండాలి. జాతీయ పెంపుడు జంతువుల దినోత్సవం మన ప్రేమను వ్యక్తపరచే ఒకరోజు మాత్రమే కాదు. మన బాధ్యతలను గుర్తుచేసే పిలుపు కూడా. మూగ జీవుల పట్ల మన ప్రేమ నిజంగా పరిపూర్ణం కావాలంటే, దానికి బాధ్యత అనే పునాదిని కలిపిచూడాలి. ఒక మూగ జీవికి మనం చూపే శ్రద్ధ, ప్రేమ,సంరక్షణ - ఇవే నిజమైన మానవత్వానికి నిదర్శనం. ఈ దినోత్సవం ద్వారా ఒక్కొక్కరికీ మానవతా స్పర్శగల హృదయం కల గాలి.ప్రేమతో పాటు బాధ్యతను చాటే ఉదాత్త జీవన దృక్కోణం కలగాలి. ●



# ప్రజావాక్కు

## పెరుగుతున్న సాంకేతికత

ఏప్రిల్ 6 శ్రీరామనవమి శుభదినాన భారత్ ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించిన రామేశ్వరంసముద్రం మీద నిర్మించిన పాంబన్ నిలువు లిఫ్ట్ రైల్వే సముద్ర వంతెన ఓ ఇంజినీరింగ్ మార్వెల్‌గా చెప్పవచ్చు. గుజరాత్‌లోని సోమనాథ్ దేవాలయంలోని శివలింగం గాలిలో తేలి ఉంటుందట. మన దేశంలో ఇటువంటి అపురూపమయిన శిల్పాలు, కళాఖండాలు పురాతన కాలం నుండి దేశం నలుమూలలా కానవస్తాయి. అధర్వణ వేదంలో పేర్కొన్న అస్త్రశస్త్రాలు ఈనాడు అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా లేవనేది నిర్వివాదాంశం.ఆనాడే మనసాంకేతిక నిపుణతను తేటతెల్లం చేసాయి. హైద్రాబాద్‌లోని చార్మినార్, కొవ్వూరు రాజమండ్రి రైల్వే స్టేషన్ల మధ్య గోదావరి నది మీద 1897 లో బ్రిటిష్ వారు నిర్మించిన హేవలాక్ బ్రిడ్జి కూడాఆనాటి సాంకేతికకు నైపుణ్యానికి చిహ్నాలు.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## పౌర సేవ ప్రతి పౌరుడి బాధ్యత

పౌర సేవ అనేది ఒక సమాజంలోని వ్యక్తులు పాటించాల్సిన నైతిక సామాజిక బాధ్యతల సమాహారం. ఇది వ్యక్తిగత స్థాయిలో మాత్రమేకాకుండా,సమాజం మొత్తం సుభిక్షంగా, శుభ్రంగా,శాంతియుతంగా ఉండేలా చేసే అత్యవసరమైన ప్రవర్తన. కానీ,దురదృష్టవశాత్తు, మన దేశంలో పౌరసేవ పెద్దగా ప్రోత్సహించబడలేదు.ఫలితంగా, వీధుల్లో చెత్తవేయడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, ప్రజాఆస్తులను ధ్వంసం చేయడం, ఇతరులను గౌరవించకుండా ప్రవర్తించడం వంటి సమస్యలు విస్తృతంగా కనిపిస్తాయి.మార్పుకు ప్రయత్నించాలి.

-సింగు.లక్ష్మీనారాయణ, కరీంనగర్

## ట్రాఫిక్‌కు అంతరాయం

గ్రామాలలో రోడ్లు ఇరుకుగా ఉంటున్నాయి. ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన మెటీరియల్ ఇంటి యజమానులు రోడ్లపై నెలల కొద్ది ఉంచడం వలన స్కూటర్లు, ఆటోలు, జీపులు,కార్లు, ట్రాక్టర్‌లు రావడానికి పోవడానికి చాలా ఇబ్బందికరంగా ఉంటున్నాయి. ఇంటి నిర్మాణం కోసం తెచ్చిన మెటీరియల్ రోడ్లపై ఉంచడం వలన ప్రయాణికులకు వాహనదారులకు గత సంవత్సర కాలం నుండి చాలా ఇబ్బందులు కలుగుతున్నాయి.

- రాపాక రవీందర్, జనగాం

## ఆరోగ్యమే మహాభాగ్యం

ప్రపంచంలో ఊబకాయంతో బాధపడుతున్న వాళ్లు కోకొల్లలు. మనదేశంలో కూడా తక్కువేమికాదు. ఈ ఒబెసిటికి ప్రధాన కారణం వ్యాయామలేమి. జంక్‌ఫుడ్ ఎక్కువ తీసుకోవడం అని నిపుణులు చెబుతుంటారు. మంచి ఆరోగ్యం పొందాలంటే చిరుతిళ్లు నిద్ర ముఖ్యంగా మానసిక ప్రశాంతత ఎంతో అవసరం. రోజుకు కనీసం పది నిమిషాలపాటు ధ్యానం చేయాలి. కష్టాలు కలకాలం ఉండవని గ్రహించాలి. నీరు ఎక్కువగా తాగాలి. శారీరకంగా,మానసికంగా దృఢంగాఉండాలి. పొగతాగడం, మందు వగైరాలకువెంటనే స్వస్తిపలకాలి. భక్తి,భుక్తి మితంగా ఉండాలి. అప్పుడు వృత్తిలో కూడా ఎదగడానికి ఆస్కారం ఎంతో ఉంది.

-ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

## పెన్షన్ ఫండ్ చెల్లించాలి

కోల్ ఇండియా, సింగరేణి బొగ్గు గని అధికారులకు కార్మికులకు కోల్‌మైన్స్ ప్రావిడెంట్‌ఫండ్ ద్వారా దాదాపు ఐదులక్షల మందికి పింఛన్ చెల్లిస్తున్నారు. అధికారులు, కార్మికుల వద్ద బేసిక్ నుంచి ఏడు శాతం వసూలు చేసి యాజమాన్యాలు ఏడుశాతం కలిపి పెన్షన్‌ఫండ్‌కు జమచేస్తున్నారు. పదవి విరమణ తర్వాత వారి బేసిక్, మారేడు కరువు భత్యంపై ఇరవై శాతం పెన్షన్ చెల్లిస్తున్నారు.నవంబర్ 2024సంవత్సరంవరకు రూ.3389. 53 కోట్లు పెన్షన్ ఫండ్‌కు వచ్చాయి. కానీ పెన్షన్ చెల్లింపులు 3705.76 కోట్లు చెల్లింపులు జరిగాయి. పెన్షన్ ఫండ్‌కు వచ్చిన మొత్తంకంటే 316.23కోట్లు తక్కువ జమ కావడంతో చెల్లింపులమధ్య ఆంతర్యం పెరుగుతుంది.2021సంవత్సరం నుంచి కోల్ ఇండియా,సింగరేణి సంస్థలు టన్ను బొగ్గు ఉత్పత్తికి రూ.10 పెన్షన్ ఫండ్‌కు జమ చేస్తున్నారు.

-ఆళవందార్ వేణుమాధవ్, హైదరాబాద్

## శ్రీలంక, భారత్ మధ్య సంబంధాలు

శ్రీలంక, భారత్‌మధ్య సంబంధాలు చరిత్రకమైనవి. సాంస్కృతికమైనవి. అది రామసేతు నుండి మొదలుపెట్టి శ్రీలంక తమిళుల వరకు ఉన్నవి. అయితే ఇక్కడ ప్రస్తావించాల్సింది శ్రీలంక తమిళుల గురించి వారు అక్కడ మైనారిటీలుగా బ్రతుకుతున్న వారే భారత్, శ్రీలంక మధ్య వారధులుగా ఉన్నారన్న విషయం మరిచిపోకూడదు. ఇకపోతే భారత్ శ్రీలంక మధ్య కచతీవు ద్వీపాలును ఒక స్నేహ బంధంగా మార్చి దాన్ని ఉభయ కుశలోపరిగా ఫిషింగ్‌హబ్‌గా ఎందుకు మార్చకూడదని ఆలోచించాలి.

- భారత అవినాష్, జనగామ

# ఇంకుడు గుంతలతో నీటి సమస్యలకు చెక్

కోట దామోదర్

నీరు లేకుండా ఏ జీవి కూడా బ్రతకజాలదు. మనం నీటిని పొదుపుగా ఉపయోగిస్తే, ప్రతి నీటి చుక్క మన భవిష్యత్తు తరాలను కాపాడుతుంది. మనం నీటిని వృథా చేస్తే, మన భవిష్యత్తు తరాలు అందుకు మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. పెరిగిపోతున్న నీటి ఎద్దడికి నిదర్శనం గత సంవత్సరం బెంగళూరులో జరిగిన తీవ్ర నీటి కొరత పరిస్థితులు. జనాభాకు తగినట్టు నీటి సరఫరా కొన్నేళ్ల క్రితం వరకు ప్రధాన నగరాల్లో నీటి కొరత అంత తీవ్రంగా ఉండేది కాదు. కానీ ఇప్పుడు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అత్యధికంగా భూగర్భజలాల వినియోగం, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ కారణంగా యధేచ్ఛగా అటవీ నిర్మూలన వంటి అంశాలతో నీటి సమస్య మరింత తీవ్రమవుతోంది. పర్యావరణ అసమతుల్యత కారణంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడడం, వర్షపు నీటిసంరక్షణ మెరుగైన సరస్సు నిర్వహణ లేకపోవడంవల్ల నీటి సమస్య గణనీయంగా పెరిగింది. నీటి సమస్యను అధిగమించాలంటే ప్రతి ఒక్కరూ చైతన్యవంతులై సుజల దీప్తికి బాటలు వేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. బాల్యం నుంచే నీటి పొదుపు జీవన శైలిలో ఒక భాగంగా మార్చాల్సి ఉంది. బెంగళూరు నీటి సంక్షోభాన్ని గట్టెక్కించేందుకు 'రెయిన్ రీచ్' కార్యక్రమం ద్వారా పర్యావరణవేత్త చేపట్టిన చొరవ ప్రతి ఒక్కరిని ఆలోచింపజేస్తుంది. చాలా నగరాలలో ఏటా కురిసే వర్షపాతంలో దాదాపు 90 శాతం వృధా అవుతుంది. నగరాలలో సరస్సులు కనుమరుగవడం, వర్షపు నీరు భూమిలోకి ఇంకకుండా రోడ్లనిర్మాణం చేపట్టడంతో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. నగరాలలో కురిసే వర్షపునీరు డ్రైనేజీ గుండా నేరుగా నదుల్లోకి చేరడం వల్ల భూగర్భజలాల పునరుద్ధరణకు అవకాశం లేదు. నీటిని సంరక్షించడానికి మన జీవన శైలిలో మార్పులు అవసరమని భావించి, పిల్లలలో సరైన అవగాహన కల్పిస్తే తద్వారా నీటిని ఆదాచేయడం చిన్నప్పటి నుండే అలవాటుగా మారుతుందని పర్యావరణ వేత్త పాఠశాల విద్యార్థులకు నీటి సంరక్షణ గురించి అవగాహన కల్పించడానికి 'రెయిన్ రీచ్" కార్యక్రమాన్ని ప్రారంభించారు. బెంగళూరు నీటి సంక్షోభం ప్రతి ఒక్కరికి ఒక గుణపాఠం వంటిది. నీటి సమస్యను అధిగమించడానికి పొదుపు మంత్రాన్ని జపించాల్సిందేనని రెయిన్ రీచ్ కార్యక్రమం ద్వారా మున్సిపల్ పాఠశాలల్లో వర్షపు నీటిని సురక్షితమైన తాగునీటిగా మార్చడానికి వడపోత వ్యవస్థతోకూడిన వర్షపు నీటి సేకరణ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఇది కాకుండా, వర్షపాతాన్ని డేటాలాగ్‌ను ఎలా కొలవాలో పిల్లలకు శిక్షణ ఇవ్వడం, వర్షపు నీరు శుద్ధి చేసే ప్రక్రియను అర్థం చేసుకోవడానికి పిల్లలకు సహాయపడే 'రెయిన్ గేజ్' వాతావరణ స్టేషన్‌ను ఏర్పాటు చేసి తద్వారా పిల్లలకుపూర్తి



అవగాహన ఏర్పడేలా అనుభవం కలిగిన నిపుణులతో వారికి శిక్షణ ఇస్తారు. ప్రతి నెలా పిల్లలకు నీటి సంరక్షణ గురించి అవగాహన కల్పిస్తూ, నీటి దుర్వినియోగంతో భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో అర్థమయ్యేలా, వ్యవస్థలను ఎలా జాగ్రత్తగా చూసుకోవాలో నేర్పిస్తారు. ఈ కార్యక్రమం ఫలితంగా బెంగళూరులోని 40 పాఠశాలలు ఇప్పటివరకు 34 మిలియన్ లీటర్ల నీటిని ఆదా చేయడం గర్వించదగిన విషయమే. విద్యార్థుల ఈ కృషిని స్ఫూర్తిగా తీసుకుని దీనిని ప్రతి ఒక్కరూ అలవర్చుకుంటే నీటికి ఢోకా ఉండదు. రెయిన్ రీచ్ సిస్టమ్ మాత్రమే కాదు, మిలియన్ వెల్స్ ఫర్ అనే సంస్థ కూడా బెంగళూరులో నీటిసంక్షోభాన్ని పరిష్కరించే లక్ష్యంతో కీలకమైన చొరవను చేపట్టింది. బెంగళూరు నీటి సరఫరా మురుగు నీటి పారుదల బోర్డుకు మద్దతుగా ఉన్న ఈ ప్రాజెక్ట్, సాంప్రదాయ బావి మైనింగ్ పద్ధతులను ఉపయోగించి నగరం అంతటా పది లక్షల లోతు బావులు నిర్మించడానికి ప్రయత్నిస్తోంది. బావి నిర్మాణం పురాతన పద్ధతులను ఉపయోగించడం ద్వారా, భూగర్భజల వనరులను సమర్థవంతంగా ఉపయోగించడానికి ప్రయత్నిస్తుంది, 2025 నాటికి పూర్తి చేయడానికి షెడ్యూల్ చేయబడిన మిలియన్ వెల్స్ ఫర్ బెంగళూరు ప్రాజెక్ట్ బెంగళూరుకు నీటి భద్రతను నిర్ధారించే దిశగా ప్రయత్నిస్తోంది. బెంగళూరు మాదిరిగానే హైదరాబాద్ లో కూడా నీటిసంక్షోభం ఏర్పడే అవకాశం లేకపోలేదు. రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రతతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటడానికి ఎన్నో కారణాలున్నప్పటికీ, అధిక నీటి వినియోగంతో పాటు వర్షపు నీటిని ఒడిసి పట్టి భూమిలోకి ఇంకింపచేయడంలో నగరవాసులు విఫలం కావడం ప్రధాన కారణాలుగా చెప్పొచ్చు. అయితే వర్షం నీటిని భూమిలోకి ఇంకింపచేయడంలో నగరవాసుల అలసత్వం ఒక కారణమైతే, ఈ అంశంపై ప్రభుత్వం తగిన ఆసక్తిని చూపకపోవడం మరో కారణం. ప్రతిచోటా సిసి రోడ్ల నిర్మాణం కారణంగా నగరంలో ఏటా కురిసే వర్షంనీరు భూమిలోకి ఇంకే అవకాశం చాలాతక్కువ. వర్షం నీరు భూమిలోకి ఇంకాలంటే అందుకు ఇంకుడుగుంత ద్వారానే సాధ్యం అని గ్రహించి మొదటిసారిగా ఇంకుడు గుంతల ఆలోచన ద్వారా జలయజ్ఞానికి శ్రీకారం చుట్టి వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపచేసిన వ్యక్తి బాకారం వద్ద గల పద్మశాలి కాలనీ వాస్తవ్యులు రాజాపేట ఆంజనేయులు. తొలి ప్రయత్నంలోనే ఆంజనేయులు శ్రమ ఫలించి భూగర్భ జల మట్టం పెరగడంతో కాలనీలోని మిగతా వారు కూడా ఆయన సారధ్యంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుని ఉపశమనం పొందారు. భూగర్భ జలాలు పెరగడానికి, నీటి ఎద్దడి నివారణకు ఇంకుడుగుంత తప్పనిసరని నిరూపించారు.తమిళనాడు రాష్ట్రానికి చెందిన మాజీ అధికారిణి శాంతా షీలా నాయర్ వ్యూహాత్మక ప్రణాళిక, విధాన రూపకల్పన నైపుణ్యం వల్ల చెన్నై తీవ్ర నీటిసంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు దోహదపడింది.నాయర్ సూచనమేరకు చెన్నైలోని ప్రజలందరూ ఇంటి అవసరాల కోసం ప్రత్యేక ట్యాంకులుపైపులను ఏర్పాటు చేసుకొని వర్షపు నీటి సంరక్షణకు పూర్తి మద్దతు ఇచ్చారు. ఈ చొరవ నీటి సంక్షోభాన్ని తగ్గించడంలో సహాయపడటమే కాకుండా నగరంలో స్థిరమైన నీటి నిర్వహణ పద్ధతులకు ఒక ఉదాహరణగా నిలిచింది. ●

మన ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# డేవిడ్ హెడ్లీని ఎందుకు అప్పగించలేదు?



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** భారత అభ్యర్థన నేపథ్యంలో ముంబయి పేలుళ్ల కేసు కుట్రదారుడు తహవ్వుర్ రాణాను అమెరికా అప్పగించింది. ఈ నేపథ్యంలో మరో కీలక సూత్రధారి డేవిడ్ హెడ్లీని ఎప్పుడు తీసుకొస్తారనే ప్రశ్న వినిపిస్తోంది. అయితే అతడిని భారత్‌కు తీసుకురావడం సాధ్యం కాదని తెలుస్తోంది. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ముంబయి దాడులకు ముందు ఆ కుట్రకు మాస్టర్‌మైండ్‌గా భావిస్తున్న డేవిడ్ కోల్మన్ హెడ్లీ ముంబయిలో రెక్కీ నిర్వహించాడు. అతడికి రాణా సహకరిం చినట్లు చెబుతున్నారు. అయితే ఇప్పుడు రాణాను అమెరికా ప్రభుత్వం భారత్‌కు అప్ప గించింది. కానీ హెడ్లీని అప్పగించేందుకు అమెరికా సుముఖంగా లేదని తెలుస్తోంది. అందుకు కొన్ని చట్ట, దౌత్య, వ్యూహాత్మక కారణాలు న్నాయని నిఘా వర్గాలు వెల్లడించాయి. తనను భారత్, పాక్, డెన్మార్క్‌కు అప్పగించ వద్దని 2010లో యుఎస్ అధికారులతో హెడ్లీ ఒక ఒప్పందం చేసుకున్నట్లు తెలిపాయి. ఇది చట్టపరమైన ఒప్పందమని, రాణా వంటి కుట్రదారులకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పినందుకు బదులుగా అతడికి మరణ శిక్ష తప్పిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ముంబయి దాడుల్లో ప్రమేయం, లష్కరే తొయిబా, పాకిస్థాన్ ఐఎస్ఐ సంబంధాల గురించి అతడు అంగీకరించిన నేపథ్యంలో అమెరికా దర్యాప్తుసంస్థలకు కీలకంగా మారాడు. ఇప్పుడు అతడిని అప్పగించడం వల్ల నిఘా కార్యాకలాపాలు, ప్రస్తుతం విచారణకు ఆటంకం ఏర్పడుతుందని అమెరికా భావిస్తున్నట్లు చెప్పాయి. యుఎస్ ఏజెన్సీలైన ఎఫ్‌బిఐ వంటి వాటితో అతడికి సంబంధాలు ఉన్నాయి. అతడు గతంలో వాటికి ఇన్‌ఫార్మర్‌గా పనిచేశాడని ఆ వర్గాలు వెల్లడించాయి. అలాగే ముంబయి దాడి గురించి ముందుగానే యుఎస్ నిఘా సంస్థ దృష్టికి వచ్చిందని, అయితే దానిని అరికట్టడానికి ముందస్తు చర్యలు తీసుకోలేదని కొన్ని లీకైన పత్రాలను బట్టి తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అతడిని అప్పగించడం వల్ల నిఘా సమాచాన్ని సేకరించే విధానాలు, ఉగ్రవాది–ఇన్‌ఫార్మర్‌గా హెడ్లీ వ్యవహారం బయటపడవచ్చని పేర్కొన్నాయి. ముందస్తు ఒప్పందం ప్రకారం అతడికి మరణశిక్ష విధించకూడదు. అయితే అజ్మల్ కసబ్ వంటి ఉగ్రవాదుల విషయంలో కఠినవైఖరి అనుసరించిన భారత్ ఈ షరతును అంగీకరించలేదని నిఘా వర్గాలు తెలిపాయి. ఇవన్నీ హెడ్లీ అప్పగింతకు అడ్డంకిగా మారినట్లు తెలుస్తోంది. రాణా ట్రావెల్ ఏజెన్సీ నిర్వహిస్తున్న సమయంలో అతడికి హెడ్లీ పరిచమయ్యాడు. ముంబయి ఉగ్రదాడికిముందు రాణాతో పాకిస్థాన్- అమెరికన్ ఉగ్రవాది డేవిడ్ హేడ్లీ టచ్‌లో ఉండేవాడని ఎన్ఐఎ తెలిపినట్లు ఇటీవల ఓ మీడియా కథనం వెల్లడించింది.

26/11 దాడికి ముందు ఎనిమిదిసార్లు హెడ్లీ భారత్‌కు వచ్చాడని.. ఆ సమయంలో 231 సార్లు రాణాతో సంప్రదింపులు జరిపాడని తెలిపింది. దాడులకు ముందు 2006, సెప్టెంబరు 14న హెడ్లీ తొలిసారి భారత్‌కు వచ్చి రెక్కీ నిర్వహించా డని..అప్పుడు 32 సార్లు రాణాతో మాట్లాడినట్లు పేర్కొంది. హెడ్లీ భారత్‌కు వచ్చినప్పుడల్లా.. ఒకసారి 23 సార్లు, మరోసారి 40 సార్లు, ఇంకోసారి 66 సార్లు.. ఇలా చాలాసార్లు ఇలా చాలాసార్లు మాట్లాడినట్లు తెలిపింది. దాడులకు సంబంధించిన ప్రాంతాల ఎంపికలో హెడ్లీకి రాణా ఎలా సహరించాడో ఎన్ఐఎ పత్రాలు స్పష్టంగా వెల్లడిస్తున్నాయని పేర్కొంది.



## రెచ్చగొడితే మేము భయపడం..

### చైనా విదేశాంగ ప్రతినిధి

**బీజింగ్, ఏప్రిల్ 10:** చైనా దిగుమతులపై అమెరికా భారీగా సుంకాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ టారిఫ్‌లపై ఆ దేశ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ తీవ్రంగా స్పందించారు. తాము చైనీయులమని.. కవ్వింపు చర్యలకు భయపడమని పేర్కొంటూ ఒక పాత విడియోను ఆమె పంచుకున్నారు.

డ్రాగన్ దిగుమతులపై 125 శాతం సుంకం విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిపై నింగ్ ఎక్స్ వేదికగా ఒక పోస్టుచేశారు. 'మేము చైనీయులం. కవ్వింపు చర్యలకు భయపడం. టారిఫ్ విషయంలో వెనక్కి తగ్గం' అని పేర్కొన్నారు. దీనికి ఆమె 1953 నాటి విడియోను పంచుకున్నారు. నాడు యుద్ధం నేపథ్యంలో డ్రాగన్ నాయకుడు మావో జెడాంగ్ ప్రసంగించిన విడియోఅది. అందులో 'ఈ యుద్ధం ఎంతకాలం కొనసాగుతుందో మేము నిర్ణయించలేం.. అది వాళ్ల ఇష్టం. ఇది ఎంతకాలం సాగినా మేము వెనక్కి తగ్గం. పూర్తిగా విజయం సాధించే వరకు పోరాడతాం' అని జెడాంగ్ పేర్కొన్నారు.

అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధం ముదురుతోంది. డ్రాగన్ దిగుమతులుపై ఉన్న 20 శాతం సుంకాలకు అదనంగా 34 శాతం విధిస్తున్నట్లు ఇటీవల ట్రంప్ ప్రకటించారు. దీనిపై డ్రాగన్ దీటుగా స్పందించింది. ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 34 శాతం అదనపు సుంకం విధించాలని నిర్ణయించింది. బీజింగ్ చర్యపై ట్రంప్ భగ్గుమన్నారు.

చైనాకు డెడ్‌లైన్ పెట్టి.. నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి, లేదంటే 104 శాతం టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించారు. ఈ బెదరింపుల నేపథ్యంలో అమెరికా ఉత్పత్తులపై 84 శాతం విధిస్తున్నట్లు బీజింగ్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో చైనాపై మరో 50 శాతం కలిపి మొత్తంగా 125 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఇదిలా ఉండగా.. ఇటీవల పలు దేశాలపై విధించిన సుంకాలపై ట్రంప్ కాస్త వెనక్కి తగ్గారు. 90 రోజులపాటు ఆయా టారిఫ్‌లను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. అయితే, వాటిపై 10 శాతం సుంకాలు అమలులో ఉంటాయన్నారు.



## రూ.3880 కోట్ల ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన

**వారణాసి, ఏప్రిల్ 10:** ప్రధానిమోడీ తన సొంత నియోజకవర్గం వారణాసిని సందర్శించనున్నారు. ఈ పర్యటనలో ఆయన ఒక బహిరంగ సభలో కూడా ప్రసంగిస్తారు. రూ.3880 కోట్ల విలువైన 44 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు. వారణాసి డివిజనల్ కమిషనర్ కౌశల్‌రాజ్‌శర్మ వివరాలప్రకారం 130 తాగునీటిప్రాజెక్టులు, 100 నూతన అంగన్‌వాడీ కేంద్రాలు, 356 గ్రంథా టలయాలు. పింద్రాలో ఒక పాలిటెక్నిక్ కళాశాల, ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలున్నాయి. ప్రధాని పోలీస్ లైన్స్‌లో ఒక ట్రాన్సిట్ హాస్టల్; రామ్‌నగర్‌లో పోలీస్ బ్యారక్‌లు, నాలుగు గ్రామీణ రహదారులను ప్రారంభిస్తారు. శాస్త్రి ఘాట్, సమ్మేఘాట్‌లను కూడామోడీ ప్రారంభిస్తారు. వారణాసి డెవలప్‌మెంట్ అథారిటీ చేపట్టిన వివిధప్రాజెక్టులను కూడా ప్రధానిమోడీ ప్రారంభించనున్నారు. ఏప్రిల్ 11న ఉదయం 10 గంటలకు ప్రధానిమోడీ వారణాసి లాల్ బహదూర్‌శాస్త్రి అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగనున్నారు. 4వేల మందికిపైగా పోలీసులను మోహరించారు. మోడీ రాక సందర్భంగా జరిగే బహిరంగసభలో 50వేలమందికిపైగాప్రజలు పాల్గొంటారని అంచనా.

# సుంకాలపై 90 రోజులు బ్రేక్



## ట్రంప్ నిర్ణయానికి కారణం ఏమిటి?

**వాషింగ్టన్, ఏప్రిల్ 10:** ప్రతీకార సుంకాలతో ప్రపంచ దేశాలను వణికించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాస్త వెనక్కి తగ్గారు. చైనా మినహా అనేక దేశాలపై టారిఫ్‌ల అమలుకు 90 రోజుల విరామం ప్రకటించారు. సుంకాలపై ముందునుంచీ 'తగ్గేదేలే' అంటూ దూసుకెళ్లిన ట్రంప్.. ఇప్పుడు ఉన్నంటుండి వాటికి ఎందుకు నిలిపివేశారన్నది చర్చనీయాంశంగా మారింది. దీనికి కారణం 'బాండ్ మార్కెటే' అంటున్నారు విశ్లేషకులు..!

ఏప్రిల్ 2న భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలపై భారీ స్థాయిలో ప్రతీకార సుంకాలతో ట్రంప్ విరుచుకుపడ్డారు. దీంతో ప్రపంచ మార్కెట్లన్నీ భారీ ఒడుదొడుకులను చవిచూశాయి. అయితే, ఈ టారిఫ్‌ల కారణంగా వాణిజ్య యద్ధ భయాలు నెలకొడంతో పాటు అంతర్జాతీయ మాంద్యం రావొచ్చని విశ్లేషకులు అంచనా వేశారు. ఇదే విషయాన్ని తోటి రిపబ్లికన్ నేతలు, బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ పదేపదే హెచ్చరించారు కూడా..! అయినా అధ్యక్షుడు టారిఫ్‌లను సమర్థించుకున్నారు. ఈ విషయంలో తన నిర్ణయం ఎప్పటికీ మారదు అని గట్టిగా చెప్పారు. ఆయనకు సర్దిచెప్పేందుకు చేసిన ప్రయత్నాలు కూడా విఫలమయ్యాయి. అయితే, చివరి నిమిషంలో అనూహ్యంగా సుంకాలపై విరామం ప్రకటించడం గమనార్హం.

**ఆ ఒక్క కారణం వల్లేనా..?**

ట్రంప్ నిర్ణయం వెనక 'బాండ్ మార్కెట్' ఒక్కటే కారణమని తెలుస్తోంది. ఈ మార్కెట్‌లో నెలకొన్న పరిణామాలతో యుఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్‌లో మొదలైన ఆందోళనలవల్లే అధ్యక్షుడు వెనక్కి తగ్గినట్లు కథనాలు వస్తు న్నాయి. అటు ట్రెజరీమార్కెట్‌లో వేగంగా జరుగు తున్న అమ్మకాల గురించి వైట్‌హౌస్ ఆర్థిక సలహాదారులు కూడా అధ్యక్షుడికి వివరించారట..! ఇదిలా ఉండగా టారిఫ్ విరామం ప్రకటించిన అనంతరం ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ బాండ్ మార్కెట్ గురించి ప్రస్తావించడం గమనార్హం. 'బాండ్ మార్కెట్ చాలా గమ్మత్తయినది. ప్రస్తుతం చాలా అద్భుతంగా ఉంది. దీని భవిష్యత్తు గురించి ప్రజలు ఇబ్బందిపడుతున్నారని అర్థమైంది. కొంతమంది కోపంగానూ ఉన్నారు' అని ట్రంప్ అన్నారు.

**ఏమిటీ బాండ్ మార్కెట్..**

కచ్చితమైన రాబడితోపాటు దీర్ఘకాలంలో నష్టభయం తక్కువగా ఉండే పెట్టుబడి సాధనం బాండ్లు. వీటిని జారీ చేసే సంస్థలు మదుపర్ల దగ్గరి నుంచి నిధులు సమీకరించి ఒక నిర్దిష్టం కాలంలో ముందుగా నిర్ణయించిన వడ్డీరేటు ప్రకారం తిరిగి పెట్టుబడిని చెల్లిస్తాయి. బాండ్లు, స్టాక్స్ మధ్య ప్రధాన వ్యత్యాసం ఏంటంటే.. కంపెనీలో స్టాక్‌హోల్డర్లకు ఈక్విటీ వాటి ఉంటుంది. అదే బాండు హోల్డర్లకు కంపెనీలో క్రెడిటార్ వాటా దక్కుతుంది. చాలా దేశాల్లో ప్రభుత్వంతోపాటు పలు కార్పొరేట్ కంపెనీలు కూడా ఈ బాండ్లను జారీ చేస్తుంటాయి.

# వక్ఫ్‌చట్టంపై దాఖలయిన పిటిషన్లపై 16న విచారణ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** పార్లమెంటు ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ చట్టం 2025 రాజ్యాంగ బద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీం కోర్టు ఈనెల 16న విచారణ జరపనుంది. ఈ పిటిషన్లను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌ఖన్నా నేతృత్వంలోని జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథ్‌తో కూడిన ముగ్గురు సభ్యుల ధర్మాసనం విచారించనుంది. ఇంతకుముందు ఏప్రిల్ 15న సుప్రీం విచారణ జరపనున్నట్లు వార్తలు వచ్చాయి. కొత్త వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ జమియత్ ఉలమాయె హింద్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, ఇతర ముస్లిం పక్షాల తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి, న్యాయవాది నిజాం పాషా పిటిషన్లు దాఖలు చేశారు. మొత్తం 10 పటిషన్లు సుప్రీం కోర్టులో దాఖలు అయ్యాయి. వీటిని పరిశీలించిన సుప్రీం



కోర్టు బెంచ్, వాటి అత్యవసర విచారణకు అంగీకారం తెలిపింది. ఏప్రిల్ 15 విచారించనున్నట్లు తెలిపింది.

అయితే దీనిపై కేంద్రం మంగళవారం సుప్రీం కోర్టు, హైకోర్టుల్లో కేవియట్‌ను దాఖలు చేసింది. తమ అభిప్రాయం తెలుసుకోకుండా ఎలాంటి ఆదేశాలూ జారీ చేయొద్దంటూ ఈ పిటిషన్ వేసింది. అంతకుముందే కేవియట్‌పై విచారణ జరపాలంటూ విజ్ఞప్తి చేసింది. ఈ నేపథ్యంలోనే వక్ఫ్ వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లను ఏప్రిల్ 16న విచారణ చేపట్టనున్నట్లు సుప్రీం తెలిపింది. వక్ఫ్ చట్టం అమలు ఇటీవల పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందిన వక్ఫ్ సవరణ చట్టం, 2025 ఈనెల 8నుంచే అమల్లోకి తెచ్చింది కేంద్రం. ఈమేరకు మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ చట్టం అమల్లోకి తీసుకొస్తున్నట్లు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇటీవల పార్లమెంట్‌లో పాస్ అయిన వక్ఫ్ బిల్లు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదముద్ర వేశారు. అనంతరం వక్ఫ్ (సవరణ)బిల్లు, చట్టంగా మారింది. ఇదిలా ఉండగా, విపక్ష ఇండియా కూటమి కొత్తవక్ఫ్ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ చట్టాన్ని రాజ్యాంగ విరుద్ధం అని పేర్కొంటున్నాయి. బెంగాల్‌లో వక్ఫ్ సవరణ చట్టాన్ని అమలు చేయబోమని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తేల్చి చెప్పేశారు.



## పశుపతినాథ్ ఆలయం సందర్శించిన కేంద్ర మంత్రిచౌహాన్

**ఖాట్మండు, ఏప్రిల్ 10:** కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ నేపాల్‌లోని పశుపతినాథ్ ఆలయాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆయన పశుపతినాథ్‌ను దర్శించుకన్నారు. బిమ్స్‌టెక్ దేశాలకు చెందిన వ్యవసాయ శాఖ మంత్రులు ఖాట్మండులో సమావేశం అవుతున్నారు. ఆ సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లిన ఆయన పశుపతినాథుడి దర్శనంచేసుకున్నారు. తన సోషల్‌మీడియా ఎక్స్ ఖాతాలో పశుపతినాథ్ ఆలయ సందర్శనకు చెందిన విడియోనుపోస్టు చేసాడు. ఆలయ ఆవరణలో రుద్రాక్ష, హార్ సింగార్‌మొక్కలను కేంద్ర మంత్రి నాటారు.

# రేప్‌కేస్ నిందితుడికి బెయిల్ ఇచ్చిన హైకోర్టు!

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** అలహాబాద్ హైకోర్టు ఓ రేప్ కేసులో నిందితుడికి బెయిల్ మంజూరీ చేసింది. అత్యాచారానికి గురైన మహిళే.. ఆ సమస్యకు కారణమైందని కోర్టు అభిప్రాయపడింది. ఆమె సమస్యకు ఆమే బాధ్యురాలు అని కోర్టు పేర్కొన్నది. జస్టిస్ సంజయ్ కుమార్ సింగ్ ఆ కేసులో తీర్పును వెలువరించారు. 2024 సెప్టెంబర్‌లో ఢిల్లీలోని హౌజ్ ఖాస్ బార్‌లో ఓ మహిళకు ఓ వ్యక్తి పరిచయం అయ్యాడు. అయితే ఆ వ్యక్తే తనను రేప్‌కు గురి చేసినట్లు ఆ మహిళ ఫిర్యాదు చేసింది. డిసెంబర్ 2024లో నిందితుడిని అరెస్టు చేశారు. ఆ కేసులో ఇవాళ అలహాబాద్ హైకోర్టు తీర్పుఇచ్చింది. ఒకవేళ బాధితురాలు చెప్పిన విషయాలన్నీ నిజమే అయినా.. ఆ సమస్యకు కారణం ఆమే అని కోర్టు చెప్పింది. సమస్యను ఆమే ఆహ్వానించిందని న్యాయమూర్తి తెలిపారు. బాధితురాలి హైమెన్ పొరకు డ్యామేజ్ అయినా.. అది లైంగిక దాడి వల్లే జరిగినట్లు డాక్టర్లు ధ్రువీకరించలేకపోయారు. ఆ మెడికల్ రిపోర్టును కోర్టు



పరిగణలోకి తీసుకున్నది. ముగ్గురు మహిళా మిత్రులతో కలిసి బార్‌కు వెళ్లిన యూనివర్సిటీ విద్యార్థిని అక్కడ ఫుల్‌గా తాగింది. మత్తులో ఉన్న ఆమెకు ఓవ్యక్తి ఆ పబ్‌లో పరిచయం అయ్యాడు. ఆ వ్యక్తే ఈ కేసులో నిందితుడు. తెల్లవారుజామున 3 గంటల వరకు బార్‌లో ఉన్న ఆ వ్యక్తి.. ఆమెను ఇంటికి తీసుకెళ్లాడు. రెస్ట్ తీసుకునేందుకు అతని ఇంటికి వెళ్లినట్లు ఆ మహిళ తన ఫిర్యాదులో తెలిపింది. అయితే ఆ వ్యక్తి తనను అసభ్యకరంగా టచ్ చేశాడని, తన ఇంటికి బదులుగా బంధువుల ఇంటికి తీసుకెళ్లి రేప్ చేసినట్లు ఆమె ఆరోపించింది. నోయిడా పోలీసులు ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేసి నిందితుడిని అరెస్టు చేశారు. బెయిల్ పిటీషన్‌లో నిందితుడు ఆ రోజు జరిగిన సంఘటనలను వివరించారు. ఫుల్‌గా తాగిన ఆ మహిళకు సపోర్ట్ అవసరమైన నేపథ్యంలో ఆమెను ఇంటికి తీసుకెళ్లినట్లు అతను చెప్పాడు. బంధువుల ఇంటికి ఆమెను తీసుకెళ్లినట్లు చేసిన ఆరోపణలను అతను కొట్టివేశాడు. తానేమీ రేప్‌కు పాల్పడలేదని, కానీ ఇరువురం ఇష్టపూర్వకంగా శృంగారంలో పాల్గొన్నట్లు చెప్పాడు. కోర్టు ఈ కేసులో తీర్పునిస్తూ.. బాధితురాలు ఓ పీజీ విద్యార్థి అని, ఆమె చర్యలపై ఆమెకు అవగాహన ఉంటుందని తెలిపింది. కేసు పూర్వాపరాలు, పరిస్థితులు, సాక్ష్యాలను పరిగణలోకి తీసుకుని తీర్పును ఇస్తున్నట్లు జస్టిస్ పేర్కొన్నారు. పిటీషనర్ బెయిల్‌కు అర్హుడని, అందుకే అతని బెయిల్ పిటీషన్‌ను ఆమోదిస్తున్నట్లు జస్టిస్ కుమార్ ఆదేశాలు ఇచ్చారు. సీనియర్ అడ్వకేట్ వినయ్ సరన్, అడ్వకేట్ బల్బీర్ సింగ్‌లు నిందితుడి తరఫున వాదించారు.

## పిడుగుపాటుకు బీహార్‌లో 21 మంది మృతి

**పాట్నా, ఏప్రిల్ 10:** రాష్ట్రంలో వర్షాలు భీభత్సం సృష్టిస్తున్నాయి. ఈదురుగాలులు, వడగళ్ల వానలు రాష్ట్రంలోని పలు జిల్లాలను అతలాకుతలంచేసాయి. వర్షం కారణంగా అనేక చోట్ల పిడుగులు పడ్డాయి. ఈపిడుగుల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 21 మంది ప్రాణాలు కోల్పోయారు. బెగుసరాయ్, దర్భంగా జిల్లాల్లో ఐదుగురుచొప్పున, మధుబనిలో నలుగురు, ఔరంగాబాద్, సమస్తిపూర్, సహర్సా జిల్లాల్లో ఇద్దరేసి చొప్పున మృతిచెందారు. ఔరియాలో ఒకరు చనిపోయారని అధికారులు తెలిపారు. సిఎం నితీష్‌కుమార్ ఈ పిడుగుపాటుకు 21 మంది మృతిచెందడంపై తీవ్ర విచారం వ్యక్తంచేసారు. మృతుల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.4 లక్షలుచొప్పున పరిహారం ప్రకటించారు. బాధిత కుటుంబాలకు ఆయన సంతాపం తెలిపారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, వర్షం పడుతున్న సమయాల్లో బహిరంగప్రదేశాలకు వెళ్లకుండా ఇంటిపట్టునే ఉండాలనిసూచించారు.

# రూ.63 కోట్ల అవకతవకలపై ఇడి దర్యాప్తు

**బెంగుళూరు:** కర్నాటకలోని కోఆపరేటివ్ బ్యాంకుకు చెందిన ఓ బ్రాంచీలో సుమారు రూ.63 కోట్ల ఆర్థిక అవకతవకలు జరిగాయి. ఆ కేసులో సహకార బ్యాంక్ మాజీ ఛైర్మెన్ ఆర్ఎం మంజునాథ గౌడ్‌ను ఇన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్టు చేశారు. మనీల్యాండరింగ్ చట్టం కింద అతన్ని అదుపులోకి తీసుకున్నారు. బెంగుళూరులోని ప్రత్యేక కోర్టులో అతన్ని ప్రవేశపెట్టారు. మంజునాథ గౌడను సుమారు 14 రోజుల పాటు కస్టడీలోకి తీసుకున్నట్లు ఇడి అధికారులు తెలిపారు. బెంగుళూరుతో పాటు శివమొగ్గ జిల్లాల్లో ఇడి ఇటీవల తనిఖీలు చేపట్టింది. శివమొగ్గ జిల్లా సహకార సెంట్రల్ బ్యాంక్‌లో అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. భారీ స్థాయిలో నిధుల అవకతవకలు జరిగాయని, గౌడ ఆదేశాల మేరకు సిటీ బ్రాంచ్ మేనేజర్ బీ శోభ అక్రమాలకు పాల్పడినట్లు ఇడి ఆరోపించింది. ఇడి చేసిన ఆరోపణలపై స్పందించేందుకు బ్రాంచ్ మేనేజర్లు అందుబాటులో లేరు. లోకాయుక్త పోలీసుల ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. మేనేజర్ శోభతో కలిసి ఛైర్మెన్ 63 కోట్ల నిధుల్ని అక్రమంగా తరలించినట్లు ఇడి పేర్కొన్నది.అకౌంట్ హోల్డర్లకు తెలియకుండా గోల్డ్ లోన్ అకౌంట్లు అక్రమంగా ఓపెన్ చేసి నిధుల్ని స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీని కోసం నకిలీ డాక్యుమెంట్లు సమర్పించినట్లు ఈడీ పేర్కొన్నది. బ్యాంక్ నుంచి అక్రమంగా తీసిన డబ్బును .. మేనేజర్ శోభ ఛైర్మెన్ గౌడకు పంపినట్లు ఇడి తన రిపోర్టులో తెలిపింది. ఆ డబ్బుతో మంజునాథ గౌడ్ వివిధ ప్రదేశాల్లో ప్రాపర్టీలను కొనుగోలు చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు లోకాయుక్త పోలీసులు గుర్తించారు.

# విమానం లాండ్ అయిన వెంటనే గుండెపోటుతో పైలట్ మృతి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** విమానయాన సంస్థ ఎయిరిండియాలో పనిచేస్తున్న 28 ఏళ్ల పైలట్ గుండెపోటుతో మృతిచెందాడు. విమానం ల్యాండ్‌చేసిన తర్వాత అస్వస్థతకుగురై ప్రాణాలు కోల్పోయారు. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ పైలట్ ఆర్మాన్ బుధవారం శ్రీనగర్‌నుంచి ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో విమానాన్ని ల్యాండ్ చేసారు. ఆ తర్వాత డిస్పాచ్ ఆఫీసుకువెళ్లిన ఆయన అస్వస్థతకు గురై కుప్పకూలిపోయారు. తక్షణమే స్పందించిన తోటి సిబ్బంది ఆయన్ను ఆసుపత్రికి తరలించారు. కానీ దారిలోనే మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. అంతకుముందు విమానంలో కూడా వాంతులు చేసుకున్నారని సిబ్బంది తెలిపారు. విమానం ల్యాండ్ అయిన తర్వాత డిస్పాచ్ ఆఫీస్‌కు వెళ్లేముందు కాస్త నీరసంగా కనిపించారని ఆవెంటనే గుండెపోటుకు గురయ్యారని చెప్పారు. తమ కళ్లముందే సహోద్యోగికి ఇలా జరగడంతో వారు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయనకు ఇటీవలే వివాహం జరిగింది. ఘటనపై ఎయిరిండియా తీవ్ర విచారం వ్యక్తంచేసింది. అర్మాన్ ఆకస్మిక మృతికి తీవ్రంగా చింతిస్తున్నాం. ఆయన కుటుంబం గురించే మా ఆలోచన అంతా. ఈ క్లిష్టసమయంలో ఆకుటుంబానికి మా సహాయ సహకారాలు అందిస్తున్నాం. ప్రతి ఒక్కరూ గోప్యత పాటించాలని ఊహాగానాలు చేయొద్దని కోరుతున్నాం అని సంస్థ ప్రతినిధి అభ్యర్థించారు. ఈ ఘటన నేపథ్యంలో పైలట్ల పని గంటల గురించి మరోసారి చర్చ మొదలయింది.

# కాపురంలో చిచ్చురేపిన నీటి ఎద్దడి

## మధ్యప్రదేశ్‌లో ఘటన

**భోపాల్, ఏప్రిల్ 9:** గ్రామంలో ఏర్పడిన నీటి ఎద్దడి ఓ కుటుంబంలో చిచ్చురేపింది. మంచినీళ్లు లేని ఊళ్లో తాను ఉండలేనంటూ ఓ ఇల్లాలు తన భర్తను వదిలి పిల్లలతో పుట్టింటికి వెళ్లిపోయింది. మధ్యప్రదేశ్‌లోని దేవ్ర గ్రామంలో జరిగిన అ ఘటన మంగళవారం వెలుగు చూసింది. దేవ్ర గ్రామంలో నివసించే జితేంద్ర సోని రోజువారీ కూలీ చేసుకుని బతికే కార్మికుడు. జిల్లా ప్రధాన కార్యాలయానికి కేవలం 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న దేవ్ర గ్రామంలో నీటి ఎద్దడి తీవ్రస్థాయిలో ఉంది. గ్రామంలో ఉన్న ఒకే ఒక్క బోరుబావి వద్ద బిందెడు నీళ్ల కోసం గ్రామస్థులు రోజంతా బారులు తీరి ఉండాల్సిందే. ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకును ప్రభుత్వం నిర్మించినా దానికి నీటి సరఫరా ఏర్పాట్లు లేవు.

గ్రామంలో నల్లా కనెక్షన్లు అసలే లేవు. నీటి సమస్యను భరించలేక తన భార్య పిల్లల్ని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయిందని, పిల్లల చదువులు దెబ్బతింటాయని చెప్పినా భవిష్యత్తు లేని గ్రామంలో తన పిల్లలు ఏం బాగుపడతారని ఆమె నిలదీసిందని జితేంద్ర జిల్లా అధికారుల వద్ద వాపోయాడు. దీంతో స్పందించిన అధికారులు వెంటనే గ్రామానికి మంచినీటి సౌకర్యం కల్పించాలని ప్రజారోగ్య ఇంజనీరింగ్ (పీహెచ్ఇ) శాఖను ఆదేశించారు.

# డిప్యూటీ ప్రధానిగా నితీశ్‌కుమార్?

## కేంద్ర మాజీ మంత్రి అశ్విని కుమార్ చౌబే సంచలనం

**పాట్నా, ఏప్రిల్ 10:** బీహార్ సిఎం నితీష్‌కుమార్ దేశ ఉపప్రధాని పదవిని చేపడతారా అవునంటూ వస్తున్న వార్తలు దేశరాజకీయాల్లో చర్చనీయాంశం అయ్యాయి. బిజెపి సీనియర్ నాయకుడు కేంద్ర మాజీ మంత్రి అశ్వినీకుమార్ చౌబే మాట్లాడుతూ జెడియు అధినేత నితీశ్‌కుమార్‌ను ఉపప్రధానిగా చూడాలనుకుంటున్నట్లు చెప్పారు. ఎన్డీయేకు నితీశ్‌చేసిన సేవలు వెలకట్టలేనివి. సంకీర్ణ ప్రభుత్వంలో కీలకపాత్రపోషిస్తున్నారు. ఈసేవలను గుర్తించి ఆయనకు డిప్యూటి పిఎం పదవి ఇవ్వాలన్నది నాకోరిక. ఇది నా వ్యక్తిగత అభిప్రాయం. ఒకవేళ అదే జరిగితే బీహార్‌నుంచి ఆ స్థానానికి చేరిన రెండో వ్యక్తిగా నితీశ్ నిలుస్తారని అన్నారు. అంతకుముందు బీహార్‌నుంచి బాబూ జగజ్జీవన్‌రామ్ ఉపప్రధానిగాపనిచేసారు. ఈ ఏడాది చివరిలో బీహార్ అసెంబ్లీఎన్నికలకు వెళ్లనుంది. నితీశ్‌మరోసారి ఎన్నికల్లో పోటీచేయాలని అనుకుంటున్నారు. రెండు దశాబ్దాలకుపైగా రాష్ట్రరాజకీయాల్లో కీలకపాత్రపోషిస్తున్ననితీశ్ ముఖ్యమంత్రి పదవిపై ఆశతో మళ్లీ కూటమి



మారే ప్రయత్నంచేస్తారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ఏపార్టీతో జట్టుకట్టినా సీఎం స్థానం మాత్రం ఆయనదే. రాష్ట్రంలో ఈరాజకీయాలతో కూటమిలో రెండోస్థానానికే పరిమితమైన బిజెపి ఆయన్ను గౌరవ ప్రదంగా పక్కనపెట్టాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే సీఎం అభ్యర్థిగా నితీశ్‌కుమార్‌ను ప్రకటించేందుకు బిజెపి ఆసక్తిచూపించడంలేదంటూ ఇటీవల ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత కిశోర్ వ్యాఖ్యలుచేసిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాల మధ్య బిజెపినేత చేసిన ప్రకటన ప్రాధాన్యతను సంతరించుకుంది.

## అమిత్‌షాది డేరింగ్ పర్సనాలిటీ..

# నేనూ అలానే ఉంటా

### ఢిల్లీ సిఎం రేఖాగుప్తా



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** దేశ రాజధాని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా.. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్రమంత్రి అమిత్‌షాలన కొనియాడారు. మోడీని ఆమె సాధువు మనస్తత్వంతో పోల్చారు. అమిత్‌షా మాదిరిగా తాను ఉండాలని కోరుకుంటున్నట్లు ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సిఎం వెల్లడించారు. ప్రధాని మోడీ సాధువు మనస్తత్వం కలవారుగా భావిస్తున్నా. సాధారణంగా కొందరు భగవంతుడి సేవకు తమ జీవితాన్ని అంకితం చేస్తారు. కానీ, దేశానికి సేవ చేసేందుకు ప్రధాని తన జీవితాన్ని అంకితం చేశారు. ఆయన బాటలో నడుస్తున్న వారు మా పార్టీలో చాలా మంది ఉన్నారు. వారితో కేంద్రమంత్రులు అమిత్‌షా, నితిన్‌గడ్కరీ కూడ ఉన్నారు' అని పేర్కొన్నారు. కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షా డేరింగ్ పర్సనాలిటీ. ఎంత క్లిష్ట పరిస్థితులనైనా ఆయన ఎదుర్కోగలరు. ఆ సమయంలో కఠిన నిర్ణయాలు తీసుకుని చివరి వరకు వాటిని పాటిస్తారు. సామర్థ్యం ఆయనకుంది. ఆయన మాదిరి నేను ఉండాలని కోరుకుంటున్నారు. దేశం పట్ల బిజెపి ఎంతో విధేయతతో ఉంటోంది.' అని కొనియాడారు.

# రావణ వాహనంపై ఆదిదంపతులు నగర విహారం

## - నేడు శ్రీ స్వామి అమ్మవార్ల దివ్య లీలా కళ్యాణోత్సవం - వైదికోక్తంగా చైత్రమాస బ్రహ్మోత్సవాలు

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త** ఆది దంపతులు రావణవాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కైలాసనాథునికి పరమభక్తుడైన రావణవాహన సేవను సాయం సంధ్యాకాలంలో నిర్వహించారు. ముందుగా శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్లను ప్రత్యేకపూజలనంతరం చూడముచ్చటగా సిద్ధం చేసిన రావణ వాహనంపై మంత్రయుక్తంగా వేంచేపు చేశారు. శ్రీ మల్లేశ్వర స్వామివార్ల మండపం నుండి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి అమ్మవార్లను రావణవాహనం ప్రారంభమై కనకదుర్గానగర్, రథం సెంటర్, బ్రాహ్మణవీధి, కొత్తపేట, సామారంగం చౌక్, మెయిన్‌బజార్ ల మీదుగా నిర్వహించారు. శ్రీ స్వామి అమ్మవార్లు నగర వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శ్రీ స్వామి అమ్మవార్ల రథంకు ముందుగా పలు రకాల తప్పెట్లు, కోలాటాలు, భజనలు, వివిధ రకాల వేషధారణలు సాగుతుండగా, మంగళవాయిద్యాల నడుమ, వేదమంత్ర ఘోషలతో సాగుతుండగా అడుగడుగునా భక్తులు టెంకాయలు, పసుపు, కుంకుమ, పూలమాలలు, హారతులతో శ్రీ స్వామి అమ్మవార్లకు మొక్కులు సమర్పించుకున్నారు. అనంతరం శ్రీ స్వామి అమ్మవార్లను తిరిగి శ్రీ మల్లేశ్వర మండపానికి తీసుకొచ్చి అక్కడ ప్రత్యేక పూజాదికాలు జరిపారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

నేడు నంది వాహన సేవ :

ఏప్రిల్ 11 శుక్రవారం నాడు శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్లునంది వాహనంపై నగర విహారం చేసి భక్తులను అనుగ్రహిస్తారని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇఒ కె రామచంద్ర మోహన్ తెలిపారు. అలాగే

12వ తేదీ సింహవాహన సేవ, 13వ తేదీ నదీ విహారము జరుగుతాయి.

- నేడు శ్రీ స్వామి అమ్మవార్ల దివ్య లీలా కళ్యాణోత్సవం:

ఏప్రిల్ 11 శుక్రవారం నాడు రాత్రి 10.30 గంటలకు శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దివ్య లీలా కళ్యాణోత్సవం ప్రారభమవుతుందని ఇఒ కె రామచంద్ర మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ పండితులు, కవులు సాయంత్రం 7 గంటలకు జరిగే శ్రీ స్వామి అమ్మవార్ల కళ్యాణానికి సంబంధించిన రాయభారం జరుపుతారని, ఈ సందర్భంగా వధూవరులయిన శ్రీ స్వామి అమ్మవార్ల వైభవాన్ని, వారి గొప్పదనాన్ని వివరిస్తారన్నారు. అనంతరం 10.30 గంటలకు శ్రీ స్వామి అమ్మవార్ల కళ్యాణం జరుగుతుందన్నారు. ఆర్జిత సేవగా నిర్వహించే శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దివ్య లీలా కళ్యాణోత్సవంలో పాల్గొనదలచిన ఉభయ దాతలు రు.1116 (దంపతులకు) చెల్లించి పాల్గొంటే శేషవస్త్రం, రవిక, శ్రీ అమ్మవారి చక్రపీఠం, 1పెద్దలడ్డు, ఇరువురికి ముఖమండప దర్శనము కల్పిస్తామన్నారు.



- దుర్గమ్మను దర్శించుకున్న శ్రీస్వామి నిరంజనానంద సరస్వతి :

దుర్గమ్మవారిని గురువారం ప్రసిద్ద స్వామి సత్యానంద యోగ ఆశ్రమం పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వామి నిరంజనానంద సరస్వతి దర్శనం చేసుకున్నారు. ఆయనకు ఇఒ కె రామచంద్ర మోహన్ ఆగమోక్తంగా స్వాగతం పలికారు.

అనంతరం దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.

- దుర్గమ్మను దర్శించుకున్న ఏపి ఎన్నికల కమీషనర్లు :

దుర్గమ్మవారిని గురువారం ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కమీషనర్స్ రాణి కుముదిని, నీలం సాహ్నీ దర్శనం చేసుకున్నారు. అనంతరం దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.

- శాశ్వత అన్నదానంకు విరాళం:

దుర్గమ్మవారి ఆలయంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన డి మాల్యాద్రి తమ కుటుంబీకులతో కలిసి రు.1లక్ష 1వెయ్యి,

116లను ను విరాళంగా గురువారం ఆలయాధికారులకు అందించారు.

దాతకు వారి కుటుంబసభ్యులకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.

# తిరుమల సమాచారం

## వేసవితాపంలో వసంతోత్సవం

### మలయప్పకు ఉపశమనోత్సవం

**తిరుమల,ఏప్రిల్ 10ప్రభాతవార్తప్రతినిధి:** వసంతరుతువులో ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు వేసవితాపం నుండి ఉపశమనం కోసం వసంతోత్సవాలు మొదలయ్యాయి. మూడురోజులు జరిగే ఈ వసంతోత్సవాల్లో తొలిరోజు గురువారం ఉదయం నిత్య కైంకర్యాలు ముగిసిన తరువాత శ్రీదేవిభూదేవిమలయప్పస్వామిని మంగళ వాయిద్యాల నడుమ ఆలయానికి పడమరవైపు ఉన్న వసంతమండపానికి ఊరేగింపుగా తీసుకెళ్ళారు. అక్కడ మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు శ్రీభూసమేత మలయప్పకు స్నపనతిరుమంజనం శోభాయమానంగా జరిగింది. అంతకుముందు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, నవకలశాభిషేకం, రాజోపచారం నిర్వహించారు. అనంతరం ఛత్రచామర వ్యజన దర్పణాది నైవేద్యం,ముఖప్రక్షాళన, దూపదీపనైవేద్యం చేపట్టారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా పాలు,పెరుగు, తేనె, కొబ్బరినీరు, పసుపు, గంధంతో శంఖధార, చక్రధార, సహస్రధార, మహాకుంభాభిషేకాలను ఆగమోక్తంగా స్నపనం జరిపించారు. ఉత్సవర్ల అభిషేకసమయంలో తైత్తరీయ ఉపనిషత్తు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, పంచశాంతిమంత్రాలు,దివ్యప్రబంధంలోని అనుసంధానం చేసే పాశురాలను పఠించారు.ఈ వేడుకలో ఒక్కో క్రతువులో ఒక్కో రకమైన ఉత్తమజాతి పుష్పమాలలను స్వామి,అమ్మవార్లకు అలంకరింపజేశారు. సాయంత్రం వసంతమండపం నుండి బయలుదేరి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు.ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి, ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు. వసంతోత్సవాల్లో రెండవరోజు నేటి ఉదయం 8గంటల నుండి 10గంటల వరకు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి స్వర్ణరథంపై ఊరేగుతారు.



## ప్రకృతి పరవశంతో వసంతమండపం శోభాయమానం

**తిరుమల,ఏప్రిల్ 10ప్రభాతవార్తప్రతినిధి:** వేసవితాపం నుండి ఉపశమనోత్సవం జరిపించేందుకు సిద్ధమైన వసంత మండపాన్ని టిటిడి ఉద్యానవనవిభాగం సహజప్రకృతిసిద్ధమైన వనంగా తీర్చిదిద్దారు.మండపాన్ని పలు రకాల వివిధ జాతి పండ్లు, పుష్పాలు, వన్యప్రాణుల చిహ్నాలు, వట్టివేర్లుతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. శేషాచలంకొండల్లోని సప్తగిరుల్లో మూడురోజుల వసంతోత్సవాలకు ఈ మండపాన్ని వివిధ రకాల పండ్లు, కోతులు, నెమళ్ళు, చిరుతలు, జింకలు, బాతులు, కొంగలు, సుగంధపుష్పాలతో అందంగా ముస్తాబుచేశారు. భక్తులను విశేషంగా ఆకట్టుకొంటోంది.



## 18న థియేటర్లలోకి 'సన్నాఫ్ వైజయంతి'

### - చిత్రం విజయవంతం కావాలని వేడుకున్నాం
### - సినీనటులు విజయశాంతి, కల్యాణ్‌రామ్

**తిరుమల,ఏప్రిల్ 10ప్రభాతవార్తప్రతినిధి:** నందమూరి కల్యాణ్‌రామ్ నటుడుగా, సీనియర్ సినీనటి రాములమ్మ విజయశాంతి కీలకపాత్రలో నటించిన "సన్నాఫ్ వైజయంతి"చిత్రం ఈనెల 18వతేదీ థియేటర్లలోకి వస్తుందని తెలిపారు. ఈ చిత్రంలో వీరిద్దరూ తల్లికొడుకుగా కనిపించనున్నారు. సాయిమంజ్రేకర్ సినీనటిగా, కొత్తదర్శకుడు ప్రదీప్‌చిలుకూరి దర్శకత్వంలో ఈ చిత్రం తాజాగా రెండవ పాటను విడుదల చేశారు.గురువారం ఉదయం సినీనటి విజయశాంతి, నటుడు కల్యాణ్‌రామ్ తిరుమలకు చేరుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి వెళ్ళి ఆనందనిలయంలోని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.ఆశీస్సులందుకుని కానుకలు సమర్పించారు. టిటిడి ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపలకు వచ్చిన విజయశాంతిని,కల్యాణ్‌రామ్‌ను చూడటానికి అభిమానులు ఉత్సాహం చూపారు. 18న ప్రేక్షకుల ముందుకు చిత్రం వస్తుందని, ఈ సందర్భంగా చిత్రం విజయవంతం కావాలని శ్రీవారిని కోరుకున్నామన్నారు.కాగా రాజకీయాల్లోకి వచ్చిన తరువాత చాలాకాలం అనంతరం మళ్లీ విజయశాంతి మళ్ళీ సినిమాలో కనిపిస్తోంది.



## సూళ్లూరుపేట పోలీసుల కేసు - పోసానికి ఊరట

### తదుపరి చర్యలు తీసుకోవద్దన్న హైకోర్టు ఆదేశాలు
### - విచారణ అధికారిపై హైకోర్టు సీరియస్

**విజయవాడ,ఏప్రిల్10,ప్రభాతవార్తప్రతినిధి:** సినీ నటుడు పోసాని కృష్ణమురళికి ఏపీ హైకోర్టులో ఊరట లభించింది. పోసానిపై సూళ్లూరుపేట పోలీసులు కేసు నమోదు చేసారు. ఈ క్రమంలో హైకోర్టులో పోసాని క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ ను విచారించిన హైకోర్టు పోసానిపై తదుపరి చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. కేసులో అదనంగా 111 సెక్షన్ తో పాటు మహిళను అసభ్యంగా చిత్రీకరించారంటూ సెక్షన్లు నమోదు చేయడంపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ ఆదేశాలను పట్టించుకోకుండా వ్యవహరించారంటూ విచారణ అధికారి మురళీకృష్ణపై సీరియస్ అయింది. ఈ సెక్షన్లు ఎలా వర్తిస్తాయని ప్రశ్నించింది. మురళీకృష్ణకు ఫామ్ 1 నోటీసు జారీ చేసింది. రిప్లై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 24వ తేదీకి వాయిదా వేసింది.

# అభివృద్ధి పనులలో అక్రమాలపై విజిలెన్స్ అధికారుల విచారణ

### నాలుగు బృందాలుగా ఏర్పడిన అధికారులు - దాదాపు నెల రోజుల పాటు కొనసాగనున్న విచారణ - మొదటి రోజు నాలుగు చోట్ల సాగిన దర్యాప్తు

**పులివెందుల,ఏప్రిల్10, ప్రభాత వార్త:** పులివెందులకు చెందిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల నియోజకవర్గంలో పాడా సంస్థ ద్వారా పులివెందుల ఏరియా డెవలప్మెంట్ అథారిటి చేపట్టిన సుమారు 1200 కోట్ల రూపాయల అక్రమాలను వెలికి తీసేందుకు, నిగ్గు తేల్చేందుకు అభివృద్ధి పనుల పేరుతో జరిగిన దోపిడీని తేల్చేందుకు విచారణకు విజిలెన్స్ బృందం గురువారం పులివెందులలో పర్యటించింది.దాదాపుగా 1200 కోట్ల రూపాయల అభివృద్ధి పనులను పులివెందులలో చేపట్టారు. ఈ పనుల వ్యవహారంలో తీవ్ర అవకతవకలు, భారీ స్థాయిలో అక్రమాలు అవినీతి చోటుచేసుకున్నాయని ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి లు ఫిర్యాదు చేయడంతో ఈ విచారణ చేపట్టినట్లు సమాచారం. గత ముఖ్యమంత్రి ఎంతో సదుద్దేశంతో 1200 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేస్తే అధికారులు తమకు నచ్చిన విధంగా, తోచిన విధంగా భారీ ఎత్తున మామూలులు తీసుకొని పనులను చేపట్టడం విశేషం. ప్రధానంగా పులివెందులలో గరండాల్ వంక ప్రాంతంలో ఎటువంటి ప్రణాళికలు లేకుండా చేపట్టిన అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ఈ పనుల విషయంలో పులివెందుల ప్రజలు తీవ్ర ఆగ్రహాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సొమ్మంతా దాదాపు 100 కోట్ల రూపాయలు వంకలో పోశారని దుమ్మెత్తి పోస్తున్నారు. అలాగే పులివెందుల పట్టణంలో నడిబొడ్డులో బోలే వార్డు రహదారి, రింగురోడ్డు సుందరీకరణ పనులు, ఉల్లిమెల్ల చెరువు లేక్ వ్యూ పనులు, ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం, సెక్రటేరియట్ నిర్మాణం, వేంపల్లిలో రహదారుల నిర్మాణానికి 35 కోట్ల రూపాయల నిధులు, తాగునీరు, రోడ్లు, సిసి రోడ్లు ఇతర అభివృద్ధి పనుల పూర్తికి ఈ 1200 కోట్ల రూపాయలు వెచ్చించాల్సి ఉంది.కానీ అధికారుల అలసత్వం భారీ ఎత్తున ముడుపులు ఇచ్చి ఇస్టాను సారం నిధులు వృథం అయ్యాయి. విజయవాడ కు చెందిన విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారి ఆధ్వర్యంలో విజయవాడ తిరుపతి, కర్నూలు తదితర జిల్లాల నుంచి అధికారులను విచారణకు నియమించారు.



సిసి రోడ్లను పరిశీలిస్తున్న విచారణ అధికారులు

ఏవో రామాంజనేయులు, ఏజీ సిద్దయ్య, ఏఈ లు ఆనంద్, వెంకట రమణ ,కిషోర్, అశోక్ మరియు సిఐ లు శివయ్య,నారాయణ తదితరులు విచారణ అధికారులుగా ఉన్నారు.విచారణ అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి విచారణ ను చేపట్టారు.మొదటి రోజు అన్ని పనుల యొక్క దస్త్రాలను స్వాధీనం చేసుకోవడానికి సమయం పట్టింది. అనంతరం పులివెందుల పరిధిలోని సీబీఆర్ డ్యాం పరిధిలో జరిగిన పనులను , సింహాద్రిపురం మండలం భాను గుట్ట నందు ఆర్డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను, పులివెందుల ప్రాంతంలో జరిగిన ఇరిగేషన్ పనులను, పులివెందుల పట్టణ పరిధిలో చేపట్టిన సీసీ రోడ్ల పనులను పరిశీలించి నివేదికలు తయారు చేశారు.

మొత్తం 1200 కోట్ల రూపాయల పనులను విచారణ పూర్తి చేయడానికి అధికారులకు ఈ నెల అంతా సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. ఆడ కింద చేపట్టిన ప్రతి పనుల యొక్క శాంపిల్స్ ను అలాగే నాణ్యతను పరిశీలించారు. నేడు కూడా విచారణ కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## నగరంలో యువకుడి దారుణ హత్య

**నెల్లూరు క్రైమ్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** చిన్నపాటి ఘర్షణ చివరికి ఒక యువకుడి ప్రాణాన్ని తీసుకుంది. వివరాల్లోకి వెళితే... ప్రకాశం జిల్లా కు చెందిన వాసు (28) గత కొన్ని ఏళ్లుగా స్థానిక పొదలకూరు ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. ఇతనికి స్థానికంగా ఉన్న కొంతమందితో వివాదం ఉంది. ఈ క్రమంలో బుధవారం ఇదే ప్రాంతానికి చెందిన ఒక యువకుడు పై దాడి చేసి గాయపరిచాడు. దీంతో సదరు యువకుడు తన స్నేహితులైన మణికంఠ, లోకేష్, వినయ్‌లకు తెలిపాడు. అప్పటికే వాసు పై కక్షగట్టిన సదరు యువకులు బుధవారం రాత్రి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న వాసుని బలవంతంగా తీసుకెళ్లి ప్రగతి నగర్ ఏ బ్లాక్ వద్ద చెరువు సమీపంలో దారుణంగా హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని అక్కడే ఉన్న చెత్తకుప్పలో వేసి పైన చెత్త కప్పారు. గురువారం తెల్లవారుజామున స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హత్య విషయం వెలుగు చూసింది. వెంటనే సంఘటన స్థలాన్ని చేరుకున్న దర్గామిట్ట పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## ఉపాధి నిధులు దుర్వినియోగం

### - పశు నీటి తొట్టె ప్రక్కనే మరో నీటి తొట్టి నిర్మాణం మంజూరు

**పాలసముద్రం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** పాలసముద్రం మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులు దుర్వినియోగం అవుతున్నాయి. మండలంలోని కృష్ణజిమ్మాపురం బస్‌స్టాప్ సమీపంలో గతంలో నిర్మించిన పశు నీటి తొట్టె ఆవరణలోనే మరొక కొత్త పశు నీటి తొట్టె నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం మండలంలో ఉపాధి నిధులు దుర్వినియోగం అవుతున్నాయనడానికి ప్రత్యక్ష సాక్ష్యం. వేసవి కాలంలో పశువుల దాహార్తి తీర్చడానికి అనువైన ప్రదేశాల్లో ఉపాధి నిధుల కింద పశు తొట్టెలు నిర్మించడానికి అనుమతి వుంది. ఈ క్రమంలో కృష్ణజిమ్మాపురం బస్టాప్ సమీపంలో గతంలో ఉపాధి నిధుల కింద ఒక పశు తొట్టెను నిర్మించారు. ప్రస్తుతం ఈ పశు నీటి తొట్టి నిరుపయోగంగా వుంది. ఈ పరిస్థితుల్లో మళ్ళీ వేసవి కాలం రావడంతో ఇక్కడే మరొక పశు తొట్టి నిర్మించాలని కూటమి ప్రభుత్వ నేతలు పక్కాగా ప్రణాళిక రచించి పనులు మంజూరు చేయించుకున్నారు. మండల అధికారులు సైతం ఉపాధి నిధులతో ఎక్కడ పశు తొట్టెలు నిర్మిస్తే పశువులకు ఉపయోగంగా వుంటుందనేది పరిశీలన చేయకుండా ఇక్కడ తొట్టె నిర్మాణంను మంజూరు చేశారు. ఈ మేరకు భూమి పూజ నిర్వహించి పశు తొట్టె నిర్మాణ పనులు చేపట్టడంతో ఉపాధి నిధులు దుర్వినియోగం అయినప్పటికీ ఎదో ఒక పని చేసినట్లు వుంటుందని భావించి అవసరం లేకపోయినా అక్కడ తొట్టె నిర్మాణ పనులను నాయకులు ప్రారంభించినట్లు తెలిసింది.

ఇప్పటికైనా అధికారులు పరిశీలించి పశువుల దాహార్తి తీర్చడానికి అవసరమైన చోట్ల నీటి తొట్టెలు మంజూరు చేసి అవసరమైన ప్రదేశాల్లో మంజూరు చేసిన నీటి తొట్టెలను రద్దు చేయాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

## హోమియోపతి ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యంలో ఉన్న వైద్యవిధానం

### వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** హోమియోపతి అనేది ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యంలో ఉన్న ఒక వైద్యవిధానమని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఏప్రిల్ 10 ప్రపంచ హోమి యోపతి దినోత్సవం సందర్భంగా మంత్రి దామోదర శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి యేట ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా హోమియోపతి పితామహుడు డాక్టర్ క్రిస్టియన్ ఫ్రెడ్రిక్ సామ్యేల్ హానెమన్ జయంతిని పురస్కరించుకొని ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ప్రపంచ హోమియోపతి దినోత్సవం-2025 థీమ్ ఆరోగ్యకర భవిష్యత్తు కోసం- సహజ, సురక్షితం, సమర్ధవంతమైనది అనే నినాదంతో హోమియోపతి వైద్యం ప్రాముఖ్యత, సూత్రాలు, ప్రయోజనాల గురించి ప్రజలకు అవగా హన కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం ఆయుష్ డిపార్ట్మెంట్‌ను మరింత బలోపేతం చేస్తున్నామని మంత్రి గుర్తు చేశారు. తెలియజేశారు.

## వరకట్నం కోసం భార్యను చంపిన భర్త

**విడవలూరు (నెల్లూరు), ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** వరకట్నం కోసం భార్యను చంపిన భర్త ఈ ఘటన విడవలూరు మండలం ఊటుకూరు పెద్దపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులకు వివరాలు ఇలా ఉన్నాయి అల్లూరు మండలం తాడిచెట్లపాలెం గ్రామానికి చెందిన సుగుణ 2001 సంవత్సరంలో పెద్దపాలెం గ్రామానికి చెందిన హరికృష్ణతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి వరకట్నం వేధింపులలో సుగుణ(24) మృతి చెందింది. సంఘటన స్థలాన్ని డి.ఎస్.పి శ్రీనివాసరావు, తహసిల్దార్ చంద్రశేఖర్ పర్యవేక్షించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై పి. నరేష్ తెలిపారు.

## గిరిజన విద్యార్థుల స్కాలర్షిప్ కోసం కృషి చేస్తా

### - కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖామంత్రి జువల్ ఓరం

**తిరుపతి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** జాతీయ సంస్కృత వర్సిటీలో విద్య నభ్యసిస్తున్న విద్యార్థులకు స్కాలర్షిప్ ఇచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖామంత్రి జువల్ ఓరం తెలిపారు.గురువారం ఆయన తిరుపతి జాతీయ సంస్కృత వర్సిటీలో పర్యటించి అధికారులతోనూ, గిరిజన విద్యార్థులతోనూ సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంస్కృత భాష వ్యాప్తికి వర్సిటీ అధికారులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.వర్సిటీ పరిశోధనలలోనూ, విద్యాభివృద్ధిలోనూ అగ్రస్థానంలో కొనసాగుతుండటం ప్రశంసనీయమన్నారు. కఠోర శ్రమతో విద్యనభ్యసించి భారతీ సంస్కృతిని కాపాడాల్సిన భాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. అనంతరం ఆయన వర్సిటీలోని శ్రీ జగన్నాథ ఆలయాన్ని సందర్శించి దేశ శ్రేయస్సుకోసం ప్రార్థనలు చేశారు.

ఈ సందర్భంగా వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఒడిశా చైర్ డైరెక్టర్ డాక్టర్ జ్ఞానరంజన్ పాండా, అధ్యాపకులు,అధికారులు పాల్గొన్నారు.

## అక్రమడబ్బుతో యూట్యూబ్ ఛానళ్లకు బిఆర్ఎస్ పోషణ

**హైదరబాద్, ఏప్రిల్ 10,ప్రభాతవార్త:** బిఆర్ఎస్ అక్ర మ డబ్బుతో యూట్యూబ్ ఛానల్స్‌ను పెంచి పోషి స్తోందని జర్నలిజం ముసుగులో అబద్దాలు చెపుతామంటే ఊర్కోమని ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ హెచ్చరించారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ జర్న లిస్టులు ప్రభుత్వాన్ని తిట్టినా విమర్శించినా పర్వా లేదు.

## లబ్ధిదారుల ఇంట ప్రజాప్రతినిధులు భోజనం చేయాలి

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** ప్రజా ప్రతినిధులు సన్నబియ్యం లబ్దిదారుల ఇంట్లో ఒకరోజు భోజనం చేయాలని ఉంటుందని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్‌లో గురు వారం జల సౌధలో విడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ సన్న బియ్యం విషయంలో ప్రతిపక్షాల ఆరోప ణలను అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సమర్థ వంతంగా తిప్పికొట్టాలని అన్నారు.గతంలో సంవ త్సరానికి 24 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేశామని ఆయన గుర్తుచేసుకున్నారు. ఇప్పుడు 30 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని అన్నారు.ప్రస్తుతం సంవత్సరంకు 13600కోట్లు ఖర్చు చేస్తున్నామని ఉత్తమ్ గణాంకాలతో వివరించారు. గతంలో 10, 665కోట్లు మాత్రమే ఖర్చు చేసేది.గతంలో 2.81 లక్షల రేషన్ కార్డులు ఉంటే ఇప్పుడు 3.10 లక్షల మందికి రేషన్ కార్డు లబ్ధిదారులు ఉన్నారని అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 29 లక్షల రేషన్ కార్డులు పెరిగాయని తెలిపారు.సన్నబియ్యం కేంద్రం ఇస్తుందన్న దాంట్లో వాస్తవం లేదని ఆయన చెప్పారు.కేంద్రం ఇచ్చే బియ్యానికి 20శాతం ఎక్కువ రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందని ఆయన వివరించారు. కేంద్రం ఇచ్చేది మొత్తం దొడ్డు రకమే అని ఆయన తెలిపారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడినపుడు 90 లక్షల రేషన్ కార్డులు ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి కేవలం 49 వేల కార్డులే ఎక్కువ ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు 30 లక్షల మందికి రేషన్ కార్డులు ఇస్తున్నామని రేషన్‌కార్డులు జారీ నిరంతర ప్రక్రియ అని ఆయన తెలిపారు.ప్రజాపాలనలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు కలెక్టర్లు పరిశీలిస్తున్నార ప్రతీ అర్హునికి రేషన్ కార్డును అందిస్తామని అన్నారు.

## కుటుంబ కలహాలతో అక్కను హత్య చేసిన సోదరుడు

**హైదరాబాద్ (మలక్‌పేట), ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** కుటుంబకలహాలతో సోదరుడు సొంత అక్కను కత్తితో పొడిచి హత్య చేసిన సంఘటన చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఓల్డ్ మలక్‌పేట్‌లోని వెంకటరమణ అపార్టుమెంట్స్‌లో అనసూయ (90) తన ఇద్దరూ కుమారులు సుదర్శన్ (70) మదన్‌రావు (63) కూతురు లక్ష్మి (68) తదితరులతో కలిసి నివసిస్తున్నది. తండ్రి రిటైర్డ్ ఆర్మీఅధికారి, రెండేళ్ల క్రితం మరణించారు. కాగా బుధవారం రాత్రి మదన్‌రావు తాగి ఇంటికి వచ్చి తల్లిని డబ్బులు అడగగా అక్క లక్ష్మి, అన్న సుదర్శన్ ఇద్దరు కలిసి తల్లిని డబ్బులు అడగవద్దని వారించారు. దీంతో ఆగ్రహాన్ని గురైన మదన్‌రావు వంటగదిలోని కత్తితో అక్క లక్ష్మిని పొడిచి హత్య చేశాడు. సంఘటనను అడ్డుకోబోయిన అన్న సుదర్శన్‌కు కూడా గాయాలు అయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యు లు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన ప్రాంతానికి విచ్చేసిన పోలీసులు నిందితుడు మదన్‌రావు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు. కుటుంబ సభ్యులలో ఎవరికి వివాహం కాకపోవడంతోపాటు కుటుంబకలహాల నేపథ్యంలో గొడ వలు జరిగి హత్య జరిగి ఉండవచ్చునని భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో కూడా అన్నపై దాడిచేసి గాయపరచడంతో మదన్‌రావుపై కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

# కంచ గచ్చిబౌలి భూములను పరిశీలించిన సుప్రీంకోర్టు సిఇసి కమిటీ

## ఎంసిహెచ్ఆర్‌డిలో విద్యార్థులు, జెఎసి ప్రతినిధులతో కమిటీ సమావేశం



కంచ గచ్చిబౌలి భూములను పరిశీలిస్తున్న సిఇసి కమిటీ

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** గచ్చిబౌలిలోని కంచ గచ్చిబౌలి భూములను గురువారం సుప్రీంకోర్టు నియమించిన సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ(సిఈసి) పరిశీలించింది. పలు విభాగాలకు చెందిన అధికారులు, సైబరాబాద్ పోలీస్ కమీషనర్ అవినాష్ మహంతి, మాదాపూర్ డిసిపి వినీత్‌లతో కలిసి కమిటీ సభ్యులు కంచ గచ్చిబౌలి భూములను సందర్శించారు. ఈ సందర్భంగా వివాదానికి కేంద్రమైన 400 ఎకరాల భూముల స్థితిగతులు, అక్కడ ఉన్న పర్యావరణం, అటవీ సంపద, జంతువుల వివరాలను సేకరించారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూముల వేలానికి తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం వివాదస్పదంగా మారిన విషయం తెలిసిందే. కంచ గచ్చిబౌలిలోని సర్వే నెంబరు 25లో గల 400 ఎకరాల భూములు ప్రభుత్వానివని రాష్ట్ర ప్రభుత్వం, యూనివర్సిటీ భూములంటూ వర్సిటీ వర్గాలు ముందుకు రావడం వివాదస్పదంగా మారింది. ఓ వైపు యూనివర్సిటీ భూముల రక్షణ కోసం విద్యార్థులు ఆందోళన బాటపట్టగా, అదే సమయంలో సదరు భూముల్లో ఉన్న చెట్లను తొలగిస్తూ భారీ ఎత్తున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పనులు చేపట్టడం సంచలనంగా మారింది.

దీంతో పనులను అడ్డుకుంటూ విద్యార్థులు ఆందోళన చేపట్టగా, పోలీసులు పలువురు విద్యార్థుల మీద కేసులు నమోదు చేయడంతో పాటు అరెస్టులు చేశారు. విద్యార్థుల అరెస్టుతో ఒక్కసారిగా భగ్గుమన్న సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు, టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు కలిసి జెఏసిగా ఏర్పడి ఆందోళనను ఉదృతం చేశారు. వీరి ఆందోళనలకు రాజకీయ వర్గాల నుంచి మద్దతు రావడంతో ఈ వివాదం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దీంతో పాటు 400 ఎకరాల భూమిలో ఉన్న పర్యావరణాన్ని దెబ్బతీస్తూ భారీ ఎత్తున రాష్ట్ర ప్రభుత్వం చెట్లను తొలగిస్తుందని, సదరు భూమిలో ఉన్న వన్యప్రాణుల ఉనికి దెబ్బతింటుందంటూ విద్యార్థులు విడుదల చేసిన వీడియోలు, ఫోటోలతో పర్యావరణవేత్తలు, పలు సంఘాలు ఆందోళన చెందాయి. దీంతో ఈ వివాదంపై సూమోటోగా స్పందించిన సుప్రీంకోర్టు 400 ఎకరాల భూమిపై స్టే విధించింది.

సుప్రీంకోర్టు తదుపరి ఉత్తర్వులు విడుదలయ్యే వరకు సదరు భూముల్లో ఎటువంటి పనులు చేపట్టవద్దని, యథాతథ స్థితిని కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. వివాదస్పద భూముల్లో పరిస్థితిపై నివేదిక అందించేందుకు సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ(సిఈసి)ని సుప్రీంకోర్టు నియమించింది. దీంతో పలు విభాగాల అధికారులతో కలిసి సిఈసి కమిటీ గురువారం కంచ గచ్చిబౌలి భూములను సందర్శించారు. ఉదయం 10.30 గంటల ప్రాంతంలో వర్సిటీకి చేరుకున్న సిఈసి కమిటీ కంచ గచ్చిబౌలిలోని భూములను సందర్శించి అందులో ఉన్న పర్యావరణం, ప్రభుత్వం చేపట్టిన పనులు, అటవీ సంపదపై వివరాలు సేకరించారు. కాగా కంచ గచ్చిబౌలి భూముల సందర్శనకు వచ్చిన సిఈసి కమిటీని కలిసేందుకు వర్సిటీ విద్యార్థులకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో పలువురు విద్యార్థులు అసహనం వ్యక్తం చేశారు.

**ఎంసిహెచ్ఆర్‌డిలో సమావేశం..**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్టూడెంట్ యూనియన్, జెఏసి ప్రతినిధులు, టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం జూబ్లిహిల్స్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సుప్రీంకోర్టు సిఈసి కమిటీతో సమావేశమయ్యారు. మొదట కంచ గచ్చిబౌలి భూముల పరిశీలన సమయంలో కమిటీని కలిసేందుకు విద్యార్థులు ప్రయత్నించగా, పోలీసులు అనుమతించ లేదు. అనంతరం ప్రతినిధులను ఎంసిహెచ్ఆర్‌డికి పిలువడంతో వారు కమిటీని కలిసి తమ డిమాండ్లను వివరించారు. కంచ గచ్చిబౌలి భూముల్లో ఉన్న పరిస్థితిని కమిటీకి వివరించడంతో పాటు ప్రభుత్వం చేసిన పనులు, ధ్వంసం చేసిన పర్యావరణాన్ని ఆధారాలతో కమిటీకి అందజేసినట్లు స్టూడెంట్ యూనియన్ సభ్యులు తెలిపారు.



శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న విసి ప్రొ.కుమార్ మొలగరం

# మహనీయులు నడిచిన మార్గం నేటి తరానికి ఆదర్శం

### శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్

### ఘనంగా ప్రారంభమైన మహనీయుల జయంత్యుత్సవాలు

**హైదరాబాద్ (తార్నాక), ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మహనీయుల జయంత్యుత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో శాసనసభాపతి గడ్డం ప్రసాదకుమార్ ప్రారంభించారు. మహాత్మా జ్యోతిబాఫూలే, జగ్జీవన్ రామ్, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌ల జీవితం, వారు నడిచిన మార్గం నేటి తరానికి ఆదర్శమన్నారు. విద్య, మహిళాసాధికారత కోసం చేసిన కృషిని కొనియాడారు. వారు చూపించిన మార్గం.. సమాజంలో ఉన్న కఠినస్థితిగతులు, వివక్షలు, అసమానతలను తొలగించేందుకు ఎంతగానో సహాయపడ్డాయని గుర్తు చేశారు. పేద, బలహీన వర్గాల విద్యార్థుల సంక్షేమం దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వం లోని ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని... ఇటీవలే విద్యార్థుల మెస్ ఛార్జీలు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల భర్తీ కోసం ఇటీవలే ప్రభుత్వ నియమావళి విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మహనీయులు జయంతి ఉత్సవాలకు కృషి చేస్తున్న ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం చొరవను అభినందించారు. గౌరవ అతిథిగా హాజరైన రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ డాక్టర్ రియాజ్.. తన ప్రసంగం ద్వారా విద్యార్థులను ఉత్తేజ పరిచారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ చరిత్ర, ప్రతిష్ట, ప్రపంచ, జాతీయ స్థాయి గుర్తింపును ఈ సందర్భంగా ప్రొఫెసర్ కుమార్ వివరించారు.

# శాంతి చర్చలకు మేము సిద్ధం

### మావోయిస్టు పార్టీ ప్రకటన

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** శాంతి చర్చల కోసం తాము సిద్ధంగా వున్నామని మావోయిస్టు పార్టీ ప్రకటించింది. ఈ మేరకు ఉత్తర బస్తర్, పశ్చిమ సబ్ జో నల్ బ్యూరో గురువారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేసింది. శాంతి చర్చలకు తాము సిద్ధంగా వున్నామని, అయితే ఇందుకోసం అనుకూల వాతావరణం ఏర్పా టవడం తప్పనిసరి అని పార్టీ పేర్కొంది. ఇందులో భాగంగా మొదట బస్తర్‌లో జరుగుతున్న మారణకాండను ఆపాలని కోరింది. తమ డిమాండ్‌ను కేంద్రంతో పాటు ఛత్తీస్‌గఢ్ సర్కారు తోసిపుచ్చడం సరైంది కాదని మావోయిస్టు పార్టీ ఉత్తర బస్తర్, పశ్చిమ సబ్ జో నల్ బ్యూరో అధికార ప్రతినిధి రూపేష్ తెలిపారు.



నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, ఎమ్మెల్సీ కోదండరామ్, నైనాల గోవర్ధన్, ప్రతాప్ తదితరులు

# మేడిగడ్డ మరమ్మతు వద్దు.. ప్రాణహిత చేవెళ్ల నిర్మాణమే ముద్దు

### నీటిపారుదలశాఖ మంత్రికి ఎమ్మెల్యే హరీశ్‌బాబు, ఎమ్మెల్సీ కోదండరాం వినతి

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లోని బ్యారేజిల మరమ్మతు కోసం నిధులు దుర్వినియోగం చేయొద్దని మేడిగడ్డ ఒక బ్లాక్ పునర్నిర్మాణం చేస్తే మరో బ్లాక్ కుంగిపోదనే ధీమా లేదని తుమ్మిడిహట్టి వద్ద ప్రాణాహిత చేవెళ్ళప్రాజెక్టు నిర్మాణమే శ్రేయస్కరం అని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, ఎమ్మెల్సీ కోదండరామ్,తెలంగాణ జలసాధన సమితి కన్వీనర్ నైనాలగోవర్ధన్ ప్రాణహిత పరిరక్షణ వేదిక కన్వీనర్ కెవి ప్రతాప్ అన్నారు. జలసౌధలో నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి సుదీర్ఘమైన వినతి పత్రం ఇచ్చి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో శంకుస్థాపనచేసి పెండింగ్‌లో పెట్టిన ప్రాజెక్టులను వెంటనే పూర్తిచేయాలని కోరారు. తుమ్మిడిహట్టి ,కుప్టి ప్రాజెక్టులు వెంటనే నిర్మించాలని కోరారు. 2008లో ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రాణహిత బ్యారేజి కోసం శంకుస్థాపన చేసి ప్రాణహిత నుంచి ఎల్లంపల్లి వరకు 116కి.మి కాలువ తవ్వకానికి 1700కోట్లరూపాయలు వ్యయంచేశారని గుర్తుచేశారు. ప్రాణహిత ప్రాజెక్టును కేంద్రం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి పోలవరంకు నిధులు ఇచ్చినట్లు ఇవ్వాలని దీని కోసం తెలంగాణ ప్రభుత్వం తోపాటు కాంగ్రెస్‌పార్టీపెద్దలు కూడాచొరవ తీసుకోవాలని కోరారు. జవహర్‌లాల్‌నెహ్రూ (1950)నుంచి ప్రాణహిత ప్రాజెక్టు ప్రతిపాదన ఉందని జలగం వెంగళరావు నుంచి అనేక ముఖ్యమంత్రులు ప్రాజెక్టు నిర్మాణం కోసం చొరవచూపారని గుర్తుచేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 23లక్షల ఎకరాల సాగుభూమి ఉండగా మూడున్నర లక్షల ఎకరాలు కూడా నీటి వసతి లేదని వారు ఆవేదన వ్యక్తంచేశారు. న్యూసదర్‌మాట్, కొమురంభీం, జగన్నాథపూర్,గొల్లవాగు, నీల్వాయి,ఎస్సారెస్పీ ఉత్తరం కాలువ,కడెం మందాకిని కాలువ తవ్వకం చేసి చెన్నూరు,బెల్లంపల్లి ,మంచిర్యాల ప్రాంతంకు నీరు అందించాలని నాలుగు దశాబ్దాలుగా ఈ ప్రతిపాదనలు అమలు చేయలేదని బిఆర్ఎస్‌పాలకులు నిర్లక్ష్యంచేశారని వారు ఆరోపించారు.

# శ్రీచైతన్య విద్యాసంస్థల బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రపంచ చెస్ ఛాంపియన్ గుకేష్ దొమ్మరాజు

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** ఆసియాలో అతిపెద్ద విద్యా సంస్థలలో ఒకటైన శ్రీచైతన్య ఎడ్యుకేషనల్ గ్రూప్, భారతీయ చెస్ గ్రాండ్ మాస్టర్,




ప్రపంచ చెస్ ఛాంపియన్ అయిన గుకేష్ దొమ్మరాజును తన బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. ఈ భాగస్వామ్యం దేశవ్యాప్తంగా జేఈఈ, నీట్ ఛాంపియన్లను అత్యధికంగా అందించే లక్ష్యంతో శ్రీచైతన్య, ఇన్ఫినిటీ లెర్న్ ఈ నిర్ణయం తీసుకున్నాయి. అతిచిన్న వయస్సులో ప్రపంచ చెస్ ఛాంపియన్ గా గుర్తింపు పొందిన గుకేష్ జేఈఈ, నీట్ అభ్యర్థులతో సుస్థిరమైన స్ఫూర్తిని కలిగించే భావాలను నింపగలడు. జేఈఈ, నీట్ అభ్యర్థులకు మెంటర్‌గా మారి, విజయం సాధించేందుకు కావలసిన వ్యూహాలతోపాటు ఒత్తిడి నిర్వహణ పద్ధతులపై మార్గదర్శకుడిగా ఉంటాడు. ఈ ప్రకటనపై ఇన్ఫినిటీ లెర్న్ సహ వ్యవస్థాపకురాలు, శ్రీచైతన్య గ్రూప్ సీఈవో, డైరెక్టర్ సుష్మ బొప్పన మాట్లాడుతూ.. ప్రపంచ చెస్ ఛాంపియన్ గుకేష్ దొమ్మరాజును శ్రీచైతన్య బ్రాండ్ అంబాసిడర్ స్వాగతిస్తున్నందుకు మేము సంతోషిస్తున్నాము.. చిన్న వయస్సులోనే ఆయన సాధించిన అసాధారణ విజయాలు పాఠశాల విద్యార్థుల నుండి జేఈఈ, నీట్ అభ్యర్థుల వరకు ప్రేరణగా నిలిచాయి. శ్రీచైతన్యలో, మేము విద్యార్థులను సమస్య పరిష్కారం, విశ్లేషణాత్మక నైపుణ్యాలతో అభివృద్ధి చేసేందుకు అంకితభావంతో ఉన్నాము. గుకేష్ సామర్థ్యాలు, సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కొనేందుకు, ఒత్తిడి పరిస్థితుల్లో ప్రశాంతంగా ఉండటానికి అవసరమైన నైపుణ్యాలతో పోటీ పరీక్షలలో విజయాన్ని సాధించడంలో విద్యార్థులకు మార్గదర్శకంగా ఉంటాయి. గుకేష్ ప్రేరణతో, శ్రీచైతన్యలో విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో, వ్యూహాత్మకంగా ఆలోచించి, అత్యున్నత సామర్థ్యాలను చేరుకునేందుకు సమర్థులవుతారు. శ్రీచైతన్యలో బ్రాండ్ అంబాసిడర్ మారడం గురించి గుకేష్ దొమ్మరాజు మాట్లాడుతూ... చదరంగం, పోటీ పరీక్షలలో విజయం వ్యూహాత్మక ఆలోచన, క్రమశిక్షణ, మానసిక స్థితిస్థాపకతపై ఆధారపడి ఉంటుంది. చదరంగంలో ముందస్తు ప్రణాళిక అవసరమైతే, జేఈఈ, నీట్‌లో కూడా విశ్లేషణాత్మక విధానం తప్పనిసరి, ఈ భాగస్వామ్యం ద్వారా, నేను విద్యార్థులకు మాత్రమే కాదు, వారి జీవితాంతం విజయం సాధించడానికి కూడా ఈ నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రేరణ ఇవ్వాలని ఆశిస్తున్నట్లు తెలిపారు.

# 7వ తరగతి నుంచే సివిల్స్ ఓరియంటేషన్

### 8 నుంచి జెఇఇ, నీట్ కోచింగ్

### ప్రణాళికాబద్ధంగా ఎస్సీ గురుకులాల్లో బోధన

### గతేడాది 181 మందికి ఎంబిబిఎస్.. 38 మందికి ఐఐటీల్లో సీట్లు

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు ఉన్నత చదువులకు వెళుతూ .. ఉన్నత పదవులను చేపడుతున్నారు. ప్రధానంగా ఎస్సీ గురుకులాల్లో ప్రణాళికాబద్ధంగా విద్యను అభ్యసిస్తున్నారు. ప్రాథమిక విద్యలోనే వారికి ఉన్నత విద్యపై ఆసక్తి కల్పిస్తున్నారు. ఉన్నత పదవులైన ఐఏఎస్ వంటి వాటికి వెళ్లడంతోపాటు సమాజానికి సేవ చేసే వైద్య వృత్తి, ఇంజనీరింగ్ కోర్సులను నేర్చుకోవడానికి ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న ఎస్సీ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకి 7వ తరగతి నుంచే సివిల్స్‌కి సిద్ధం కావడానికి అవగాహన కల్పిస్తున్నారు. 7వ తరగతిలోనే విద్యార్థులకు ఉన్న ఐక్యూను పరిశీలించి.. ఎవరికైతే సమాజంపై అవగాహన ఉండి.. సమాజసేవ చేయాలనే కోరిక వారిలో ఉంటుందో.. అటువంటి వారిని గుర్తించి వారికి అప్పటి నుంచే సివిల్స్‌లో విజయం సాధించడం కోసం అవగాహనను కల్పిస్తున్నారు. సివిల్స్‌లో విజయం సాధించాలనుకునే వారికి 7వ తరగతి నుంచి వారిని ప్రత్యేకంగా కోచింగ్ ఇస్తూ తర్ఫీదు చేస్తున్నారు. సమాజంపై అవగాహన ఉండి వైద్య వృత్తిని చేపట్టాలనుకునే వారికి.. అలాగే ఇంజనీరింగ్ చేయాలనుకునే వారికి ప్రత్యేకంగా 8వ తరగతి నుంచే వారికి ప్రత్యేకంగా నీట్, జేఈఈపై శిక్షణను ఇప్పిస్తున్నారు. ఇలాంటి వారికి ప్రత్యేకంగా ఇంటర్మీడియట్ తరువాత వారిని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీవోఈ)గా నిర్ణయించిన కాలేజీల్లో చేర్పించి వారికి మరింత తర్ఫీదును ఇస్తున్నారు.

రాష్ట్రంలోని ఎస్సీ గురుకుల జూనియర్ కాలేజీల్లో 36 సైన్స్ కాలేజీలను, 2 ఆర్ట్స్ కాలేజీలను సీఈవోగా గుర్తించి వాటిలో చదివే విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణను ఇప్పిస్తున్నారు. సీఈవోలో కూడా ప్రీమీయర్ సీఈవో పేరుతో 7 కాలేజీలను గుర్తించి.. వాటిలో నీట్, జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ సిలబస్‌ను బోధించడానికి బయటి నుంచి అత్యంత ప్రతిభావంతమైన ఫ్యాకల్టీని తీసుకొచ్చి విద్యార్థు లకు బోధన కొనసాగిస్తున్నారు. ఇలాంటి వాటిలో సబ్జెక్టును బోధించడానికి ఒకరిని కొనసా గిస్తుండగా.. వారు చదువుకొనే సమయంలో వారికి సందేహాలను తీర్చడానికి వారిని గైడ్ చేయడానికి మరో అధ్యాపకున్ని నియమించారు. ఇలాంటి బాగా చదువుకోవాలి.. అభివృద్ధిలోకి రావాలనుకునే వారికి ప్రత్యేకంగా శిక్షణను ఎస్సీ గురుకుల ఉన్నతాధికారుల పర్యవేక్షణలో జరుగుతోంది. ఇలాంటి శిక్షణను ఇవ్వడం వల్ల గత ఏడాది మంచి ఫలితాలు వచ్చినట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. గత ఏడాదిలో 181 మందికి ఎంబిబిఎస్ సీట్లు సాధించారు. బీడీఎస్‌లో ఇద్దరికి బీఏఎంఎస్‌లో ముగ్గురు, బీహెచ్ఎంఎస్ ఇద్దరు సొంతం చేసుకున్నారు. ఇక దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీల్లో 38 మంది సీట్లు సాధించారు. ఎన్ఐటీల్లో మరో 56 మందికి సీట్లు రాగా.. ట్రిపుల్ ఐటీ, జీఎఫ్‌టీఏలో 38 మందికి సీట్లు వచ్చాయి. ప్రత్యేకంగా నిర్వహించే ఫోరెన్సిక్ సైన్స్ పరీక్షలో నెగ్గి 8 మంది సీట్లు సాధించగా.. సెంట్రల్ యూనివర్సిటీ కామన్ ఎంట్రన్స్ (సీయూఈటీ)లో 6 మంది వివిధ యూనివర్సిటీల్లో సీట్లు సాధించారు. అజీమ్‌ప్రేమ్‌జీ యూనివర్సిటీలోల 12 మంది విద్యార్థులు సీట్లు సాధించగా.. సీఎంఏలో 39 మంది సీట్లు సాధించారు.



# ప్రతి విఆర్వోను షరతులు లేకుండా రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలి

### మంత్రులు సీతక్క, శ్రీధర్‌బాబును కలిసిన ఉద్యోగ జెఏసి

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** ఉద్యోగులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు మంత్రులు శ్రీధర్‌బాబు, పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి వినతి పత్రం సమర్పించారు. రెవెన్యూ శాఖ జారీచేసిన జీవో 129ను సవరించి, రద్దయిన ప్రతి విఆర్వోను ఎలాంటి షరతులు లేకుండా యథావిధిగా రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలన్నారు. గతంలో అపారమైన సేవా అనుభవం, ప్రజాపాలనలో చురుకైన పాత్రను దృష్టిలో పెట్టుకుని, వీరికి విద్యార్హతల పేరుతో పరీక్షల వంటి షరతులు విధించడం ఇది వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉందని భావిస్తున్నామన్నారు. దాదాపుగా 20 సంవత్సరాల అనుభవం కలిగిన వీఆర్వోలను తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకుంటూ, వారి గత సేవను పరిగణనలోకి తీసుకోకుండా సర్వీసును జీరో చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం, వారి గత సేవలను పరిగణనలోకి తీసుకోవాల్సిందే. లేకపోతే వారు ప్రమోషన్‌లతో పాటు ఇతర సర్వీస్‌కు సంబంధించిన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.జీవో 129 సవరణ వల్ల ప్రభుత్వానికి ఎలాంటి అదనపు ఆర్థిక భారం ఉండదని స్పష్టం చేశారు. చిన్న చిన్న సాంకేతిక లోపాలను సవరించడం ద్వారా రద్దయిన వీఆర్వోలు మరింత చురుకుగా సేవలందించగలుగుతారన్నారు. .మంత్రులను కలిసిన వారిలో జేఏసీ ఛైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస రావు,టివిఆర్ఓ జేఏసీఛైర్మన్ గోల్కొండ సతీష్ తదితరులు ఉన్నారు.

# బలహీనవర్గాలకు ముద్ర యోజనతో ప్రయోజనం

### 52 కోట్ల రుణాలకు రూ.33.54 లక్షల కోట్లు

### కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి నాగరాజు

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** ప్రధాన మంత్రి ముద్ర యోజనతో సమాజంలో అణగారిన, బలహీనవర్గాలకు ప్రయోజనం చేకూరిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎం.నాగరాజు వెల్లడించారు. పెద్ద సంఖ్యలో గ్రామీణ మహిళలు కూడా ఈ పథకం ద్వారా లబ్ధి పొందినట్లు పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా 52 కోట్లకుపైగా రుణాలు మంజూరయ్యాయని, వీటి విలువ రూ. 33.54 లక్షల కోట్లు అని తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలో ముద్ర యోజన పథకం చిన్నవారికి అండగా నిలుస్తోందన్నారు. ఈ పథకంలో భాగంగా ప్రజలు బ్యాంకుకు పూచీకత్తుగా ఆస్తులను తాకట్టు పెట్టాల్సిన అవసరం లేకుండానే రుణాలను పొందగలుగుతున్నారని తెలిపారు. సేవారంగాల్లో ఆదాయాన్ని ఆర్జించే చిన్న వ్యాపార సంస్థలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రుణాలను అందించేలా ఈ పథకాన్ని రూపొందించారని పేర్కొన్నారు. పీఎమ్ఎంవై కింద, టర్మ్ రుణాలు, వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు రెండింటినీ కవర్ చేస్తూ, బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు, మైక్రో ఫైనాన్స్ సంస్థలు సహా మెంబర్ లైండింగ్ ఇనిస్టిట్యూషన్స్ ఈ రుణాలను అందిస్తున్నాయని వివరించారు.

ప్రారంభంలో శిశు, కిశోర్, తరుణ్ అనే మూడు వర్గాల కింద ఔత్సాహిక వ్యాపారవేత్తలకు రూ.10 లక్షల వరకు రుణాలు అందించారన్నారు. అలాగే తరుణ్ కేటగిరీ కింద గతంలో రుణాలు తీసుకున్న రుణా లను విజయవంతంగా తిరిగి చెల్లించిన వ్యాపారుల కోసం కేంద్రం తరుణ్ ప్లస్ అనే కొత్త కేటగిరీని జోడించిందని చెప్పారు. అంతే కాకుండా రుణ పరిమితిని రూ.20 లక్షలకు పెంచిందని పేర్కొన్నారు. అర్హులైన వారికి సులభంగా రుణం అందించడమే కాకుండా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా రుణాలు అందించడం ఈ పథకం ప్రధాన లక్ష్యమని తెలిపారు.

# ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలకు అంబర్‌పేట్‌లో తాత్కాలిక విడిది

**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో విపత్తుల నిర్వహణకు ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలకు చేదోడువాదోడుగా వుంటున్న ఎన్‌డిఆర్ఎఫ్‌కు అంబర్‌పేట్‌లోని పోలీసు శిక్షణా కేంద్రంలో నాలుగెళ్ల పాటు తాత్కాలిక విడిది కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 150 మంది సభ్యులతో కూడిన మూడు ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు అంబర్‌పేట్ లోని పోలీసు శిక్షణా కేంద్రంలో వుంటాయి. ప్రస్తుతం ఈ బృందాలు ఎపిలోని విజయవాడ కేంద్రంగా వున్న ఎన్‌డిఆర్ఎఫ్ పదవ బెటాలియన్‌కు అనుబంధంగా పని చేస్తున్నాయి. అయితే తెలంగాణలో ఏమైనా విపత్తులు సంభవిస్తే విజయవాడ నుంచి రాకపోకలు సాగించడం ఇబ్బందిగా వుండడంతో హైదరాబాద్‌లో విడిది కావాలని ఎన్‌డిఆర్ఎఫ్ అధికారులు సర్కారును కోరగా షేక్‌పేట్‌లో ప్రభుత్వ భవనాన్ని కేటాయించారు. అయితే అది చిన్నది కావడంతో మరింత పెద్దది కావాలని ఆ విభాగం కో రడంతో అంబర్‌పేట్‌లోని పోలీసు శిక్షణా కేంద్రంలో తాత్కాలిక బసను ఏర్పాటు చేశారు. కాగా ఎన్‌డిఆర్ఎఫ్ బృందాల కోసం శంషాబాద్‌లోని హమీదుల్లానగర్‌లో శా శ్వతంగా ఒక ప్రాంగణం ఏర్పాటు చేయనున్నారు. అప్పటి వరకు వీరంతా అంబర్‌పేట్‌లోని పోలీసు శిక్షణా కేంద్రంలో వుంటారు. ఈ మేరకు హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి రవి గుప్తా గురువారం నాడు ఆదేశాలు జారీ చేశారు.

# పోషకాహార తెలంగాణ లక్ష్యంగా పని చేయాలి

### అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం సరుకులు సరఫరా చేస్తే సహించం

### చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో టీచర్లు, హెల్పర్ల పాత్ర గొప్పది: సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క



**హైదరాబాద్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** పోషకాహార తెలంగాణ లక్ష్యంగా సిబ్బంది పని చేయాలని,అంగన్ వాడీ కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేసే విధంగా చరన్యలు తీసకోవాలని పంచాయితీరాజ్, మహిళాశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. గురువారం అంగన్ వాడీలపై ఆమె సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే రోజుల్లో అంగన్ వాడీ సెంటర్లకు గ్రేడింగ్‌లు ఇస్తామని, మంచి గ్రేడింగ్‌లు సాధించిన సెంటర్లకు, సిబ్బందికి, జిల్లా అధికారులకు అవార్డులు ఇస్తామన్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో అన్ని కేంద్రాలు చిన్నారులతో కళకళాడాలన్నారు. చిన్నారులు లేరనే సాకు చెప్పడం సరికాదని,కనీసీ సెంటర్‌లో 20 మంది చిన్నారులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నారులు లేని అంగన్‌వా కేంద్రాలను డిమాండ్ ఉన్న ప్రాంతాలకు తరలించారని ఆదేశించారు. అదే విధంగా అంగన్ వాడికి సరఫరా చేసే సరుకుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బడి బాట తరహాలోనే మీరు గ్రామాల్లో చిన్నారులను గుర్తించి అంగన్ వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. 30 అంగన్ వాడీ కేంద్రాల్లో అసలు పిల్లలు లేరని,198 కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య లోపే ఉందని, 586 కేంద్రాల్లో 10లోపే చిన్నారులు ఉన్నారని మంత్రి తెలిపారు. ప్రభుత్వం చిన్నారుల సంక్షేమంపై వందల కోట్లు ఖర్చు చేస్తోందని, మీరు సీరియస్ ఉంటేనే ప్రభుత్వం ఆశించిన లక్ష్యాలు నెరవేరుతాయని, అంగన్ వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య పెంచే బాధ్యత మీదే అన్నారు. కంది పప్పు కొనుగోలు విషయంలో సొంత నిర్ణయాలు ఎందుకు తీసుకున్నారు ? ఈ టెండర్ విధానాన్ని ఎందుకు పాటించలేదు? మీ తప్పుల కారణంగా మేము విమర్శలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని జిల్లాల్లో అధికారులు పాత కాంట్రాక్టర్లకే కందిపప్పును నామినేషన్ పద్ధతిలో ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందో చెప్పాలన్నారు. పాత కాంట్రాక్టర్లకు నామినేషన్ పద్ధతిని నిలిపివేసి ఈ టెండర్ విధానాన్ని అవలంబించాలని, కలెక్టర్ నేతృత్వంలో డిస్ట్రిక్ట్ ప్రొక్యూర్‌మెంట్ కమిటీ ద్వారా టెండర్లు పిలవాలన్నారు. సామ్,మాక్ చిన్నారులను గుర్తించి రిపోర్టు చేయాలన్నారు. మీకు చెడ్డపేరు వస్తుందని పోషకాహార లోపాన్ని దాచిపెడితే సమాజానికి నష్టం వాటిల్లు తుందన్నారు. పిల్లల అమ్మకాలు బాల్యవివాహాలు, నిబంధనలకు విరుద్ధంగా జరిగితే దత్తతలపై దృష్టి సారించాలన్నారు. పరిశుభ్రత, పౌష్టికాహారంలో అంగన్ వాడీ కేంద్రాలు నెంబర్ 1గా నిలవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు గ్రేడింగ్ ఇచ్చిన విధంగానే మేము కూడా జిల్లాలకు గ్రేడింగ్ ఇస్తామని, ఎక్కువ గ్రేడింగ్ ఉన్న జిల్లాల్లో అనుసరిస్తున్న వి ధానాలను ఇతర జిల్లాల్లో అమలు చేస్తామన్నారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో అంగన్ వాడీ టీచర్లు, హెల్పర్ల పాత్ర చాలా గొప్పదన్నారు.అంగన్‌వాడీ కేంద్రాలకు సరపరా అయ్యే సరుకుల్లో నాణ్యత లోపిస్తే సదరు కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెడతామని మంత్రి సీతక్క హెచ్చరించారు. సామాజిక దురాచారాలను, రుగ్మతలను పారదోలే విధంగా అంగన్‌వాడీ కేంద్రాలు పని చేయాలన్నారు. మహిళలపై దాడులు వెలుగు చూసిన వెంటనే జిల్లా సంక్షేమ అధికారులు కేసులు బుక్ చేయించాలని, బాధితులకు భరోసా కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని మంత్రి సీతక్క హెచ్చరించారు. సమావేశంలో మహిళా శిశుసంక్షేమశాఖ కార్యదర్శి అనితారామచంద్రన్, డైరెక్టర్ కాంతివెస్లీ జిల్లాసంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

## 22న నీల్‌సెట్స్‌లోకి ఎన్‌టిఆర్ ..


మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, మావెరిక్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబోలో సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కి ఎన్‌టిఆర్‌నీల్ అని వర్కింగ్ టైటిల్‌ను పెట్టారు. ఈ ప్రాజెక్ట్ మీద ఇప్పటికే అంచనాలు ఆకాశంన్నంటేశాయి. ఈ క్రేజీ ప్రాజెక్ట్ చిత్రీకరణ ఇటీవల హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో ఘనంగా ప్రారంభమైంది. ఈ మూవీ సెట్స్‌లోకి ఎన్‌టిఆర్ ఎంట్రీ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అభిమానుల ఎదురు చూపులకు తెర దించుతూ మేకర్లు అదిరిపోయే అప్డేట్ ఇచ్చారు. ఏప్రిల్ 22 నుంచి సెట్స్‌లోకి



ఎన్టీఆర్ అడుగు పెడుతున్నారు. ఏప్రిల్ 22 నుంచి ఎన్టీఆర్ మీద దర్శకుడు ప్రశాంత్ నీల్ అద్భుతమైన సన్నివేశాలను చిత్రీకరించబోతోన్నారు. ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబోలో రాబోతోన్న ఈ చిత్రం తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళం మరియు ఇతర భాషలలో విడుదల కానుంది. బ్లాక్ బస్టర్ చిత్రాలను అందిస్తూ సక్సెస్‌కు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ప్రశాంత్ నీల్, ఈ ప్రాజెక్ట్‌కి భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ఎన్టీఆర్ ఇమేజ్‌ను మరింత పెంచేలా ప్రశాంత్ నీల్ రూపొందిస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌లపై కళ్యాణ్ రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరి కృష్ణ కొసరాజు నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి భువన్ గౌడ సినిమాటోగ్రఫర్‌గా, రవి బస్రూర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. ఈ మూవీకి ప్రొడక్షన్ డిజైనర్‌గా చలపతి వర్క్ చేస్తున్నారు. నటీనటులు: మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్
సాంకేతిక బృందం: బ్యానర్లు: మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్,
నిర్మాతలు: కళ్యాణ్ రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు
రచన, దర్శకత్వం: ప్రశాంత్ నీల్
ప్రొడక్షన్ డిజైన్: చలపతి.

## 'పోలీస్ వారి హెచ్చరిక' నుంచి ప్రేమగీతం..

అభ్యుదయ దర్శకుడు బాబ్జీ రూపొందించిన లేటెస్ట్ ఎంటర్‌టైనర్ పోలీస్ వారి హెచ్చరిక చిత్రం నుంచి ఒక వినూత్నమైన ప్రేమగీతం ఆవిష్కరణ జరిగింది. ఈ సినిమాలో విలన్లు ప్రేమగీతాలు పాడుకునే విభిన్నమైన కాన్సెప్ట్‌తో రూపొందిన ఈ పాటను నటకిరీటి రాజేంద్ర ప్రసాద్



గ్రాండ్‌గా లాంచ్ చేశారు. తూలికా తనిష్క్ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాత బెల్లి జనార్ధన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, సాధారణంగా సినిమాల్లో హీరోహీరోయిన్లు ప్రేమగీతాలు పాడుకుంటారు. కానీ, ఈ సినిమాలో విలన్లు డ్యూయెట్‌లు పాడుకోవడం ఒక వెరైటీ కాన్సెప్ట్. ఈ సినిమా విడుదలైన తర్వాత విలన్లకు కూడా డ్యూయెట్‌లు పెట్టే ట్రెండ్ మొదలవుతుందని నానమ్మకం. ఇలాంటి సరికొత్తపాటను ఆవిష్కరించే అవకాశం రావడం నాకు సంతోషంగా ఉంది" అని అన్నారు. దర్శకుడు బాబ్జీ మాట్లాడుతూ, పోలీస్ వారి హెచ్చరిక సినిమా పాటలను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించాం. త్వరలో సెన్సార్ పనులు పూర్తి చేసి, ఈ చిత్రాన్ని గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధం చేస్తున్నాం" అని తెలిపారు. నిర్మాత బెల్లి జనార్ధన్ మాట్లాడుతూ, ఈ సినిమాను తెలుగురాష్ట్రాల్లో వీలైనన్ని ఎక్కువ థియేటర్లలో రిలీజ్ చేసేందుకు ప్లాన్‌చేస్తున్నాం. ప్రేక్షకులకు ఈ చిత్రం ఒక కొత్త అనుభవాన్ని అందిస్తుందని ఆశిస్తున్నాం" అని పేర్కొన్నారు. నటినటులు: సన్నీ అఖిల్, అజయ్ ఘోష్, రవి కాలే, గిద్దెష్, శుభలేఖ సుధాకర్, షాయాజీ షిండే, హిమజ, జయ వాహిని, శంకరాభరణం తులసి, ఖుషి మేఘన, రుచిత, గోవిందా, హనుమ, బాబురామ్ తదితరులు. కెమెరా: నళిని కాంత్, మ్యూజిక్: గజ్వేల్‌వేణు, ఎడిటర్:షార్వాణి శివ, పబ్లిసిటీ స్టిల్స్: శ్రీకాంత్ భోక్రె, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్: హనుమంత రావు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్.పి. సుబ్బారాయడు, ప్రొడ్యూసర్: బెల్లి జనార్ధన్.



## 'నారి నారి నడుమ మురారి' ఫస్ట్ సింగిల్

చార్మింగ్ స్టార్ శర్వా హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ నారి నారి నడుమ మురారి. సామజవరగమన ఫేమ్ రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించారు. అనిల్ సుంకర ఎకె ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర, అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి నిర్మించిన ఈ చిత్రంలో సాక్షివైద్య, సంయుక్త కథానాయికలుగా నటించారు. ఇప్పటికే, సినిమా నుండి ఫస్ట్‌లుక్, ఇతర పోస్టర్లు మంచి బజ్ క్రియేట్ చేశాయి. ఇప్పుడు మేకర్స్ సినిమా ఫస్ట్ సింగిల్ దర్శనమే రిలీజ్ చేసి మ్యూజిక్ ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు. విశాల్ చంద్ర శేఖర్ దర్శనమే కోసం క్లాసిక్ మెలోడీని ఫ్రెష్ బీట్స్‌తో అద్భుతంగా కంపోజ్‌చేశారు. మనసుని కట్టిపడేసే ట్రాక్ ఇది. యాజిన్ నిజార్ వోకల్స్ పాటను మరో స్థాయికి తీసుకెళ్తాయి, అతని వాయిస్ మెస్మరైజ్ చేసింది. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం శర్వా ఎమోషన్స్ అద్భుతంగా వర్ణిస్తుంది. స్క్రీన్‌పై శర్వా చరిస్మాటిక్ ప్రజెన్స్ కట్టిపడేసింది. సంయుక్త అందంగా కనిపిస్తుంది. శర్వాతో మ్యాజికల్ కెమిస్ట్రీని పంచుకుంటుంది. వారు తమ ప్రేమకథను ప్రేక్షకులను అలరించే విధంగా పెర్ఫామ్ చేశారు. ఈ చిత్రానికి జ్ఞాన శేఖర్ వి.ఎస్, యువరాజ్ సినిమాటోగ్రఫీ నిర్వర్తిస్తున్నారు. భాను బోగవరపు కథను రాశారు. నందు సావిరిగణ సంభాషణలను అందించారు. బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్.




## 'హిట్: ది థర్డ్ కేస్' సాంగ్ రిలీజ్

నాచురల్ స్టార్ నాని హైలీ యాంటిసిపేటెడ్ క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ 'హిట్: ది థర్డ్ కేస్' మ్యూజిక్ ప్రమోషన్స్ లీడ్ పెయిర్ రొమాంటిక్ సాంగ్‌తో ప్రారంభమయ్యాయి. నాని, శ్రీనిధి శెట్టి ఈ పాటలో డాజ్లింగ్ కెమిస్ట్రీతో ఆకట్టుకున్నారు. డాక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని వాల్ పోస్టర్ సినిమా, నాని యూనాని మస్ ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. మిక్కీ జె మేయర్ సంగీతం అందించారు. మేకర్స్ సెకెండ్ సింగిల్ అబ్కీ బార్ అర్జున్ సర్కార్ రిలీజ్ చేశారు. ఈ పాట అర్జున్ సర్కార్ పాత్రకు ప్రాణం పోసింది. ఇది అతని వ్యక్తిత్వాన్ని ప్రజెంట్ చేస్తోంది, ఈ సాంగ్ అతని ఫెరోషియస్ ఎనర్జీని సూచిస్తోంది. అతను తన శత్రువులకు పీడకల, తప్పుకు ప్రతీకారం తీర్చుకునే కఠినమైన తత్వాన్ని కలిగి ఉంటాడు. కృష్ణకాంత్ రాసిన సాహిత్యంతో అతని పాత్ర సారాంశాన్ని పాట ద్వారా అద్భుతంగా చూపించారు. మిక్కీ జె మేయర్ ఆకట్టుకునే ట్రాక్‌ను, ఎలక్ట్రిఫైయింగ్ ఆర్కెస్ట్రేషన్‌తో కంపోజ్‌చేశారు, అనురాగ్ కులకర్ణి డైనమిక్ వాయిస్ సాంగ్‌ని మరోస్థాయికి తీసుకెళుతుంది. నాని కమాండింగ్ ప్రజెన్స్, సాంగ్‌లో ఇంటెన్స్ ఎనర్జీని నింపుతుంది. అర్జున్ సర్కార్ ఎసెన్స్‌ని కంప్లీట్‌గా ప్రజెంట్ చేసే అడ్రినలిన్‌చార్జ్ యాంథమ్‌ని క్రియేట్ చేస్తోంది. ప్రతి మూమెంట్‌ని అద్భుతంగా తీర్చిదిద్దాడు, కార్తీక శ్రీనివాస్ ఆర్



ఎడిటర్. శ్రీ నాగేంద్ర తంగాల ప్రొడక్షన్ డిజైనర్. ఏప్రిల్ 14న ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు మేకర్స్ పాట ద్వారా అనౌన్స్ చేశారు. 'హిట్: ది థర్డ్ కేస్' మూవీ మే 1న విడుదలకు సిద్ధమవుతోంది. తారాగణం: నాని, శ్రీనిధి శెట్టి, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: డా. శైలేష్ కొలను, నిర్మాత: ప్రశాంతి తిపిర్నేని, బ్యానర్లు: వాల్ పోస్టర్ సినిమా, యునానిమస్ ప్రొడక్షన్స్, డీవోపీ: సాను జాన్ వర్గీస్, సంగీతం: మిక్కీ జె మేయర్, ఎడిటర్: కార్తీక శ్రీనివాస్ ఆర్, ప్రొడక్షన్ డిజైనర్: శ్రీ నాగేంద్ర తంగాల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్ వెంకటరత్నం (వెంకట్), సౌండ్ మిక్స్: సురేన్ జి, లైన్ ప్రొడ్యూసర్: అభిలాష్ మాంధదపు, చీఫ్ కోడైరెక్టర్: వెంకట్ మద్దిరాల, కాస్ట్యూమ్ డిజైనర్: నాని కమరుసు, ఎస్ఎఫ్ఎక్స్: సింక్ సినిమా, విఎఫ్ఎక్స్ సూపర్‌వైజర్: విఎఫ్ఎక్స్ డిటిఎం, డిఐ: బి2హెచ్ స్టూడియోస్, కలరిస్ట్: ఎస్. రఘునాథ్ వర్మ పీఆర్వో: వంశీ శేఖర్ మార్కెటింగ్: ఫస్ట్ షో.

## 'ప్రాజెక్ట్ క్రూసియల్ రోల్'లో టబు

డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి నటిస్తున్న తన అత్యంత ప్రతిష్టాత్మక పాన్‌ఇండియా ప్రాజెక్ట్‌ను ఇటీవలే అనౌన్స్ చేశారు. ఉగాది శుభ సందర్భంగా ప్రకటించిన ఈ చిత్రాన్ని పూరి జగన్నాథ్, చార్మీ కౌర్ తమ బ్యానర్ పూరి కనెక్ట్స్ పావు గ్రాండ్‌గా నిర్మిస్తారు. ఈ హైలీ యాంటిసిపేటెడ్ సినిమా కోసం పూరి జగన్నాథ్ పవర్ ఫుల్ కథని రాశారు. ఇందులో విజయ్ సేతుపతి నెవర్ బిఫోర్ క్యారెక్టర్ కనిపించబోతున్నారు. విజయ్ సేతుపతి అవుట్ స్టాండింగ్ పెర్ఫార్మెన్స్, డిఫరెంట్ అవతార్‌లో చూడబోతున్నారు ఆడియన్స్.



ఎక్సయిట్మెంట్ పెంచుతూ, యాక్ట్రెస్ టబు ఈ చిత్రంలో చాలా కీలకమైన పాత్రలో కనిపించనున్నారు. సెలెక్టెడ్ రోల్స్‌కి పాపుల రైన టబు, ఈ పాత్ర, కథాంశం నచ్చి వెంటనే ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో భాగం కావడానికి అంగీకరించారు. ఈ సినిమా జూన్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీతో సహా పలు భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. త్వరలోనే ఈ చిత్రంలోని ఇతర నటీనటులు, సిబ్బందిని మేకర్స్ అనౌన్స్ చేశారు. తారాగణం: విజయ్ సేతుపతి, టబు, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: పూరి జగన్నాథ్, నిర్మాతలు: పూరి జగన్నాథ్, చార్మి కౌర్, బ్యానర్: పూరి కనెక్ట్స్ సిఇఒ విషు రెడ్డి, పీఆర్వో: వంశీశేఖర్, మార్కెటింగ్: హాష్‌ట్యాగ్ మీడియా.

## 'అర్జున్ S/O వైజయంతి' ముచ్చటగా బంధాలే సాంగ్

నందమూరి కళ్యాణ్ రామ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ అర్జున్ S/O వైజయంతి. అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకాలపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రానికి ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించగా, విజయశాంతి హీరో తల్లిగా కీలక పాత్ర పోషిస్తుంది. తల్లీ కొడుకుల అనుబంధం సినిమా ప్రధానాంశం. ఈరోజు, చిత్తూరులో జరిగిన గ్రాండ్ ఈవెంట్‌లో సినిమా సెకండ్ సింగిల్ ముచ్చటగా బంధాలే సాంగ్‌ని లాంచ్ చేశారు. స్టార్ కంపోజర్ బి అజనీష్ లోక్‌నాథ్ స్వరపరిచిన ముచ్చటగా బంధాలే, కళ్యాణ్ రామ్, విజయశాంతి తల్లీ కొడుకుల భావోద్వేగ అనుబంధంను సున్నితంగా చిత్రీకరించిన మేలోడిక్ మాస్టర్ పీస్. రఘు రామ్ సాహిత్యంతో కూడిన ఈ పాట తల్లి స్వభావాన్ని హైలైట్ చేస్తుంది, ఆమె తన కొడుకు విజయం సాధించాలనే కలలను సాకారం చేసుకుంటూ, అతనికి నిరంతరం ప్రోత్సాహాన్ని అందిస్తుంది. అదే సమయంలో, కొడుకు తన తల్లిని సంతోషంగా, గర్వంగా ఉంచేందుకు ఎంతో ప్రయత్నిస్తాడు. తల్లికొడుకుల బంధంతో పాటు, ఈ పాట కళ్యాణ్ రామ్ ప్రేమ వైపు ఒక గ్లింప్స్ అందిస్తుంది, సాయి మంజ్రేకర్‌తో అతని సున్నితమైన రిలేషన్‌ని పాటకు అదనపు ఎమోషన్‌ని జోడిస్తుంది.



హరిచరణ్ సోల్ ఫుల్ వాయిస్ ఈ పాట ఒక మ్యాజిక్‌ని క్రియేట్ చేసింది, మొత్తంమీద, ముచ్చటగా బంధాలే తల్లి కొడుకుల బంధానికి హృదయపూర్వక నివాళి. ఈ చిత్రానికి సోహైల్ ఖాన్, శ్రీకాంత్, యానిమల్ పృథ్వీరాజ్ ప్రముఖ పాత్రల్లో కనిపిస్తారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ రామ్ ప్రసాద్, ఎడిటింగ్ తమ్మిరాజు, స్క్రీన్‌ప్లే: శ్రీకాంత్ విస్సా. ఇప్పటికే హ్యూజ్ సెన్సేషన్ సృష్టిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 18న విడుదల కానుంది.
నటీనటులు: నందమూరి కళ్యాణ్ రామ్, విజయశాంతి, సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్, యానిమల్ పృథ్వీరాజ్
సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: ప్రదీప్ చిలుకూరి
నిర్మాతలు: అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు
సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, డీవోపీ: రామ్ ప్రసాద్
బ్యానర్లు: అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్
ఎడిటర్: తమ్మిరాజు
సమర్పణ: ముప్పా వెంకయ్య చౌదరి
స్క్రీన్ ప్లే: శ్రీకాంత్ విస్సా
ఆర్ట్ డైరెక్టర్: బ్రహ్మ కడలి
యాక్షన్: రామకృష్ణ, పీటర్ హెయిన్
పీఆర్వో: వంశీ శేఖర్, వంశీ కాకా
మార్కెటింగ్: ఫస్ట్ షో.

## 'విశ్వంభర' ఫస్ట్ సింగిల్ లాంచ్

మెగాస్టార్ చిరంజీవి మాగ్నమోపస్ విశ్వంభర ఇప్పటికే హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. టీజర్ విడుదలైన తర్వాత ఈ చిత్రం కోసం డిజైన్ చేసిన మెస్మరైజ్ చేసే వరల్డ్‌లోకి ఒక గ్లింప్స్ అందించింది. ప్రతిష్టాత్మక ఎంఎం క్రియేషన్స్ బ్యానర్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. తాజాగా మేకర్స్ సినిమా మ్యూజిక్ ప్రమోషన్స్‌ని కిక్ స్టార్ట్ చేస్తున్నట్లు అనౌన్స్ చేశారు. ఈ చిత్రం ఫస్ట్ సింగిల్ అకాడమీ అవార్డ్ విన్నింగ్ కంపోజర్ ఎంఎం కీరవాణి స్వరపరిచిన రామ రామ ఏప్రిల్ 12న విడుదల కానుంది. సాంగ్ టైటిల్, పాట పోస్టర్ కూడా రామ రామ భక్తి గీతం అని సూచిస్తున్నాయి. ఈ పోస్టర్‌లో చిరంజీవి చుట్టూ హనుమంతుడి వేషధారణలో ఉన్న పిల్లలు, బ్యాక్ డ్రాప్‌లో రాముడి గొప్ప విగ్రహం ఉంది. సరస్వతి పుత్ర రామజోగయ్య శాస్త్రి ఈ పాట కోసం సాహిత్యం రాశారు. తన బ్లాక్‌బస్టర్ ఫస్ట్ మూవీ బింబిసారతో చెరగని ముద్ర వేసిన దర్శకుడు వశిష్ట, విశ్వంభరని అత్యద్భుతంగా చిత్రీకరిస్తున్నారు. దీనిని ఆయన తన అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్‌గా భావిస్తారు. ఈ చిత్రంలో త్రిష కృష్ణన్, ఆశికా రంగనాథ్ హీరోయిన్స్‌గా నటిస్తుండగా, కునాల్ కపూర్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి డివోపి చోటా కె నాయుడు, ప్రొడక్షన్ డిజైనర్ ఎఎస్ ప్రకాష్. తారాగణం: మెగాస్టార్ చిరంజీవి, త్రిష కృష్ణన్, ఆశికా రంగానాథ్, కునాల్ కపూర్.



## 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' మీట్ ది ప్రెస్

టీవీ యాంకర్ టర్న్ హీరో ప్రదీప్ మాచిరాజు మోస్ట్ ఎవైటెడ్ మూవీ అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి. ఈ యూనిక్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను యంగ్ ట్యాలంటెడ్ డైరెక్టర్స్ డుయో నితిన్, భరత్ దర్శకత్వం వహిస్తున్నారు. మాంక్స్ మంకీస్ బ్యానర్ నిర్మిస్తున్న ఈ ఎగ్జైటింగ్ ఎంటర్‌టైనర్‌లో దీపికా పిల్లి కథానాయికగా నటిస్తోంది. టీజర్, ట్రైలర్, పాటలు ఇప్పటికే అద్భుతమైన రెస్పాన్స్ అందుకున్నాయి. ఈ సినిమా వేసవిలో వన్ అఫ్ ది బిగ్గెస్ట్ ఎట్రాక్షన్‌గా ఏప్రిల్ 11న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రిరిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రిరిలీజ్ ప్రెస్ మీట్‌లో హీరో ప్రదీప్ మాచిరాజు మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. మమ్మల్ని సపోర్ట్ చేసిన మీడియా వారికి థాంక్ యు. మీ ద్వారా సినిమాని ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లడం మాకు ఎప్పుడూ ఆనందం. చాలా మంచి టీంతో కలిసి పని చేసే అవకాశం నాకు దొరికింది. రధన్ బ్యూటిఫుల్ మ్యూజిక్ ఇచ్చాడు. బాల్ రెడ్డి విజువల్స్ చాలా వండర్ ఫల్ వుంటాయి. మా డైరెక్షన్ డిపార్ట్మెంట్, ప్రొడక్షన్ డిపార్ట్మెంట్, టెక్నీషియన్స్, యాక్టర్స్ అందరూ ఈ సినిమాని వోన్ చేసుకుని సొంత సినిమాలా వర్క్ చేశారు. మా టీమ్ అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఈ సినిమాతో చాలామంది కొత్తవారు పరిచయం అవుతున్నారు. ఈ సినిమా రిలీజ్ అయిన తర్వాత వాళ్ళ పేర్లు చాలా గట్టిగా వినిపిస్తాయి. నితిన్ భరత్ ఈ సినిమాతో పరిచయం అవుతున్నారు. సరికొత్త స్టైల్‌ని స్క్రీన్‌పై చూపించబోతున్నారు. సందీప్ రాసిన కథ డైలాగ్స్ చాలా రీసౌండ్ చేస్తాయి. భరత్ నితిన్ ఈ సినిమా ద్వారా నాకు బ్రదర్స్ లాగా దొరికారు. మా యూనిట్ మొత్తానికి రాజకుమారి దీపిక. మేము కూడా తనని రాజకుమారి లాగే చూసు కున్నాం. చాలా అద్భుతంగా పెర్ఫార్మ్ చేసింది. సూపర్ స్టార్ మహేష్ బాబు సపోర్టుతో తొలి అడుగు వేసాం. ఆయన మా సాంగ్‌ని లాంచ్ చేయడం మాకెంతో బలాన్ని ఇచ్చింది. ఈ సందర్భంగా సూపర్ స్టార్ మహేష్‌కి హృదయపూర్వక కృతజ్ఞతలు. మా సినిమా మొట్టమొదటి టికెట్‌ని గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ పర్చేజ్ చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఆయన ఈ సినిమాగురించి తెలుసుకుని ఇంటికి పిలిపించి మాట్లాడారు. ఆ సపోర్ట్‌ని మేము మర్చిపోలేం. రామ్ చరణ్ పెద్ది ఫర్ ప్రదీప్ అని చెప్పడం నా అదృష్టంగా భావిస్తున్నాను. షూటింగ్లో చాలా బిజీగా ఉంటూ కూడా మాకు సమయాన్ని కేటాయించి సపోర్ట్ చేసిన రామ్ చరణ్‌కి హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ సినిమా ట్రైలర్‌చూశారు. చాలా హ్యాపీగా ఫీలయ్యారు. రామ్ చరణ్ మా అందరితో సరదాగా ఇన్వాల్వ్ అవుతూ టికెట్‌ని ఫస్ట్ టికెట్‌ని పర్చేజ్ చేయడం మాకు ఒక బ్యూటిఫుల్ మెమొరీ. ఎంతో పెద్ద మనసుతో మాకు సపోర్ట్ చేసిన మీడియాకి థాంక్యూ సో మచ్. ఈ సమ్మర్లో ఫ్యామిలీ అంతా కలిసి హాయిగా నవ్వుకునే సినిమా ఇది. మాకోసం ఒక్క రెండున్నర గంటలు స్పెండ్ చేయండి. సూపర్‌గా ఎంటర్టైన్ చేస్తాం. ఇది నా ప్రామిస్. మైత్రి మూవీ మేకర్స్ మా సినిమాని రిలీజ్ చేయడం మా బిగ్గెస్ట్ స్ట్రెంత్. వారిస్తున్న సపోర్టుకి మా టీం తరపున మా టీం అందరి తరపునుంచి థాంక్యూ సో మచ్. మా సినిమా రిలీజ్ ముందే ఓటిటి శాటిలైట్ క్లోజ్ చేసుకోవడం మాకు చాలా ఆనందంగా ఉంది. ఇంతమంది మా కాన్ఫిడెన్స్‌ని బిల్డ్ చేస్తున్నారంటే తప్పకుండా ఇది ప్రేక్షకులు కూడా నచ్చుతుందని నమ్ముతున్నాం. అందరికీ థాంక్యూ వెరీమచ్ అన్నారు.



# వేసవి తాపం

**తీవ్రమైన ఎండలవల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలు తలెత్తు తాయి. సెలవుల్లో హుషా రుగా ఉండాలంటే ఆనందంగా ఉండే దుకు ఆరోగ్యాన్ని సంరక్షించు కోవాలి. ముఖ్యంగా డీహైడ్రేషన్, ఫుడ్‌పాయిజనింగ్ విషయాల్లో వేసవిలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండా కాలంలో వచ్చే చిక్కులను అధిగ మించాలంటే తగిన జాగ్రత్తలు తీసుకోవడమే మేలు.**



ఎండాకాలంలో చెమట ఎక్కువగా ఉంటుంది. ఈ కారణంగా శరీరం నీళ్లు, మినరల్స్‌ను కోల్పోతుంది. ఇలాంటప్పుడు తగినన్ని మంచినీళ్లు తాగకపోతే డీహైడ్రేషన్ తలెత్తుతుంది. దీంతో తలతిప్పడం, తలనొప్పి, అలసట, చర్మం పొడిబారడం వంటివి బాధిస్తాయి. కాబట్టి దాహంగా అనిపించకపోయినా రోజంతా వీలైనన్ని సార్లు నీళ్లు తాగుతూ ఉండాలి. పుచ్చకాయ, కీరదోస, నారింజలాంటివి ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. కెఫీన్, ఆల్కహాల్ మోతాదుకు మించి తీసుకోకూడదు. ఇవి డీహైడ్రేషన్ సమస్యను తీవ్రం చేస్తాయి. ఎండలో బయటికి వెళ్లేటప్పుడు ఓ నీళ్ల బాటిల్ తప్పనిసరిగా దగ్గర ఉంచుకోవాలి. ఎండలో ఎక్కువసేపు ఉంటే చర్మం కందిపోవడం, దద్దుర్లు, చెమటకాయలు సహా ఎన్నో చర్మ స మస్యలు వస్తాయి. అందువల్ల బయటికి వెళ్లేటప్పుడు చర్మానికి ఎస్‌పిఎఫ్ 30, అంతకంటే ఎక్కువ ఉన్న సన్‌స్క్రీన్ లోషన్ అప్లయ్ చేసుకోవాలి. తేలికైన, గాలి ధారాళంగా వచ్చే కాటన్ దుస్తులు ధరించాలి. దీంతో చెమట అంతగా పట్టదు. ఫంగల్ ఇన్ఫెక్షన్లు సోకకుండా చల్లటి నీళ్లతో స్నానం చేయాలి. చర్మం కమిలినప్పుడు చికిత్స కోసం అలోవెరా జెల్ కానీ, ఏదైనా కూలింగ్ మాయిశ్చరైజర్ కానీ వాడాలి. డీహైడ్రేషన్, అధిక చెమట మూత్రం పరిమాణాన్ని తగ్గిస్తాయి. ఇది మూత్రనాళంలో బ్యాక్టీరియా ముప్పును పెంచుతుంది. దీంతో మూత్రనాళ ఇన్ఫెక్షన్ల ప్రమాదం పెరుగుతుంది. స్త్రీలు మరీ జాగ్రత్తగా ఉండాలి. శరీరం నుంచి టాక్సిన్లు బయటికి వెళ్లడానికి నీళ్లు, ఫ్లూయిడ్స్ తాగుతూ ఉండాలి. పబ్లిక్ టాయిలెట్ ఉపయోగిస్తే ఆ తర్వాత శరీర పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. మూత్రాన్ని ఎక్కువసేపు ఉగ్గబట్టుకోకూడదు. బ్యాక్టీరియా నివారణ కోసం వదులుగా ఉండే కాటన్ అండర్‌వేర్‌ను ధరించడం మంచిది. ఎండలో ఎక్కువసేపు గడిపితే తలతిప్పడం, వికారం, అధిక చెమటలాంటి సమస్యలు తలెత్తుతాయి. దీంతో చాలామంది వడదెబ్బకు గురవుతారు. ఈ పరిస్థితి రాకుండా ఎండ బాగా ఉండే మధ్యాహ్నం సమయం నుంచి సాయంత్రం వరకు బయటికి వెళ్లకుండా ఉండేలా చూసుకోవాలి. ఇటువంటి కొన్ని కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఎండాకాలాన్ని అధిగమించవచ్చు.

★

చెలి చిట్కా

వేడిచేసిన కప్పు పాలల్లో ఒక స్పూను మిరియాల పొడిని కలిపి రెండు పూటలా తీసుకుంటే జలుబు త్వరగా తగ్గుతుంది.

# ఆహారంతో సమతుల్యత

వయసు పైబడినా ఆరోగ్యంగా ఉండేలా చాలా కాలంగా పరిశోధనలు జరుగుతునే ఉన్నాయి. ఎలాంటి దీర్ఘవ్యాధుల బారిన పడకుండా వృద్ధాప్య జీవితాన్ని కొనసాగించేలా ఉండడమన్నది ఎవరికైనా కష్టమైన సమస్యే. తీసుకునే ఆహారం వల్ల ఏమైనా ప్రయోజనం ఉంటుందా అనే దిశగా పరిశోధనలు చేశారు శాస్త్రవేత్తలు. అయితే అందుకు పరిశోధనల్లో పరిష్కారం దొరికిందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఆహారం వృధ్యాప్యాన్ని ఎలా నిర్ణయిస్తుందో నిర్ధారించినట్లు శాస్త్రవేత్తలు వెల్లడిస్తున్నారు. ఎక్కువ కాలం బ్రతకడం కోసం అని కాకుండా వయసు మీరిన కాలంలో ఆరోగ్యసమస్యలు లేకుండా ఉండేలా జీవించాలనేది అత్యంత ప్రాధాన్యం. సమతుల్య ఆహారం, దీర్ఘాయువు,మెదడు పనితీరుతో సహ మొత్తం ఆరోగ్యాన్ని జాగ్రత్తగా ఉంచుతుందని నిపుణులు అంటున్నారు. పోషకాలు అధికంగా ఉండే ఆహారాలు మంటను తగ్గించడానికి, ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడానికి శారీరకవిధులకు మద్దతు ఇవ్వడానికి సహాయపడతాయని చెప్పారు. అందుకు 30 ఏళ్ల లోపు వయసువారిపై చేసిన పరిశోధనలో ఆహారపు అలవాట్లను గమనించినట్లు తెలిపారు. వారు తీసుకున్న ఆహారం వారి 70 ఏళ్ల వయసులోను ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో నిర్ధారించామని వివరించారు. ఈ క్రమంలోనే ఆరోగ్యకరమైన వృద్ధాప్యజీవితం కోసం తీసుకోవాల్సిన సరైన ఆహర విధానాలను గుర్తించినట్లు చెప్పారు. దాన్ని ఆరోగ్యకరమైన సూచికగా నిర్ధారించారు. ఈ విధమైన ఆహారాలు తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి కూడా స్పష్టంగా చెప్పారు. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, గింజలు, చిక్కుళ్లు, ఆరోగ్యకరమైనకొవ్వులు తదితరాలు మంచివని చెప్పారు. అదేసమయంలో నాణ్యమైన మాంసం, ప్రాసెస్ చేసిన ఆహారాలు, శుద్ధిచేసిన ధాన్యాలు, అధిక సోడియం తదితరాలను నివారిస్తే మెరుగైన ఆరోగ్య ప్రయోజనాలను పొందగలరని అన్నారు. ఈ ఆహారపు అలవాట్లకు కాస్త దగ్గరగా ఉన్నవారు 70లలో మెరుగైన ఆరోగ్యాన్ని సొంతం చేసుకున్నట్లు వివరించారు. ఇలాంటి కొన్ని ఆరోగ్యసూత్రాలు ఆరోగ్యకరమైన జీవితాన్ని ఆస్వాదించేందుకు సహకరిస్తాయి. అందుకోసం వివిధ రకాల రంగురంగుల పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, అసంతృప్త కొవ్వులు తదితర ఆహారపు అలవాట్లు ప్రాధాన్యత ఇస్తే 70లలో ఏ చీకు చింతా లేకుండా హాయిగా ఉండవచ్చునని పరిశోధకులు స్పష్టం చేశారు.



# నిస్సత్తువకు కివీ నీళ్లు

సపోటా, ద్రాక్ష, కమలా ఇలా ఆయా కాలాల్లో దొరికే పండ్లు నానబెట్టిన నీళ్ల గురించి తెలుసు కదా. కివీ వాటర్ కూడా ఆరోగ్యపరంగా ఉపయోగపడుతుంది. తాజా ఉండే నాలుగు కివీ పండ్లను తీసుకుని పైన చెక్కు తీసి వాటర్ జగ్గులో లీటర్ నీళ్లు తీసుకోవాలి. కివీ పండ్లను చక్కటి ముక్కలుగా కట్‌చేసుకుని పెట్టుకోవాలి.



వాటిలో కొన్ని పండ్ల ముక్కలను తీసుకుని మెత్తగా చేసి నీళ్లలో కలపాలి. ఆ నీళ్లలో కొన్ని తాజా పుదీనా ఆకులను నలిపి వేయాలి. ఆ నీటిని ఒక గంట పాటు పక్కన పెట్టాలి. తర్వాత వాటిని చల్లగా కావానుకుంటే కొంతసేపు ఫ్రిజ్‌లో పెట్టి తీసి ఆతర్వాత అయినా తాగవచ్చు. కివీ పండ్లు కచ్చావి కాకుండా మరీ పండిపోయినవి కాకుండా పక్వానికి వచ్చిన పండ్లను ఎంచుకుంటేమంచిది. వీటిని రాత్రి ఫ్రిజ్‌లో పెట్టి, ఉదయం తీసి ఇలా తయారుచేసుకోవచ్చు. ఈ నీళ్లు తాగటం వల్ల అజీర్తి బాధ తొలగుతుంది. ఆకలి మందగింటం లాంటి సమస్యలు రావు. బరువు తగ్గేందుకు తోడ్పడుతుంది. రోగనిరోధకశక్తి పెంచుతుంది. శరీరంలో చేరిన విషపదార్థాలను హరిస్తుంది. శక్తి చేకూరుతుంది. నిస్సత్తువ తగ్గుతుంది. రక్తపోటు క్రమబద్ధంగా ఉంటుంది. గుండెజబ్బులు వచ్చే అవకాశం ఉండదు. కంటిచూపు మెరుగవుతుంది. ఎముకలకు పటుత్వం చేకూరుతుంది. కివి పండ్లు చేర్చిన నీరు రుచిగా ఉంటుంది. కాబట్టి పిల్లలు కూడా ఇష్టంగా తాగుతారు.

# గర్విస్తే పతనం తప్పదు!

ధనం సంపాదించటం కోసం మానవులు అనేక పాపాలు, మోసాలు చేస్తుంటారు. సంపాదించిన ధనంతో ఘోరాలు, అకృత్యాలు చేస్తూ ఇతరులకి హాని కలిగిస్తుంటారు. తాము ధనవంతులమనే గర్వంతో విర్రవీగుతూ దరిద్రులను చిన్నచూపు చూస్తుంటారు. అందరూ కాకపోయినా ఈ రోజుల్లో ఇలాంటి వారి సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. అయితే ధనమున్నది చంచలమైనది అది ఒకచోట స్థిరంగా ఉండదు. ఉన్నా కూడా ఒక్కొక్కసారి ఉపయోగపడదు. ఆయువు తీరిన మనిషి కోసం ఎంత ధనం ఖర్చుపెట్టినా వృధా. అలాగే మరణించిన మనిషితో పాటు ధనం వెంట రాదు. ధనంలాగానే అధికారం కూడా చంచలమైనది. అది కూడా ఒకరి వద్ద ఉండదు. అందువల్ల అధికారాన్ని చూసుకుని గర్వపడకూడదు. అధికారాన్ని దుర్వినియోగపరచకూడదు. అధికారం ఉంది కదా అని ఇష్టానుసారం ప్రవర్తించకూడదు. అలా చేస్తే ధనంలాగానే అధికారం కూడా మరికొకరి వద్దకు చేరుతుంది. ఇక బలగర్వంతో ఎగిరెగిరి పడేవారు ఈ కాలంలోనే కాదు పురాణ కాలంలోను ఎంతోమంది ఉన్నారు. తాను భారీ ఆకారం గల దాన్నని బలమైనా దాన్నని తనని ఎవరూ ఏమీ చేయలేరన్న గర్వంతో నీటిలోకి దిగిన గజేంద్రుడు మొసలి బారిన పడి విలవిలలాడాడు. తాము వందమంది సోదరులమని మహా వీరులెందరో తమ పక్షాల ఉన్నారని పంచపాండవులతో యుద్ధం చేసి ఆ యుద్ధంలో బంధుమిత్రులని, సోదరులని పోగొట్టుకుని చివరికి తాను కూడా తొడలు విరిగి దిక్కులేని చావు చచ్చాడు దుర్యోధనుడు. నరులు, వానరులని బలహీనులుగావించి వారితో తలపడిన రావణుడు కూడా దుర్యోధనుడిలానే బంధుమిత్రపరివార సమేతంగా నాశనమయ్యాడు. గర్వం, అహంకారం వంటివి ఎంతటివారినైనా అధోగతిపాలు చేస్తాయని చెప్పటానికి పురాణాల్లో ఇలా ఇంకా ఎన్నో ఉదాహరణలున్నాయి.

**- మిథునం**

# స్వచ్ఛమైన గాలికి ఇంట్లో మొక్కలు

**సీజన్ మారేటప్పటికల్లా అనారోగ్యాలు చుట్టుముడుతున్నాయి. ఎక్కువ సమయం ఇంటికే పరిమితం కావడం వల్ల వ్యాధినిరోధక శక్తీ తగ్గుతోంది. అలాకాకుండా ఇంట్లోని వాతావరణమూ ఆరోగ్యకరంగా మారాలంటే.. గది లోపల ఈ మొక్కల్ని పెంచమని సూచిస్తున్నారు నిపుణులు.**

స్వచ్ఛమైన గాలి కోసం ఎక్కడెక్కడికో వెళ్లక్కర్లేదు. మనం ఉన్న చోటే పచ్చని మొక్కను పెంచితే అదే మనకు ప్రాణ వాయువును ఇస్తుంది. అలా గాలిని శుభ్రం చేయడంలో స్పైడర్ ప్లాంట్ ముందుంటుంది. దీన్ని హాలులో ఓ మూలన పెడితే అందంగా కనిపించడమే కాదు.. తగినంత ఆక్సిజన్‌నీ ఇస్తుంది.

ల రబ్బర్ ప్లాంట్ కూడా తన చుట్టూ ఉన్న వాతావరణాన్ని ఆహ్లాదపరుస్తుంది. గాల్లోని టాక్సిన్లనూ శుద్ధి చేస్తుంది.

ల ఇంటి అలంకరణ ఆకర్షణీయంగా కనిపించేలా చేయడంలనట వెదురుకి మించింది లేదు. మీకున్న స్థలాన్ని బట్టి చిన్న కుండీ నుంచి పెద్ద తొట్టె వరకూ ఎందులోనైనా వెదురుని పెంచేయొచ్చు. దీన్ని ముందుగదిలో ఉంచితే చూడ్డానికీ బాగుంటుంది.

ల పీస్‌లిల్లీ గాలిని శుభ్రం చేయడమే కాదు.. రాత్రిపూట ఆక్సిజన్‌నూ ఎక్కువగా విడుదల చేస్తుందట. అందుకే, దీన్ని హాల్లోనో, పడకగదికి దగ్గరగానో పెడితే సరి.



హాయిగా నిద్రపడుతుంది.

స్నేక్ ప్లాంట్.. సన్నగా, పొడవాటి చారల ఆకులతో కనిపిస్తుంది. ఇది గాల్లోని సూక్ష్మజీవులను నాశనం చేస్తుంది., ఇంటిలోపల వాతావరణాన్ని స్వచ్ఛంగా ఉంచుతుంది. పైగా నీళ్లు పోయాల్సిన అవసరమూ ఎక్కువగా ఉండదు. ఇంకేం ఎంచక్కా పెంచుకోవచ్చు.

---

## భక్తుల పాలిట శాంతి ధామం ఆధ్యాత్మికతకు నిలయం

# శ్రీ శుకబ్రహ్మాశ్రమం

(ప్రభాతవార్త-శ్రీకాళహస్తి)

తిరుపతిజిల్లా శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో సువర్ణముఖి తీరార వెలసిన శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో శనివారం నుంచి వార్షికోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు ఏర్పాట్లును ఆశ్రమ పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరి స్వామి పర్యవేక్షిస్తున్నారు. ఐదు రోజుల పాటు జరిగే కార్యక్రమాల్ని స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించనున్నారు. ఆశ్రమ వ్యవస్థాపకులు విద్యాప్రకాశానందగిరి స్వామి 27వ పుణ్యారాధన,112వ జన్మదినోత్సవ వేడుకలు, ఆశ్రమ 75వ వార్షికోత్సవం ఈనెల 11 నుంచి 15 వరకు నిర్వహించనున్నారు. భక్తులు విరివిగా రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే వారికి అలాగే ఆశ్రమ పీఠాధితపతులకు అన్ని సదుపాయాలు కల్పించడం జరిగింది. దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తి పట్టణానికి శ్రీకాళహస్తీశ్వరాలయానికి దక్షిణాన పవిత్ర సువర్ణముఖి నదీ తీరాన ప్రశాంత వాతావర ణంలో వెలసిన దివ్యధామం శుకబ్రహ్మాశ్రమం. ఇక్కడ 1950లో ఏర్పేడు మలయాళ సద్గురు శిష్యులు శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వామి ఆశ్రమాన్ని స్థాపించారు. సుమారు 50 ఎకరాల స్థలంలో నిర్మించిన ఆశ్రమం ఎంతో ప్రశాంత వాతావరణంలో సాగుతుంది. ఓ వైపు ధార్మిక కార్యక్రమాలు మరో వైపు సామాజిక కార్యక్రమాలతో పాటు 'గీతా మకరందాన్ని' ప్రపంచ నలుమూలల్లో అన్ని భాషల్లో అందించిన ఘనత సద్గురు విద్యాప్రకాశానందగిరి స్వామిదే అని చెప్పవచ్చు. ఆయన ప్రసంగాలంటే భక్తులకు ఎనలేని ఆశక్తి. ఆయన విద్యావంతుడైనా పండిత పామరులకు అర్థమయ్యేరీతిలో సులభశైలిలో వాడక భాషలో తాను చెప్పదల్చుకున్నది స్పష్టంగా క్లుప్తంగా అందించేవారు. 1948 వరకు మళయాళ స్వామి ఆశ్రమం వ్యాసాశ్రమంలో సాధువుగా మళయాళ సద్గురు శిష్యుడుగా కొనసాగిన ఆయన తరువాత గురోపదేశంతో పవిత్ర సువర్ణముఖి తీరాన ఆశ్రమాన్ని స్థాపించారు. ఆయన 'మానవ సేవే మాధవ సేవ అనే'నినాదంతో తమ ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్ని చేపట్టారు. ఆశ్రమాలే సన్మార్గానికి మార్గదర్శకాలని ఆయన సమాజానికి చాటిచెప్పారు. పట్టణానికి సుమారు కిలో మీటర్‌దూరంలో వెలసిన శుకబ్రహ్మాశ్రమంలో గురుకులాలు, సంస్కృత పాఠశాలల్ని ఏర్పాటు చేశారు. అలాగే మానవునికి అన్ని అంగాల కన్నా కన్ను మిన్న అని భావించిన ఆయన భక్త కన్నప్ప



కంటి ఆసుపత్రిని 1994లో ప్రారంభించారు. అప్పటి నుంచి సుమారు లక్షాలాది మంది నిరుపేదలకు ఆయన చూపును ప్రసాదించిన ఘనత దక్కింది. ఏ వైద్యసదుపాయం లేని రోజుల్లో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నారు.

# జనాభా ప్రాతిపదికన నిధులివ్వాల్సిందే!

## - కేంద్ర హోంశాఖ కార్యదర్శికి ఎపి ప్రభుత్వం స్పష్టీకరణ

**విజయవాడ,ఏప్రిల్10,ప్రభాతవార్తప్రతినిధి:** సంయుక్త ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి నిధులతోనే ఏర్పాటు చేసినందున జనాభా ప్రాతిపదికన వాటిని పంపిణీ చేయాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది.రాష్ట్ర విభజన జరిగి దశాబ్దం దాటిపోయినా ఇప్పటికీ ఆస్తులు పంపకాలు పూర్తిస్థాయిలో జరగలేదు. విభజన చట్టం ప్రకారం 9వ షెడ్యూల్‌లో ఉన్న ఆస్తులను జనాభా ప్రాతిపదికన పంపకాలు చేపట్టాలని కేంద్ర హోంశాఖను రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఉమ్మడి రాష్ట్రంలో ఈ ఆస్తులన్నీ ఉమ్మడి నిధులతోనే ఏర్పాటు చేసినందున ఆ మేరకు నిర్ణయం తీసుకోవాలని తెలిపింది. ఇప్పటి లెక్కల ప్రకారం ఆ ఆస్తుల విలువ 21 వేల కోట్లకు పైగానే ఉందని, అందులో 14 వేల కోట్లు ఏపీకి ఇవ్వాలని తేల్చి చెప్పింది.ఈ మేరకు కేంద్ర హోంశాఖ కార్యదర్శికి స్పష్టం చేసింది. ఉమ్మడి ఏపీ విభజన అంశాలపై దిల్లీలోని కేంద్రహోంశాఖ కార్యాలయంలో కీలక సమావేశం జరిగిన నేపథ్యంలో సమావేశంలోని అంశాలపై ఏపీ సీఎంవో నుంచి సమాచార పత్రాన్ని విడుదల చేసింది. హోంశాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి ఏపీ, తెలంగాణ సీఎస్‌లు, ఇతర అధికారులు హాజరయ్యారు. ఇరు రాష్ట్రాల మధ్య ఇంకా పరిష్కారం కాని ప్రధానాంశాలపై అధికారులు చర్చించారు. విభజన చట్టం ప్రకారం కేంద్రం నుంచి రావాల్సిన నిధులపైనా ఈ భేటీలో చర్చ జరిగినట్లు సమాచారం.ఇటీవల కేంద్ర హోం శాఖ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐఎఎస్ అధికారి గోవింద్ మోహన్ తొలిసారి ఏపీ విభజన చట్టంపై సమీక్ష చేపట్టారు. దాదాపు రెండు సంవత్సరాల తర్వాత విభజన చట్టం అమలుపై కేంద్ర హోం శాఖ కార్యదర్శి అధ్యయనం చేస్తూ చర్చలు జరిపారు. రాష్ట్ర విభజన చట్టం 9, 10 షెడ్యూల్‌లో పేర్కొన్న సంస్థల విభజన, ఆస్తులు, అప్పుల పంపకాలపై ఎక్కువ చర్చ జరిగినట్లు సమాచారం. ఇరు రాష్ట్రాలు సమన్వయంతో అన్ని సమస్యలు పరిష్కరించుకోవాలని, ప్రస్తుత ప్రభుత్వాలు సానుకూల దృక్పథంతో ఉన్నాయన్నట్లు వెల్లడించారు. వాతావరణం సానుకూలంగా ఉన్నప్పుడే సమస్యలు కూడా త్వరగా పరిష్కారం అవుతాయని అధికార వర్గాలు వెల్లడించినట్లు తెలుస్తోంది. ఈ షెడ్యూల్లోని సంస్థలను విడివిడిగా కాకుండా అన్నింటినీ ఒకేసారి పంపిణీ చేయాలని కోరింది.గతంలో కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ అధ్యక్షతన ఫిబ్రవరి 3న ఇరురాష్ట్రాల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆస్తుల పంపకాల గురించి గట్టిగానే తేల్చి చెప్పారు. విశ్రాంత ఐఎఎస్ షీలా బిడే నేతృత్వంలోని నిపుణుల కమిటీ ఏపీఎస్‌ఎఫ్‌సీ మినహా మిగిలిన 90 సంస్థల విభజనకు సిఫార్సు చేసింది. 24 వేల 19 కోట్ల విలువైన ఆస్తులను జనాభా ప్రాతిపదికన 58:42 నిష్పత్తిలో పంచాలని సీఎస్ కేంద్ర హోంశాఖకు తెలియజేశారు. అందులో ఏపీ వాటా కింద 14 వేల 2 కోట్లు వస్తాయని స్పష్టం చేశారు. అయితే తెలంగాణ మాత్రం 21 వేల 28 కోట్లు అడిగింది. నిపుణుల కమిటీ మాత్రం ఏపీకి 7 వేల 127 కోట్లు, తెలంగాణకు 16 వేల 891 కోట్లు పంచాలని సిఫార్సు చేసింది.9వ షెడ్యూల్‌లోని ఆస్తులన్నీ అవి భాజ్య ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి నిధులతో సృష్టించినవే కాబట్టి వీటిని జనాభా నిష్పత్తిలో పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కోరారు. నిపుణుల కమిటీ సిఫార్సుల్లో పేర్కొన్న 53 కంపెనీలు/ కార్పొరేషన్ల విభజన వరకు మాత్రమే ఇప్పటి వరకు ఒప్పందం కుదిరిందని. మరో 15 కంపెనీలు /కార్పొరేషన్లకు సంబంధించి చేసిన సిఫార్సులను తెలంగాణ ప్రభుత్వం అంగీ కరించింది తప్పితే ఏపీ అంగీకరించలేదని తెలిపారు. మిగిలిన 22 కంపెనీలు/ కార్పొరేషన్లపై నిపుణుల కమిటీ సిఫార్సులను తెలంగాణ అంగీకరించలేదు. ఇప్పుడు రెండురాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరిన 53 కంపెనీలు/ కార్పొరేషన్ల విలువ కేవలం 187 కోట్లు మాత్రమే కాగా, 15 కంపెనీలు,.కార్పొరేషన్ల విలువ 4,389 కోట్లుగా ఉంది. తెలంగాణ అంగీకరించని 21 కంపెనీలు,కార్పొరేషన్ల విలువ ఏకంగా 19 వేల443 కోట్లు గా ఉంది. ఇరురాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరిన 53 సంస్థల విలువ చాల తక్కువగా ఉంది. అన్ని సంస్థల సమస్యలనూ ఒకే సారి పరిష్కరించడం మంచిదని సీఎస్ కేంద్ర హోంశాఖకు తెలిపారు. 2014- 15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర ప్రాయోజిత పథకాల్లో తెలంగాణ వాటా కింద ఏపీ నుంచి 495.21 కోట్లు రావాల్సి ఉందని తెలంగాణ సీఎస్ కోరగా రెండు రాష్ట్రాల మధ్య పంపిణీ చేయాల్సిన కేంద్ర ప్రాయోజిత పథకాల వాటాను, అలాగే ఉమ్మడి సంస్థ లపై ఇరురాష్ట్రాలు పెట్టిన ఖర్చుల లెక్కలను త్వరగా తేల్చాలని కాగ్‌కు లేఖ రాయనున్నట్లు కేంద్ర హోంశాఖ కార్యదర్శి హామీ ఇచ్చారు. అలాగే విశాఖ రైల్వేజోన్ కార్యకలాపాలు త్వరగా ప్రారంభించాలని రాష్ట్ర అధికారులు కోరారు. దీనికి రెండేళ్ల సమయం పడుతుందని రైల్వే అధికారులు బదులిచ్చారు. తాత్కాలిక ప్రాతిపదికపై అయినా ప్రారంభించాలని కేంద్రం హోంశాఖ కార్యదర్శి రైల్వే అధికారులకు సూచించారు.

హైదరాబాద్‌అమరావతి మధ్య హైస్పీడ్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణానికి తక్షణం డీపీఆర్ తయారు చేయాలని ప్రభుత్వ ప్రధాని కార్యదర్శి విజ్ఞప్తి చేయగా దీశిళి తయారీతోపాటు ఈ ప్రాజెక్ట్‌కు సూత్రప్రాయ ఆమోదముద్ర వేసే అంశాన్ని పరిశీలించాలని కేంద్ర హోంశాఖ రవాణాశాఖ అధికారులను కోరింది. అలాగే హైదరాబాద్ విజయవాడ మధ్య ఉన్న జాతీయ రహదారిని ఆరువరుసలుగా విస్తరించే అంశంపైనా ఈ సమావేశంలో చర్చించారు. దీనికి సంబంధించిన దీశిళి మొదలుపెట్టామని, ఇప్పటికే రైట్ ఆఫ్ వే అందుబాటులో ఉన్నందున అదనంగా భూసేకరణ చేయాల్సిన అవసరం లేదని కేంద్ర రహదారి, రవాణాశాఖ కార్యదర్శి స్పష్టం చేశారు. దీంతో హోంశాఖ కార్యదర్శి ఈ విస్తరణ పనులను వేగవంతం చేయాలని సీఎస్ సూచించారు. విదేశీ సంస్థల నుంచి ఉమ్మడి రాష్ట్రంలో తీసుకున్న అప్పుల వ్యవహారంలో న్యాయ సలహా ప్రకారం వెళ్లాలని హోం శాఖ కార్యదర్శి సూచించారు. దీనికి ఇరు రాష్ట్రాలు తమ అడ్వకేట్ జనరల్ నుంచి అభిప్రాయం తీసుకుంటామని చెప్పగా, త్వరగా తీసుకోవాలని హోం కార్యదర్శి చెప్పినట్లు సమాచారం. ఇరు రాష్ట్రాల ఏజీలు చెప్పే అభిప్రాయానికి అనుగుణంగా తదుపరి భేటీలో ఒక నిర్ణయం తీసుకుందామని వెల్లడించిన హోం శాఖ కార్యదర్శి. విభజన, ఆస్తులు, అప్పుల పంపకాల విషయంలో రెండు రాష్ట్రాలకు హోం కార్యదర్శి కీలక సూచనలు చేసినట్లు సమాచారం. 20 సంస్థలకు సంబంధించిన నిధుల పంపకాల్లో ఉన్న సమస్యలపై ఇరువురు సానుకూల దృక్పదంతో ఉండాలని కేంద్ర హోం కార్యదర్శి తెలిపారు. రాష్ట్ర ఉన్నతాధికారుల స్థాయిలోనే అవకాశం ఉన్నంత వరకు పరిష్కారానికి ప్రయత్నం చేయాలని, లేనిపక్షంలో ప్రభుత్వాధినేతతో చర్చించి కొలిక్కి తీసుకురావాలని సూచించారు. తమకే ఎక్కువ రావాలని ఇద్దరూ పట్టుపడితే, ఇద్దరికీ నష్టం వస్తుందని హితవు పలికినట్లు సమాచారం. ఒకరి అభిప్రాయం మరొకరు కాదని కోర్టుకు వెళితే, కేంద్రంగా తాము ఏమీ చేయలేమని, ఎప్పటికి తేలుతుందో కూడా చెప్పలేని పరిస్థితి రావొచ్చని హోం శాఖ కార్యదర్శి అన్నట్లు సమాచారం. రెండు రాష్ట్రాల్లో మౌలిక వసతుల ప్రాజక్టులకు తమ పూర్తి మద్దతు ఉంటుందన్నారు.

# జయంతి వేడుకలకు ముస్తాబైన కొండగట్టు

**మల్యాల ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన జగిత్యాల జిల్లా మల్యాల మండలం లోని కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయం లోఈనెల 11 నుండి 13 వరకు జరిగే చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలకు ముస్తాబయింది, అంజన్న దీక్షలు చేపట్టిన వేలాదిమంది భక్తులు ఉత్సవాల సందర్భంగా కొండగట్టుకు భారీ ఎత్తున తరలి వస్తుంటారు, ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ , జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ల ఆధ్వర్యంలో ఇప్పటికే మూడుసార్లు జయంతి ఉత్సవాలపై వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశాలతో పాటు ఆలయంలో అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టేందుకు పరిశీలన జరిపి అధికారులు సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు, వివిధ శాఖల అధికారులు సమన్వయ తో మూడు రోజులు జరిగే జయంతి కి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా భారీ ఎత్తున ఏర్పాట్లు సిద్ధం చేశారు, ఇప్పటికే తెలంగాణ నలుమూలల నుండి వేలాదిగా భక్తులు కొండగట్టుకు చేరుకొని స్వామివారి సన్నిధిలో దీక్షలు విరమణ చేపడుతుండగా, జయంతికి హనుమాన్ దీక్ష స్వాము లతోపాటు సాధారణ భక్తులు సుమారు 2 లక్షల పైగానే వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు, 11,21,41 రోజుల దీక్షలు చేపట్టిన భక్తులు తమ మాల విరమణ కొండగట్టు అంజన్న సన్నిధిలో చేసుకోవడం ఆనవాయితీగా వస్తుంది,, ఇందుకోసం తెలంగాణ తోపాటు పక్క రాష్ట్రాలైన చత్తీస్గడ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుండి కూడా భక్తులు తమ దీక్షలను కొండగట్టులో విరమించేందుకు తరలి రానున్నారు, ఇదిలా ఉండగా, జయంతి ఏర్పట్లలో భాగంగా దొంగల మర్రి, దిగువ స్టేజీ , వై జంక్షన్ ల వద్ద స్వాగత తోరణాలను, ఘాట్ రోడ్డు మార్గంలో భక్తులకు అందుబాటులో చలివేంద్రాలు, బొజ్జ పోతున్న ఆలయం వద్ద వాహనాలకు పార్కింగ్ ఏర్పాటు చేశారు, అంతే కాకుండా ఆలయంలో ఇప్పుడున్న కెమెరాలకు అదనంగా 68 చోట్ల సిసి కెమెరాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్ తోపాటు అవుట్ పోస్ట్ వద్ద నిఘా తో పాటు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగ కుండా ఏర్పాట్లు చేశారు,దీక్ష ల విరమణకు వచ్చే స్వాముల తో పాటు సాధారణ భక్తుల రద్దీ కూడా విపరీతంగా ఉండే అవకాశం ఉన్నందున సాధారణ భక్తులకు నేరుగా దర్శనానికి ప్రత్యేకించి ఫుట్ ఓవర్ బ్రిడ్జిని కూడా ఏర్పాటు చేశారు, ఆలయ పరిసరాలలో చలువ పందులను ఏర్పాటుతోపాటు,, భక్తులకు అత్యవసర సేవలందించేందుకు వైద్య సిబ్బంది తో శిబిరాలను ఏర్పాటు చేశారు,

ఆట



# బిల్లీ జీన్ కింగ్ కప్‌లో భారత్ తొలి విజయం

## హైదరాబాదీ అమ్మాయి రష్మిక గెలుపు

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా ఓసియానియా గ్రూప్-1 మహిళల టీమ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత్ ఖాతాలో తొలి విజయం చేరింది. తొలి రోజు న్యూజిలాండ్ చేసిలో 1-2తో ఓడిపోయిన భారత్ వెంటనే తేరుకుంది. థాయ్‌లాండ్ జట్టుతో జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 2-1తో గెలుపొందింది. భారత్‌కు తొలిసారి ప్రతినిధ్యం వహిస్తున్న హైదరాబాదీ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక థాయ్‌లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ శుభారంభం అందింది. ప్రపంచ 170వ ర్యాంకర్, థాయ్‌లాండ్‌కు చెందిన లానియానా తారారుడితో జరిగిన తొలిన సింగిల్స్‌లో ప్రపంచ 345వ ర్యాంకర్ రష్మిక 6-2, 6-4తో సంచలన విజయం సాధించింది. 75 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక నాలుగు ఏస్‌లు సంధించింది తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగు సార్లు బ్రేక్ చేసింది. కాగా రెండో మ్యాచ్‌లో భారత్‌కు నిరాశే ఎదురైంది. భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న మరో హైదరాబాదీ అమ్మాయి యామలపల్లి సహజ మూడో సెట్‌లో గాయం కారణంగా వైదొలగింది. థాయ్‌లాండ్‌కు చెందిన మనాన్‌చాయతో జరిగిన మ్యాచ్‌లో సహజ తొలి సెట్‌ను 3-6తో కోల్పోయింది. రెండో సెట్‌ను టైబ్రేక్‌లో 7-6 (7/3)తో సొంతం చేసుకుంది. మూడో సెట్‌లో సహజ 0-1తో వెనుబడిన దశలో గాయం కారణంగా తప్పుకుంది. ఫలితంగా థాయ్‌లాండ్ స్కోరును 1-1తో సమం చేసింది. ఇక నిర్ణయక మూడో మ్యాచ్‌లో అంకిత రైనా-ప్రార్థన తొంబారే ద్వయం సత్తా చాటుకుంది. థాయ్‌లాండ్ ద్వయం పింగ్ టార్న్-పట్‌చారిన్‌తో జరిగిన డబుల్స్‌లో అంకిత-ప్రార్థన 7-6 (7/3), 3-6, 10-3తో సూపర్ టైబ్రేక్‌లో గెలిచి భారత్‌కు 2-1తో విజయాన్ని ఖరారు చేసింది.



# ఆర్య-రుద్రాంక్ష్ జోడీకి రజతం

## షూటింగ్ వరల్డ్ కప్‌లో భారత్ ఖాతాలో ఏడో పతకం

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య ప్రపంచ కప్ టోర్నమెంట్‌లో భారత్ ఖాతాలో 7వ పతకం చేరింది. దీంతో ఇప్పటి వరకూ భారత్‌కు 4 స్వర్ణాలు, 2 రజతాలు, ఒక కాంస్యతంలో కలిపి 7 పతకాలతో రెండో స్థానంలో ఉంది. ఇక మ్యాచ్ విషయానికి వస్తే అర్జెంటీనాలో జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో ఆర్య బోర్సే-రుద్రాంక్ష్ బాలాసాహెబ్ పాటిల్ జోడీ రజత పతకం సొంతం చేసుకుంది. ఫైనల్లో ఆర్య-రుద్రాంక్ష్ ద్వయం 9-17 పాయింట్ల తేడాతో చైనాకు చెందిన జిఫె వాంగ్-బుహాన్ సాంగ్ జోడీ చేతిలో ఓడిపోయింది. కాంస్య పతక మ్యాచ్‌లో భారత్ జంట నర్మద నితిన్ రాజు-అర్జున్ బబూటా 13-17 పాయింట్ల తేడాతో అర్జెంటీనా జంట ఫెర్నాండా రుసో-మార్సెలో జూలియన్ గిటిరెజ్ చేతిలో ఓడిపోయింది. మహిళల ట్రాప్ ఈవెంట్‌లో భారత్ షూటర్లు నిరాశపరిచారు. నీరూ 115 పాయింట్లతో 12వ స్థానంలో, ప్రగతి దూబే 110 పాయింట్లతో 17వ స్థానంలో, భవ్య త్రిపాఠి 106 పాయింట్లతో 26వ స్థానంలో నిలిచారు. పురుషుల ట్రాప్ ఈవెంట్‌లోనూ భారత్ షూటర్లు ఎవరూ ఫైనల్‌కు చేరలేకపోయారు. జోరావర్ సింగ్ సంధూ 119 పాయింట్లతో ఏడో స్థానంలో, పృథ్వీరాజ్ 117 పాయింట్లతో 16వ స్థానంలో, లక్షయ్ 115 పాయింట్లతో 21వ స్థానంలో నిలిచారు. అయితే టాప్-6లో నిలిచిన వారు మాత్రమే ఫైనల్‌కు అర్హత సాధిస్తారు.



### బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో

# సింధు శుభారంభం


## ఇంటిదారి పట్టిన ఆకర్షి, అనుపమ, మాళవిక

## పురుషుల సింగిల్స్‌లో ఫైనల్‌కు కిరణ్, ప్రియాన్షు

**న్యూఢిల్లీ:** ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ టోర్నీలో భారత్ స్టార్ షట్లర్ పివి సింధు శుభారంభం చేసింది. చైనాలో జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 17వ ర్యాంకర్ సింధు 21-15, 21-19తో ప్రపంచ 36వ ర్యాంకర్, ఇండోనేషియాకు చెందిన ఎస్తర్ నురుమి వోర్డోయోపై గెలిచింది. 44 నిముషాల పాటు సాగిన ఈ పోరులో వరుస గేమ్‌ల్లో విజృంభిన సింధు 19 ఏళ్ల ప్రత్యర్థికి ఏ మాత్రం అవాకశాం ఇవ్వలేదు. ఇక ప్రి క్వార్టర్ ఫైనల్లో సింధు వరల్డ్ నాలుగో ర్యాంకర్ జపాన్‌కు చెందిన అకానె యామగుచితో తలపడనుంది. ఇక ఇతర మ్యాచ్‌ల్లో ఆకర్షి కశ్యప్, అనుపమ ఉపాధ్యా, మాళవిక బన్సోద్ ఓటమి పాలై ఇంటిదారి పట్టారు. ఆకర్షి 13-21, 7-21తో నప్రపంచ మూడో ర్యాంకర్, చైనాకు చెందిన హాన్ యూ చేతిలో ఓటమి చెందింది. ఇక అనుమ 13-21, 14-21తో ప్రపంచ 13వ ర్యాంకర్, థాయ్‌లాండ్‌కు చెందిన రచనోక్ ఇంతనోన్ చేతిలో పరాజయం పాలైంది. అలాగే మాళిక 14-21, 8-21తో చైనాకు చెందిన గావ్ ఫెంగ్ జై చేతిలో ఓడింది. కాగా పురుషుల సింగిల్స్‌లో భారత్ స్టార్ ఆటగాళ్లు లక్ష్యసేన్, హెచ్‌ఎస్ ప్రణయ్ తొలి రౌండ్‌లోనే పరాజయం పాలవగా, కిరణ్ జార్జి, ప్రియాన్షు రజావత్ ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరారు. తొలి రౌండ్‌లో లక్ష్యసేన్ 18-21, 10-21తో చైనీస్ తైపీకి చెందిన లీ చయ్ హౌ చేతిలోను, ప్రణయ్ 16-21, 21-12, 11-21తో చైనాకు చెందిన జూ గువాంగ్ లూ చేతిలో పరాజయం చెందారు. కిరణ్ జార్జి 21-16, 21-8తో కజకిస్తాన్‌కు చెందిన దిమిత్రి పనారిన్‌పై, ప్రియాన్షు 29-22, 21-12, 21-10తో థాయ్‌లాండ్‌కు చెందిన వాంగ్ చరోయెన్‌పై విజయం సాధించారు. అలాగే మహిళల డబుల్స్‌లో ప్రియా-శ్రుతి మిశ్రా జోడీ 11-21, 13-21తో చైనా జోడీ షూ యెన్ సంగ్-చైన్ హుయి యూ చేతిలో ఓడింది. పురుషుల డబుల్స్‌లో హరిహరన్-రూబన్ ద్వయం 21-3, 21-12తో శ్రీలంక జంట మధుక దులంజన, లహిరు వీరసింఘేపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు అర్మత సాధించగా, పృధ్వీ-సాయి ప్రతీక్ జంట 19-21, 12-21తో చైనా ద్వయం చై సింయాంగ్ చైవాంగ్-చీలిన్ చేతిలో ఓడి టోర్నీ నుండి నిష్క్రమించింది.

# కొత్త జట్లలో జోష్

## దంచికొడుతున్న ప్లేయర్లు.. ఫ్రాంచైజీల అంచనాలు తారుమారు



**ఢిల్లీ:** వద్దనుకున్న ఫ్రాంచైజీలు అసూయపడేలా పలువురు ప్లేయర్లు దంచి కొడుతున్నారు. ప్రస్తుత ఐపీఎల్ మ్యాచ్‌ల్లో అద్భుతాలు సృష్టిస్తున్నారు. ఈ సీజన్‌కు సంబంధించి జరిగిన వేలంలో పాత ఫ్రాంచైజీలు వద్దని వదిలేసిన వారే ఇప్పుడు తాము చేరిన కొత్త జట్లలో సత్తా చూపుతున్నారు. అంతటితో ఆగకుండా పాత జట్ల నిర్వాహకులు అసూయపడేలా ఆడుతున్నారు. తమ ఆటలో జోష్ పెంచి అదరగొడుతున్నారు. కోల్‌కతా నైట్ రైడర్స్ గత ఏడాది టైటిల్ గెలుచుకోగా, ఆ జట్టును నడిపించిన శ్రేయస్ అయ్యర్‌ను మేనేజ్‌మెంట్ పక్కన పెట్టింది. దీంతో 2025 మెగా వేలంలో పంజాబ్ కింగ్స్ అతడిని రూ.26.50 కోట్లకు దక్కించుకుంది. అంతే కాదు సారథ్య బాధ్యతలు ఇచ్చింది. ఇప్పటి వరకు పంజాబ్ మూడు మ్యాచుల్లో రెండింటిలో విజయం సాధించింది. తొలి మ్యాచ్‌లో శ్రేయస్ సెంచరీ జస్ట్ మిస్ అయింది. రెండో మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ చేశాడు. మూడో మ్యాచ్‌లో కాస్త నిరాశపరిచినా, తొలి రెండు మ్యాచుల్లో నాటౌట్‌గా నిలవడం గమనార్హం. ఇక మూడో మ్యాచ్‌లో (రాజస్థాన్‌పై) ఐదు బంతుల్లో 10 పరుగులు చేసి ఔటయ్యాడు. గత సీజన్‌లో 15 మ్యచుల్లో 351 పరుగులు చేసిన అయ్యర్, ఇప్పుడీ ఎడిషన్‌లో మూడింట్లోనే 159 పరుగులు రాబట్టాడు. అలాగే గత సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడిన అజింక్య రహానె ఇప్పుడు కోల్‌కతా నైట్‌రైడర్స్ కెప్టెన్‌గా మారాడు. ఇప్పుడు ఓపెనర్‌గా శుభారంభం ఇస్తున్నారు. నాలుగు మ్యాచుల్లోనే గత సీజన్‌తో పోలిస్తే సగం పరుగులు (123) సాధించాడు. దీంతో ఇప్పుడు సీఎస్కే ఎందుకు వదులుకున్నామోనని బాధపడుతుంది. ఎందుకంటే మిడిలార్డర్‌లో చెన్నైకు సరైన ప్రత్యామ్నాయమే లేకుండా పోయింది. ఇక సూపర్ స్టార్టర్ మిచెల్ ఐపీఎల్ 2025 సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌కు మిచెల్ మార్ష్ సూపర్ స్టార్ట్‌లను ఇస్తున్నాడు. నాలుగు మ్యాచుల్లో 184 పరుగులు సాధించాడు. డికాక్‌ను కాదని మిచెల్ తీసుకున్న ఎల్ఎస్‌జీ జట్టుకు కలిసివచ్చిందని చెప్పాలి. అతడు బౌలింగ్ కూడా మరోసానుకూలాంశం. గత ఏడాది దిల్లీ తరఫున ఆడిన అతడు, కేవలం 4 మ్యాచుల్లో 61 పరుగులు చేశాడు. ఆ టీమ్ రిటైన్ చేయడం వల్ల ఇప్పుడు లక్నోలోకి వచ్చి అదరగొడుతున్నాడు. అలాగే దాదాపు ఆరేళ్ల పాటు, రాజస్థాన్ రాయల్స్ జట్టుకు ప్రాతినిథ్యం వహించిన జోస్ బట్లర్‌ను ఈసారి గుజరాత్ టైటాన్స్ తీసుకుంది. ఇప్పటి వరకు జరిగిన మ్యాచుల్లో తన వంతు న్యాయం చేస్తున్నాడు. ఇప్పటికే 166 పరుగుల రాబట్టాడు. దీంతో గుజరాత్ అభిమానుల్లో ఫుల్ జోష్ నింపుతున్నాడు. ఆర్ఆర్ టీమ్ ఆలోచించుకునే విధంగా చేస్తున్నాడు. కాగా గత సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున ఆడిన నితీశ్ రాణా కేవలం రెండు మ్యాచులు ఆడి 42 పరుగులు సాధించాడు. ఆ టీమ్ వదిలేయడం వల్ల హర్ట్ అయ్యాడు. ఆ తర్వాత మెగా వేలంలో రాజస్థాన్ రాయల్స్ గూటికి చేరాడు. అయితే తొలి రెండు మ్యాచుల్లో ఫెయిల్ అవ్వడం వల్ల విమర్శలు ఎదుర్కొన్నాడు. కానీ రీసెంట్‌గా చెన్నైపై 81 పరుగులు చేశాడు. దూకుడుగా ఆడేందుకు ప్రయత్నిస్తున్నాడు. మొత్తానికి ఈ ఐదుగురు ప్లేయర్లను ఎందుకు వదులుకున్నామోనని పాత ఫ్రాంఛైజీలు బాధపడుతుండటం గమనార్హం.



### ఐసిసి మహిళల వన్డే వరల్డ్ కప్


# క్వాలిఫయర్‌లో బంగ్లాదేశ్ గెలుపు

## 178 రన్స్ తేడాతో థాయ్‌లాండ్ చిత్తు

**న్యూఢిల్లీ:న**ఐసీసీ మహిళల వన్డే వరల్డ్ కప్ క్వాలిఫయర్-2025 టోర్నమెంట్‌లో థాయ్‌లాండ్ చిత్తుగా ఓడింది. 178 పరుగుల భారీ తేడాతో బంగ్లాదేశ్ అఖండ విజయం సాధించింది. లాహోర్‌లో గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్లు నష్టానికి 271 పరుగులు చేసింది. కెప్టెన్ నిగార్ సుల్తానా 80 బంతుల్లో 101 పరుగులు, 15 ఫోర్లు, ఒక సిక్స్‌తో విధ్వంసకర శతకంతో విరుచుకుపడింది. అలాగే షర్మిన్ అక్తర్ 126 బంతుల్లో 94 రన్స్, 11 ఫోర్లు చేసి సెంచరీకి చేరువై అజేయంగా నిలిచింది. ఓపెనర్ ఫర్జానా హక్ 53 పరుగులతో అర్ధ సెంచరీ చేసి రాణించింది. అనంతరం భారీ లక్ష్య ఛేదనకు దిగిన పసికూన థాయ్‌లాండ్ బంగ్లా స్పిన్నర్లు ఫహిమ ఖాతూన్ (8.5-1-21-5), జన్నతుల్ ఫిర్దౌస్ (5-3-7-5) చెలరేగడంతో 23.5 ఓవర్లలో 93 పరుగులకే కుప్పకూలింది. థాయ్ ఇన్నింగ్స్‌లో కేవలం ముగ్గురు మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. చనిద 22 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచింది. ఈ గెలుపుతో బాంగ్లాదేశ్ వరల్డ్ కప్ క్వాలిఫయర్స్‌లో బోణీ కొట్టింది.

# రూ.వెయ్యి కోట్ల ల్యాప్‌టాప్ ప్లాంట్

**చెన్నై, ఏప్రిల్ 10:** ఎలక్ట్రానిక్స్ తయారీ సేవల దిగ్గజం డిక్సన్ టెక్నాలజీస్, చెన్నైకి దగ్గర్లోని ఒరగాడంలో రూ.వెయ్యి కోట్లతో ప్లాంటును ఏర్పాటు చేయనుంది. దీనితో ప్రాంతీయంగా 5వేల పైచిలుకు ఉద్యోగాల కల్పన జరుగుతుందని అంచనా. ప్లాంట్ నెలకొల్పడానికి సంబంధించి తమిళనాడు ప్రభుత్వంతో కంపెనీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్లాంటులో ఇతర కంపెనీల కోసం ల్యాప్‌టాప్‌లు, ఆల్ ఇన్ వన్ పర్సనల్ కంప్యూటర్లు మొదలైన వాటిని ఉత్పత్తి చేయనుంది. ఇందులో త్వరలోనే హెచ్‌పి ల్యాప్‌టాప్‌ల తయారీ ప్రారంభమవుతుందని తమిళనాడు పరిశ్రమల శాఖ మంత్రి టిఆర్‌బి రాజా తెలిపారు. తమిళనాడు ప్రభుత్వం 100 బిలియన్ డాలర్ల ఎలక్ట్రానిక్స్ తయారీ వ్యవస్థను నిర్మించడంపై దృష్టిపెట్టిన నేపథ్యంలో ఇది ప్రాధాన్యం సంతరించుకుంది. డిక్సన్ టెక్నాలజీస్



1993లో ఏర్పాటైంది. శాంసంగ్, షావోమీ, మోట రోలా, బోట్, వన్ ప్లస్ తది తర సంస్థల కోసం కాంట్రాక్ట్ తయారీ సేవలను అందిస్తోంది.

# ట్రంప్‌పై ఇన్‌సైడర్ ట్రేడింగ్ ఆరోపణలు!

**వాషింగ్టన్, ఏప్రిల్ 10:** భాగస్వామ్య దేశాలపై విధిం చిన సుంకాలను 90 రోజుల పాటు నిలిపి వేస్తున్నట్లు ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. మొదటినుంచీ వెనక్కి తగ్గేది లేదంటూ ప్రకటనలు చేసిన ఆయన, ఒక్క చైనా మినహా మిగిలిన దేశాలకు తాత్కాలిక ఊరట కల్పించారు. ఈ నేపథ్యంలో అమెరికా స్టాక్ మార్కెట్లు దూసుకెళ్లాయి. అయితే, సుంకాల మినహాయింపు ప్రకటన కంటే ముందు ట్రంప్ సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టు వివాదానికి కారణమైంది. ఆయన ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారంటూ డెమోక్రట్లు ఆరోపిస్తున్నారు. వివిధ దేశాలపై సుంకాల వాయిదా ప్రకటనకు ముందు ఉదయం డొనాల్డ్ ట్రంప్ ట్రూత్ సోషల్‌లో అధికారిక హ్యాండిల్ నుంచి కొన్ని పోస్టులు పెట్టారు. బి కూల్: అంతా సక్రమంగా జరుగుతుంది. అమెరికా ఇంతకుముందుతో పోలిస్తే మరింత మెరుగుగ్గా రాణిస్తుంది అని తొలుత ఓ పోస్ట్ పెట్టారు. కాసే పటి తర్వాత కొనుగోలుచేయడానికి ఇదే సరైన సమయం అంటూ మరో పోస్ట్‌పెట్టారు. చివర్లో దీరిగి అని జోడించారు. డొనాల్డ్ ట్రంప్‌మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ కార్పొరేషన్‌ను డీజేటీగా వ్యవ హరిస్తారు. సుంకాలపై ట్రంప్ అనూహ్య నిర్ణయం అక్కడికి కొన్ని గంటల తర్వాత సుంకాలపై డొనాల్డ్ ట్రంప్



తన నిర్ణయం వెలువరించారు. ఈనేపథ్యంలో అమెరికా టెక్ సూచి అయిన నాస్‌డాక్ 12శాతం మేర రాణించింది. ఎస్అండ్‌పీ 500సూచి 9.5శాతం, డోజోన్స్ 8శాతం మేర లాభపడ్డాయి. డొనాల్డ్ ట్రంప్‌నకు చెందిన మీడియా కంపెనీ షేర్లు భారీగా పెరిగి 22.67శాతం మేర లాభాల్లో ముగిశాయి. ఈ కంపెనీలో ట్రంప్‌నకు 53శాతం మేర వాటా ఉంది. దీంతో ఆయన వ్యక్తిగత సంపద 415 మిలియన్ డాలర్ల మేరకు పెరిగింది. ఈ మీడియా సంస్థను ట్రంప్ కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ నిర్వహిస్తున్నారు. కొన్ని గంటల తర్వాత టారిఫ్‌లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటిం చడం, ఆపై అమెరికా స్టాక్ మార్కెట్లు రాణించడం గమనార్హం. ఇన్‌సైడర్ ట్రేడింగ్ అంటున్న డెమోక్రట్లు ఈ నాటకీయ పరిణామాలపై డెమోక్రట్ సెనేటర్ ఆడమ్ స్కిఫ్ తొలుత దీనిపై గళమెత్తారు. ట్రంప్ ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారని లేదా మార్కెట్ అవతవకలకు పాల్పడ్డా రంటూ ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించాల్సిన అవసరం ఉందని పేర్కొ న్నారు. తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఇదంతా చేస్తున్నారంటూ వర్జీనియాకు చెందిన మరో సెనేటర్ టిమ్ కైన్ ఆరోపించారు. మరికొందరు డెమోక్రట్లు సైతం ఇదేతరహా అభిప్రాయం వ్యక్తంచేశారు. ఈనేపథ్యంలో ట్రంప్ పోస్ట్‌ను కామర్స్ సెక్రటరీ హోవర్డ్ లుట్నిక్ సమర్థించారు. అమెరికా గొప్ప దేశం అని చెప్పడం ఆయన ఉద్దేశమని పేర్కొన్నారు.

# ఇంటర్నేషనల్ బ్రాండ్‌గా పతంజలి!

**ముంబై, ఏప్రిల్ 10:** యోగా గురువు స్వామి రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణ కృషి కారణంగా పతంజలి ఆయుర్వేదం ఇప్పుడు దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా కొత్త వ్యూహాలతో ముందుకు వస్తోంది. పతంజలి ఆయుర్వేదం భారతీయ సాంప్రదాయ వైద్యం ఆయుర్వేదాన్ని ప్రోత్సహించే ప్రపంచ శక్తిగా అవతరించింది. ప్రపంచవ్యాప్తంగా సాంప్రదాయ ఆయుర్వేద జ్ఞానాన్ని వ్యాప్తి చేయాలనే కలను నెరవేర్చడంలో సంస్థ ముఖ్యమైన చర్యలు తీసుకుంటోంది. పతంజలి విదేశాల్లో ప్రజాదరణ పొందటానికి కారణం స్వదేశీ బ్రాండ్‌గా దానికి ఉన్న గుర్తింపు. పతంజలి కంపెనీ కేవలం ఒక వ్యాపారం మాత్రమే కాదని, మొత్తం సమాజం, మానవ సంక్షేమం పట్ల బాధ్యత వహించాలని యోగా గురువు స్వామి రాందేవ్ అన్నారు. ఇప్పుడు అది ఒక ఉద్యమంగా ముందుకు సాగుతోంది. రాందేవ్ మాట్లాడుతూ, పతంజలి ఉత్పత్తులు ప్రజలు సహజ జీవనశైలిని అలవర్చుకునేలా ప్రోత్సహిస్తాయి. విదేశాల్లోని వినియోగదారులు పతంజలి ఉత్పత్తులను ఎంతగానో ఆదరిస్తున్నారు.

అమెరికా, బ్రిటన్‌లో కూడా..

ప్రపంచంలోని అనేక దేశాలలో కోట్లాది మంది పతంజలి ఉత్పత్తులను ఉపయోగిస్తు న్నారు. ఈ ఉత్పత్తులు ఆధునిక, సేంద్రీయ, సాంప్రదాయ ప్రత్యామ్నాయాలకు పర్యాయపదంగా మారాయి. పతంజలి ఆరోగ్యం, విద్య, ఆధ్యాత్మికత, మానవ సంక్షేమానికి సంబంధించిన ఉత్పత్తులను తయారు చేయడంపై దృష్టి పెడుతోంది. పతంజలి సేంద్రీయ ద్రావణాల ప్రయోజనాల గురించి సమాచారాన్ని అందిస్తుంది. పతంజలి అంతర్జాతీయంగా తనను తాను విస్తరించుకుంది. అమెరికా, బ్రిటన్ వంటి దేశాలలో కూడా తన ఉనికిని పెంచుకోవాలని యోచిస్తోంది. ఇది కాకుండా, దాని ఉత్పత్తులు పతంజలి ఆన్‌లైన్ స్టోర్ నుండి వినియోగదారులకు సులభంగా లభిస్తాయి. పతంజలి ఆయుర్వేద తన ఉత్పత్తుల ద్వారా ఆరోగ్యం, వెల్నెస్‌ను ప్రోత్సహించడానికి చురుకుగా పనిచేస్తోంది. ఇందులో ఆహార పదార్థాలు, మందులు, శరీరసంరక్షణ ఉత్పత్తులు, మూలికావస్తువులు, పుస్తకాలు ఉన్నాయి. మార్కెట్లో లభించే ఇతర రసాయనాలతో కూడిన ఉత్పత్తుల కంటే తమ ఉత్పత్తులన్నీ సహజమైనవి, సేంద్రీయమైనవి, సురక్షితమైనవని కంపెనీ పేర్కొంది.




పతంజలి ఉత్పత్తుల ధర, సులభంగా లభ్యత కారణంగా వినియోగదారులు వాటి వైపు ఆకర్షితులవుతున్నారు. పతంజలి ఇటీవల డిజిటల్ మార్కెటింగ్, సోషల్ మీడియా, ఇకామర్స్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ప్రపంచంలోని అనేక దేశాలకు తన పరిధిని విస్తరించింది. పతంజలి బలమైన పంపిణీ నెట్‌వర్క్‌ను నిర్మించుకుంది. వ్యాపార భాగస్వామ్యాల ద్వారా కంపెనీ పెద్ద సంఖ్యలో ఖాతాదారులను అభివృద్ధి చేసుకుంది. ఆయుర్వేదం పట్ల ప్రజల్లో కొత్త విశ్వాసం ఏర్పడింది. దీని కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో పతంజలి ఉత్పత్తుల వినియోగం క్రమంగా పెరుగుతోంది. పతంజలి ఇటీవల మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఫుడ్ అండ్ హెర్బల్ పార్క్‌ను ప్రారంభించింది. రైతుల ఆదాయాన్ని పెంచడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. ఈ ప్రాజెక్టులో కంపెనీ మొదట రూ.700 కోట్లు పెట్టుబడి పెట్టింది. భవిష్యత్తులో రూ.1,500 కోట్ల పెట్టుబడి పెట్టాలని టార్గెట్‌గా పెట్టుకుంది. పతంజలి రైతుల నుండి నేరుగా కొనుగోలు చేయడానికి వీలుగా ఈ పార్కును నిర్మించారు. తద్వారా రైతులకు మెరుగైన మార్కెట్ లభిస్తుంది.

# ఒప్పందంపై తొందరపాటు లేదు.. పియూష్ గోయల్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితులు నెలకొన్నప్పటికీ 2024-25 ఆర్థిక సంవత్సరంలో వస్తు, సేవల ఎగుమతులు 820 బిలియన్ డాలర్లకు చేరినట్లు వాణిజ్య శాఖ వెల్లడించింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 6శాతం పెరిగినట్లు తెలిపింది. 2023-24లో ఎగుమతులు 778 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. వాణిజ్య శాఖ గణాంకాల ప్రకారం, 2024-25 ఏప్రిల్-ఫిబ్రవరి మధ్య కాలంలో ఉత్పత్తుల ఎగుమతులు 395.38 బిలియన్ డాలర్ల నుంచి 395.63 బిలియన్ డాలర్లకు చేరాయి. అలాగే సర్వీసుల ఎగుమతులు 311.05 బిలియన్ డాలర్ల నుంచి 354.90 బిలియన్ డాలర్లకు పెరిగాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను ఎగుమతులు, దిగుమతుల పూర్తి వివరాలను వాణిజ్య శాఖ ఏప్రిల్ 15న విడుదల చేయనుంది.అమెరికా టారాఫ్‌ల విధింపు నేపథ్యంలో ఎగుమతి



ప్రోత్సాహక మండళ్లు, పరిశ్రమ వర్గాలతో వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ సమావేశమయ్యారు. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం నెలకొన్న సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, అందుబాటులో ఉన్న అవకాశాలను వివరించారు. అంతర్జాతీయంగా వ్యాపార పరిస్థితుల్లో ఇటీవల తలెత్తిన సవాళ్లను అధిగమించడంలో ఎగుమతి సంస్థలకు తోడ్పాటు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి భరోసా ఇచ్చినట్లు వాణిజ్య శాఖ తెలిపింది. ఎర్రసముద్రం సంక్షోభం, ఇజ్రాయెల్-హమాస్ ఉద్రిక్తతలు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, కొన్ని సంపన్న ఎకానమీల్లో వృద్ధి నమ్మెదించడం తదితర సవాళ్ల నెలకొన్నప్పటికీ ఎగుమతులు వృద్ధి చెందడం సానుకూలాంశమని ఎగుమతి దారులు, పరిశ్రమను మంత్రి అభినందించారు. వివిధ రంగాలకు ప్రాతినిధ్యం వహించే ఎగుమతి ప్రోత్సాహక మండళ్ల ఈ సమావేశంలో తమ అభిప్రాయాలు, అంచనాలను తెలిపాయి. కష్టకాలంలో ఎగుమతి సంస్థలను ఆదుకునేందుకు ప్రభుత్వం క్రియాశీలక చర్యలు తీసుకోవాలని కోరాయి. అమెరికాతో ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం విషయంలో సమతుల్యత సాధించడంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందని మంత్రి చెప్పారు. దేశానికి ప్రయోజనం కలిగే విధంగా సరైన ఫలితాలను రాబట్టేందుకు ప్రభుత్వం వేగంగా పనిచేస్తోందని, అనవసర తొందరపాటు చర్యలు తీసుకోవడం లేదని మంత్రి పేర్కొన్నారు.

# వాణిజ్యం

## హాస్పిటాలిటీ రంగంలో భారీగా పెట్టుబడులు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10:** భారతదేశంలో భారీగా పెట్టుబడులు రానున్నాయి. 2028 నాటికి హాస్పిటాలిటీ రంగంలో 1బిలియన్ డాలర్ల పెట్టుబడులు అవచ్చే అవకాశాలు ఉన్నాయి. గత సంవత్సరం దశ్రశంలో 340 మిలియన్ల విలువైన హోటల్ లావాదేవీలు జరిగాయి. ఇందులో భాగంగా మరో మూడేళ్లలో భారీగా పెట్టుబడులు రానుండటంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సైతం లభించనున్నాయి. ఫ్రెంచ్ హాస్పిటాలిటీ దిగ్గజం అకార్ హోటల్స్ 2030 నాటికి భారతదేశంలో 300 హోటళ్లను ప్రారంభించాలని యోచిస్తోంది. అకార్ రెండు దశాబ్దాలకు పైగా భారతీయ విమానయాన సంస్థ ఇండిగో మాతృ సంస్థ అయిన ఇంటర్‌గ్లోబ్‌తో భాగస్వామ్యాన్ని కలిగి ఉంది. అలాగే దేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న మధ్య మార్కెట్ విభాగాన్ని సద్వినియోగం చేసుకోవడానికి రెండు



కంపెనీలు ఏర్పాటుచేసిన ఉమ్మడి సంస్థ ద్వారా పోర్ట్‌ఫోలియో నిర్వహించబడుతుంది. అకార్ అనేది ఒక ఫ్రెంచ్ బహుళజాతి హాస్పిటాలిటీ కంపెనీ. ఇది హోటళ్ళు, రిసార్ట్‌లు, వెకేషన్ ప్రాపర్టీలను నిర్వహిస్తుంది. అలాగే ఫ్రాంచైజ్ చేస్తుంది. ఇది యూరప్‌లో అతిపెద్ద హాస్పిటాలిటీ కంపెనీ. ప్రపంచవ్యాప్తంగా ఆరవ అతిపెద్ద హాస్పిటాలిటీ కంపెనీ. ప్రస్తుతం, అకార్‌కు భారతదేశంలో 71 హోటళ్లు ఉన్నాయి. మరో 40 హోటళ్లు నిర్మాణంలో ఉన్నాయి. రెండు ప్రధాన కంపెనీలు దేశంలోని తమ ప్రస్తుత యాజమాన్యంలోని ఆస్తులు, అభివృద్ధి, నిర్వహణ వ్యాపారాలను ఒకచోట చేర్చి స్వయం ప్రతిపత్తి కలిగిన, సమగ్ర వేదికను సృష్టిస్తాయని, ఇది దేశంలోనే అతిపెద్ద వాటిలో ఒకటిగా ఉంటుందని ఉన్నత అధికారులు మీడియా సమావేశంలో తెలిపారు. అయితే భారతదేశంలో కొత్తగా 300హోటళ్ల ఏర్పాటు కావడంతో యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.